## అధ్యాయము 2

# ఏదెను తోటలో మానవుడు మరియు స్త్రీ యొక్క సృష్టి

### 7వ రోజు: సృజించుట నుండి దేవుడు విశ్రమించుట (2:1–3)

**[1]ఆకాశమును భూమియు వాటిలోనున్న సమస్త సమూహమును సంపూర్తి చేయబడెను. [2]దేవుడు తాను చేసిన తన పని యేడవదినములోగా సంపూర్తిచేసి, తాను చేసిన తన పనియంతటినుండి యేడవదినమున విశ్రమించెను. [3]కాబట్టి దేవుడు ఆ యేడవదినమును ఆశీర్వదించి పరిశుద్ధపరచెను; ఏలయనగా దానిలో దేవుడు తాను చేసినట్టియు, సృజించినట్టియు తన పని అంతటినుండి విశ్రమించెను.**

సృష్టి గురించిన వివరణ 2:3 వరకు ఉంది కనుక 1:31 నుండి 2:1–3ని విడదీయడానికి సరైన కారణం కనిపించలేదు. ప్రారంభ సృష్టిలో దేవుడు చేసినదానికంతటికి ముగింపుగా, మొదటి అధ్యాయములో ఆరవ దినము తరువాత ఈ భాగము కలువబడవలసినది.

**వచనము 1. ఆకాశమును భూమియు వాటిలోనున్న సమస్త సమూహమును సంపూర్తిగా చేయబడెను** అని హెబ్రీ భాష నుండి NASBలో అక్షరాలా అనువదింపబడినది. ఏదేమైనా, “వాటిలోని సమస్త సమూహము”నకు బదులు NIVలో, “విశాల మోహరింపు” అని ఉంది. “మోహరము” అను మాట “ఆకాశములలోని” సూర్య, చంద్ర, నక్షత్రాదుల గురించి మాత్రమే కాక, కొందరు వాదించినట్లు, 1వ అధ్యాయములో చర్చించిన విధంగా, “భూమి”పియా ఉన్న మానవుడు మరియు సమస్త జీవరాసులు తమతమ వంతుచొప్పున మోహరింపబడెను అని ఇటువంటి అనువాదము సూచిస్తుంది.

“సమూహము” (צְבָאָם, *ts$^{e}$ba’am*) అను మాట పాతనిబంధనలో అనేక విధాలుగా వినియోగించబడింది కనుక ఈ వచనము యొక్క సంపూర్ణ భావమును ఖచ్చితంగా చెప్పుట కష్టతరము. మరిముఖ్యంగా, క్రమబద్ధీకరింపబడి, క్రమశిక్షణతో కూడి, వాటివాటి శ్రేణులు మరియు సహచరులతో ఉన్న

సమూహమును ఇది సూచిస్తుంది. తన శత్రువులకు ధీటుగా మోహరింపబడిన భుసంబంధమైన ఒక సైన్యము (21:22; న్యాయాధి. 4:2) లేదా దేవుని దుతక సముహముతో కూడిన "పరలోక సైన్యము"గా (1 రాజులు 22:19) దీనిని భావించవచ్చును. దేవుడు ఇశ్రాయేలీయుల కొరకు పోరాడినప్పుడు, ఆయన పరలోకసైన్యములను వినియోగించారు మరియు ఖడ్గము దూసి యెహోషువాకు ప్రత్యక్షమైన దూత తనను తాను "యెహోవా సేనాధిపతిగా" (צְבָא יְהוָה, *ts^e^ba' Yahweh*; యెహోషువా 5:14) యెహోషువాకు పరచయం చేసుకున్నాడు.

పురాతన తూర్పు దేశాలలో, "సమూహము" అనే పదమును దేవతలుగా ఆరాధించే ఆకాశసమూహములకు వాడేవారు (ద్వితీ. 4:19; 17:3; 2 రాజులు 17:16; 21:3). 2:1లో మానవుని గురించి ప్రస్తావించబడినా లేకపోయినా, పరలోక సైన్యము యొక్క విషయంలో రచయిత, ఆరాధింపదగిన లేదా భయపడదగిన దేవతల గురించి మాత్రం రాయలేదని స్పష్టంగా తెలియజేస్తున్నాడు. అవి దేవుని సృష్టిలో భాగము మాత్రమే మరియు ఆయన ఆజ్ఞ మేరకు వాటివాటి పనిని జరిగించుటకు అవి నియమించబడెను.

**వచనము 2. దేవుడు తాను చేసిన తన పని ఏడవదినములోగా సంపూర్తి చేసినట్లు** లేఖనభాగం చెబుతుంది. దేవుడు ఏడవ దినమున కూడా పనిచేసి ఆ దినములో ఏదోఒక సమయానికి పనిని పూర్తిచేసి విశ్రమించాడని అర్థమిచ్చునట్లు కొందరు వ్యాఖ్యానించారు. కాని ఈ సందర్భమును బట్టి అటువంటి ఆలోచన సరైనది కాదు. ఎందుకంటే, 1వ అధ్యాయం చివరిలో అప్పటికే దేవుడు విశ్వం మరియు అందులోని సమస్తమును చేసినట్లు ప్రస్తావించబడింది. దేవుడు తన సృష్టిని సర్వేక్షించి, అది "చాలమంచిది" అని ప్రకటించెను. ఆరవ దినము అయిన తరువాత, ఒకడు "మరికొన్నింటిని సృజించుటను" ఎదురు చూడడు కాని, విశ్వము, దానిలోని జీవరాశులలో నియమించిన నమూనా ప్రకారము, "పునరుత్పత్తి మరియు స్వీయమనుగడను" మాత్రమే ఎదురుచూచెను.[1]

"దేవుడు తాను చేసిన తన పని ... సంపూర్తి చేసి" అని 2:2లో చెప్పబడిన మాటను כָּלָה (*kalah*) అనే ఒక సంపూర్ణభూతకాల క్రియగా NIV పరిగణించడం జరిగింది: "దేవుడు [గతంలో] చేస్తూ ఉన్న పనిని ముగించెను." భూమ్యాకాశములను సృజించుట దేవుడు ముగించాడని 2:1లో రచయిత తెలియజేసాడు. "దేవుడు తాను చేసిన పని ఏడవ దినమున సంపూర్తి చేసి" అని RSV మరియు NRSV తర్జుమాలలో చెప్పబడినట్లు ఏడవ దినము వరకు దేవుడు సృష్టిని సంపూర్తి చేయలేదు అని చెప్పుట ద్వారా రచయిత తన మాతలను తానే వ్యతిరేకించుకొనుటలేదు. పంచకాండములో కొన్ని చోట్ల (17:22; 49:33; నిర్గమ. 40:33) ఈ విధానంలో క్రియాపదము వాడబడినప్పుడు, పని ముగింపబడిందని రూడిగా చెప్పబడుతుంది, మరియు కొన్ని ఆంగ్ల అనువాదములు కూడా సంపూర్ణభూతకాలమును వినియోగిస్తున్నాయి.[2]

దేవుడు తాను చేసిన తన పనియంతటినుండి ఏడవదినమున విశ్రమించెను. “విశ్రమించెను” అను పదము, మానవుడు ఆరు దినములు పని చేసిన తరువాత అలసిపోయినట్లు దేవుడు అలసిపోయాడని అర్థమునివ్వదు కాని, దానికి బదులు, దేవుడు తాను చేయుచున్న సృజనాత్మక పనియంతటిని ఏడవ దినమున “ఆపివేసెను” లేదా దానినుండి “దూరంగా ఉండెను” అని అర్థము. 2:2, 3లోని “విశ్రమించెను” అని తర్జుమా చేయబడిన హెబ్రీ క్రియాపదము *shabath* నుండి వచ్చినది, మరియు “విశ్రమించెను” అను మాటకు హెబ్రీ వాడబడిన పదము שָׁבַת (*shabath*) మరియు దాని నామవాచకము שַׁבָּת (*shabbath*), ఆంగ్ల బైబిల్ లో “సబ్బాత్”గా అనువదించబడింది. ఇశ్రాయేలీయులు తమ పని నుండి ఏడవదినమున విశ్రమించుట ద్వార దేవుని అనుకరించాలని హెబ్రీయుడైన రచయిత వారికి జ్ఞాపకం చేస్తున్నాడు. వాస్తవానికి, సబ్బాతును పాటించమని పది ఆజ్ఞలలో చెప్పబడుటకు దేవుడు విశ్రమించుటయే కారణం: “ఆరు దినములలో యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి, ఏడవదినమున విశ్రమించెను; అందుచేత యెహోవా విశ్రాంతిదినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధపరచెను” (నిర్గమ. 20:11).

ఇశ్రాయేలీయులు “ఏడవ దినమున” ఆచరించుట అనేది ప్రాచీన మెసొపొతమియలోని ఇటువంటి దినమును పోలి వచ్చిందని కొందరు పండితులు చెప్పుటకు ప్రయత్నించారు. బబులోను దేశస్తులు నెలలోని పదిహేనవ దినమున–పౌర్ణమి–*šab/pattu* అని పిలిచి దానిని వారి “శుభసూచకమైన దినము”గా పరిగణించేవారు. ఇది అక్కాదీయుల (Akkadian) *šab/pattu* మరియు హెబ్రీయుల *shabaath*తో భావసంబంధమును కలిగియున్నప్పటికి, ఏడవరోజున లేదా పద్నాల్గవరోజున కాకుండా నెలలో మధ్యదినమున (పదిహేనవ దినము) వస్తుంది. నిజానికి ప్రతి సబ్బాతును ఇశ్రాయేలీయులు పరిశుద్ధముగా ఆచరించునట్లు కాకుండా బబులోనుదేశస్తుల ఏడవ, పద్నాల్గవ, పంతొమ్మిదవ, ఇరవైయొకటవ మరియు ఇరవైయెనిమిదవ దినాలను “చెడ్డ రోజులు”గా పరిగణించారు.[3]

అంతేకాదు, యేడు దినముల వారమును 29½ రోజుల చంద్రమాన మాసంలో అమర్చడం అసాధ్యం. ఎందుకంటే, చంద్రమాన మాసంలో అమర్చడం అసాధ్యం. ఎందుకంటే, చంద్రుని గతిపై ఆధారపడిన నెలను యేడు సంపూర్ణ దినాలుగా విభజించలేము. మెసొపొతమియ మాత్రమే కాకుండా ఇంకా అనేక ప్రాంతాలలో సబ్బాతుకు మూలమైన ఆచారాలున్నాయని చెప్పబడుచున్నది. కాని, దేవుడు తన సృజనాత్మక పనినుండి అపూర్వమైన ఏడవ దినమున విశ్రమించుట కాకుండా మరే యితర ఆచారముల నుండి సబ్బాతు ఆవిర్భవించెననుటకు సరియైన ఆధారములు లేవు.

**వచనము 3. దేవుడు ఈ యేడవ దినమును ఆశీర్వదించి పరిశుద్ధపరచెను**

అను మాటలో సబ్బాతు దినము యొక్క ప్రత్యేకత రూఢీపరచబడింది. దేవుడు ఆరు దినములలో సృజించినదంతా "చాలమంచిది"గా పరిగణించబడింది (1:31)కాని సబ్బాతు దినమున మాత్రమే ఆయన "పరిశుద్ధపరచెను" ("పరిశుద్ధమైనదానిగా చేసెను; NIV). ఇక్కడ వాడబడిన קָדַשׁ (*qadash*) అను పదము పవిత్రమైన లేదా ప్రత్యేకపరచబడిన పరిధికి చెందినదని సూచిస్తుంది. ఇది సాధారణమైన లేదా అపవిత్రమైనదానినుండి ప్రత్యేకపరచబడింది.[4]

శక్తివంతమైన సృష్టి కార్యముల అనంతరం దేవుడు విశ్రమించుటకు జ్ఞాపికగా సబ్బాతు జరపబడుతుంది. ఐగుప్తులో బానిసలుగా తమ పని నుండి ఎటువంటి విరామమును అనుభవించని ఇశ్రాయేలీయులకు ఇది చాలా ప్రాముఖ్యమైన విషయం. ఏదేమైనా, దేవుడు వారిని అటువంటి బానిసత్వము నుండి విడిపించాడు. వారు దేవునియొద్ద కుమారత్వమును పొంది, నూతన జనాంగము (సృష్టి)గా యిప్పుడు విశ్రాంతిని, నూతనబలమును పొంది, దేవుని ఆరాధించగలరు (నిర్గమ. 4:22, 23). మోషే దైవికమైన సృజించు కార్యముతో (నిర్గమ. 20:8–11) సబ్బాతు ఆజ్ఞను ఐలోపితం చేయడమే కాకుండా, ఇశ్రాయేలీయుల నిర్గమము ద్వారా ఐగుప్తులోని వారసత్వమునుండి విడిపింపబడుట అనే దైవశాస్త్రముతో కూడా ఆయన దీనిని కలిపాడు. ఆయన ఈ విధంగా బుద్ధిచెప్పాడు:

> నీవు ఐగుప్తుదేశమందు దాసుడవైయున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహుబలముచేతను చాచిన చేతిచేతను నిన్ను అక్కడనుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతిదినము ఆచరింపవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను (ద్వితీ. 5:15).

## "భూమ్యాకాశములు సృజించబడినప్పుడు వాటివాటి ఉత్పత్తిక్రమము ..." (2:4)

**[4]దేవుడైన యెహోవా భూమిని ఆకాశమును చేసిన భూమ్యాకాశములు సృజించబడినప్పుడు వాటివాటి ఉత్పత్తిక్రమము ఇదే.**

**వచనము 4.** సృష్టి గాధ ముగింపులో, ఆదికాండములోని తొలి పది תּוֹלְדוֹת (*toledoth*) ప్రతిపాదనల యొద్దకు వస్తాము: **దేవుడైన యెహోవా భూమిని ఆకాశమును చేసిన దినమందు భూమ్యాకాశములు సృజించబడినప్పుడు వాటివాటి ఉత్పత్తిక్రమము ఇదే.** వాక్కుతో పేర్కొనబడిన ప్రజల మరియు వ్యక్తుల "వృత్తాంతము," "తరములు," లేక "చరిత్ర" అని *toledoth* ను అనువదించవచ్చును. ఈ ప్రస్తుత ఉదాహరణలో, సృష్టి గురించి 1:1–2:3లో ముందుగానే చెప్పబడినదానికి *toledoth* ముగింపునిస్తుందని చెప్పవచ్చు.

ఏదేమైనా, పుస్తకములో ఎక్కువ సార్లు, ఈ పదము జరగబోయేదానికి పరిచయముగా ఉపయోగపడుతుంది కనుక ఇక్కడ దీనినిపై విధంగా అర్ధంచేసుకొనుట మంచిదనిపిస్తుంది (పరిచయము, 5–6 పేజీలు చూడండి).

దేవుడైన యెహోవా భూమిని ఆకాశమును చేసిన దినమందు అని చెప్పుటలో ఆదికాండము యొక్క రచయిత 2:4–25లో సృష్టి యొక్క వృత్తాంతమును మరొకసారి (భిన్నముగా) ప్రారంభిస్తున్నాడు అని చెప్పుటకు వాక్యభాగం ఎలాంటి ఆమోదయోగ్యమైన సూచనను ఇచ్చుటలేదు. అలా కాకుండా, తాను అత్యంత ఆమోదయోగ్యమైన విధానము అనగా, మొదట ఒక సంఘటనను (సృష్టి) విస్తుత రూపంలో తెలియజేసి (1:1–2:3) తరువాత తాను చెప్పదలచుకున్న దైవశస్త్ర సందేశమునకు సంబంధించిన ముఖ్యమైన సంఘటనలోని వివరాలను తెలియజేస్తున్నాడు (2:4–25).[5]

"దేవుడైన యెహోవా" (יְהוָה אֱלֹהִים, *Yahweh 'Elohim*) అను బిరుదు లేదా "దేవుడు" అనే (1:1–2:3లో వ్రాయబడినట్లు) సాధారణమైన పేరు, 2:4–25ను రచించినది వేరొక వ్యక్తి అని కొందరు వాదించుటను సూచించుటలేదు. *'Elohim* అనునది పాత నిబంధనలో దేవునికి సాధరణంగా ఉపయోగించిన పదము. అయితే "యెహోవా" అనునది ఇశ్రాయేలీయులచే ప్రత్యేకముగా వాడబడిన దేవుని వ్యక్తిగత నామము. కావున 2:4ను ప్రారంభిస్తూ, రచయిత వివరించినట్లు దేవుడు మొట్టమొదటి స్త్రీ–పురుషులతో ఏదెను తోటలో సన్నిహిత సంబంధమును కలిగియున్నాడని చెప్పుటలో అతడు సహజసిద్ధంగా *Yahweh 'Elohim* అను దైవికమైన మిశ్రమనామమును వినియోగించాడు. ఈ చరిత్రలో తెలియచేసినట్లు, ఈ రెండు పదములను రచయిత కలుపుటలో, దేవునిని సర్వలోక సృష్టికర్తగాను, ఇశ్రాయేలునకు దేవునిగాను చూపించు దైవశాస్త్ర ఉద్దేశమును కలిగియుండవచ్చు. ఫరో మరియు ఐగుప్తీయులు "దేవుడైన యెహోవాకు (*Yahweh 'Elohim*) భయపడవలెనని" ఉద్దేశించిన నిర్గమకాండము 9:30లోని వడగండ్ల తెగులును రప్పించినప్పుడు కూడా ఇదే విషయం స్పష్టమవుతుంది. "యెహోవా కేవలం ఇశ్రాయేలీయుల దేవుడు మాత్రమే కాదు సర్వ సృష్టిని నియంత్రించగల సార్వభౌముడు" అను విషయం వారికి అర్ధంకావాలి.[6]

"దేవుడైన యెహోవా భూమిని ఆకాశమును చేసిన దినమందు" అను ప్రతిపాదనలో, "దినము" (יוֹם, *yom*) అను మాటకు సంబంధించిన కొన్ని ప్రశ్నలను ఇక్కడ లేవనెత్తింది. ఇది సృష్టి ఆరు దినములలో జరిగింది అని చెప్పే 1:1–2:3కి భిన్నంగా ఉందా? లేదా అని మనం చెప్పక తప్పదు.

*Yom* అనే హెబ్రీ పదమునకు, దాని సందర్భమును బట్టి, వివిధమైన అర్ధములు ఉన్నాయి.[7] 1వ అధ్యాయములో ఒక సంఖ్యతో చేర్చబడినప్పుడు ("ఒకటి," "రెండవ," "మూడవ" మొ.) ఆ పదము 24 గంటల సమయమని సూచిస్తుంది (1:5, 8, 13, 19, 23, 31). ఒక సంఖ్యతో కూడిన Yom ఈ

అర్థముతో పాతనిబంధనలో మనకు పెక్కుమార్లు కనిపిస్తుంది. ఆ వాక్యములో దీనికితోడు, "అస్తమయమును ఉదయమును కలుగగా" అను ప్రతిపాదన హెబ్రీయులు అక్షరాలా ఒక దినమునకు సంబంధించిన కాలమునకు వినియోగించినట్లు తెలుపుతుంది. ఈ పుస్తకమును ముందుగా చదివినవారు ఆరు వాస్తవ దినములలో దేవుడు సృష్టిని చేసి ఏడవ దినమున విశ్రమించినట్లు భావించారు కనుకనే వారు ఆరు దినములు పనిచేసి ఏడవదినమున విశ్రాంతి తీసుకున్నారు (నిర్గమ. 20:8–11).

1వ అధ్యాయములో మనకు కనిపించే Yom అనే పదమునకు పగటి వెలుగు అని మరొక అర్థము. ఏలయనగా, ఆ పదము చీకటి లేదా రాత్రి సమయమునకు వ్యతిరేక పదుముగా ఉపయోగించబడుతుంది కనుక (1:5, 14, 16, 18), నిజమే, సంవత్సరంలో మనం ఉన్న ఋతువు మరియు భూమధ్యరేఖకు మనం ఉన్న దూరాన్ని బట్టి పగటి వెలుగుయొక్క ఖచ్చితమైన మొత్తం మారుతుంది. కనుక ఈ వచనాల్లో *yom* వెలుగుయొక్క వ్యవధి మరియు చీకటియొక్క వ్యవధి ఖచ్చితమైన 24గంటల దినముకంటే తక్కువైన కాలవ్యవధిని సూచిస్తుంది (1:5, 8, 13, 19, 23, 31).

1వ అధ్యాయములోని ఆరు దినముల సృష్టిని ఆవరించుతూ, ఆదికాండము 2:4లో, *yom* మరింత సాధారణమైన కాలమును సూచిస్తుంది. హెబ్రీ భాషలోని లేఖనంలో בְּיוֹם (*b^eyom*) అని వ్రాయబడిన మాటను NASB "ఆ దినములో" అని అనువదించినది (2:17; 3:5; 5:1, 2). *Yom*ను సాధారణంగా తీసుకుంటే NIV ఈ విధంగా వివరిస్తుంది: "దేవుడైన యెహోవా భూమి మరియు ఆకాశమును సృజించినప్పుడు" (ఉద్ఘాటన కలుపుబడింది).

2:4లోని సృష్టి వృత్తాంతమునందలి *yom*ను మరింత సాధారణంగా ఉపయోగిస్తే అది సృష్టిలోని మొదటి మూడు దినాలు ఖచ్చితమైన 24 గంటల దినములు కాకపోవచ్చుననే వాదనను సమర్థించే ప్రమాదముందని కొందరు భయపడుతున్నారు (1:1–13).[8] అటువంటి వ్యాఖ్యానము, సృష్టి నిర్దిష్ట దినములలో చేయబడినది కాక, కొన్ని వేల యుగాలలో పరిణామం చెందినదని వాదించేవారికి మరింత అవకాశమునిస్తుందని అనిపిస్తుంది. మనం ఇప్పుడు చేస్తున్న ప్రపంచం నిర్మించబడుటకు, సహజ ఎంపిక (natural selection) మరియు యాధృచ్చిక సంఘటనలకు సరిపడినంత సమయం ఉన్నదని వాదనను ఇది ధృడపరుస్తుంది. ఏదేమైనా, వేలకోట్ల సంవత్సరాల పరిణామమును రహస్యముగా చేరవేయునట్లుగా తగినంత సమయమును అందించినట్లు *yom*ను వ్యాఖ్యానించినచో, ముందుగానే నిశ్చయించుకొనిన వ్యాఖ్యానమును సృష్టి గాధలోనికి చేర్చుటకు సైద్ధాంతిక ప్రయత్నం చేసినట్లే.

"లేఖనములకు లేఖనములనే అర్థము చెప్పనివ్వండి" అనే సూత్రం దీనికి పరిష్కారం. *Yom* అనే పదము సందర్భానుసారంగా అనువదించబడాలి. ఇది

2:4లో ఆరుదినములతో కూడిన దినముల కాలవ్యవధిని సూచిస్తుంది. ఈ సూత్రము, సృష్టి గురించిన లేఖనములలోనికి పరిణామ సిద్ధాంతమును ప్రవేశపెట్టాడని ఎట్టి పరిస్థితులలోను అవకాశము ఇవ్వదు. సృష్టి ప్రక్రియలో దేవుడు కేవలం పలుకగా సమస్తమును సృజించబడినవి అని రచయిత రూఢిగా తెలియజేసాడు. తరువాత ఆయన మాట్లాడుచుండగా ఆకాశములోను భూమిపైన జీవులు సృజింపబడినవి, చివరికి అది మానవుని సృష్టితో ముగింపబడింది. దేవుడు అనేకసార్లు ప్రయత్నించి, తప్పులు చేసి, కోట్లాది సంవత్సరాల కాలవ్యవధిలో అనేక పథార్థముల యాధృచ్చిక కలయికతో, జన్యమార్పులతో, అద్భుతమైన ఈ ప్రపంచాన్ని మరియు అందులోని వివిధ ప్రాణులను సృజించలేదు. హెబ్రీయులకు వ్రాసిన పత్రిక యొక్క రచయిత మాటల్లో, “ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు, అందునుబట్టి దృశ్యమైనది కనబడెను పదార్థములచే నిర్మింపబడలేదనియు విశ్వాసముచేత గ్రహించుకొనుచున్నాము” (హెబ్రీ. 11:3).

## ఏదెను తోటలో మానవుడు (2:5–7)

**[5]అదివరకు పొలమందలి యేపొదయు భూమిమీద నుండలేదు; పొలమందలి యే చెట్టును మొలవలేదు; యేలయనగా దేవుడైన యెహోవా భూమిమీద వాన కురిపించలేదు, నేలను సేద్యపరచుటకు నరుడు లేడు; [6]ఐతే ఆవిరి భూమినుండి లేచి నేల అంతటిని తడిపెను. [7]దేవుడైన యెహోవా నేల మంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊధగా నరుడు జీవాత్మ ఆయెను.**

**వచనము 5.** 1వ అధ్యాయములో ఇవ్వబడిన వృత్తాంతము కాకుండా (దానికి భిన్నంగా)—ప్రత్యేకంగా, మానవుడు సృజింపబడినప్పుడు ఎటువంటి మొక్కలు లేదా చెట్లు లేవనే ఆలోచనతో—వేరొక రచయిత మరొక వృత్తాంతము రాస్తున్నాడని కొందరి వాదన. కాని దీనికి భిన్నంగా, ఆదికాండము యొక్క రచయిత మూడు మరియు ఆరవ దినాలలో జరిగిన విషయాలను మరింత క్షుణ్ణంగా వివరించుటకు మరొకసారి వెనుకకు వెళ్లియున్నాడు. 1:11, 12 ప్రకారం, ఆరవ దినాన మానవుని సృజించక మునుపే (1:26—28) దేవుడు మూడవ దినాన మొక్కలను, పండ్లనిచ్చు చెట్లను సృజించాడు (1:26—28). తరువాత 1:29 ప్రకారం, దేవుడు మానవునికి ప్రతి మొక్కను మరియు ఫలమునిచ్చు చెట్టును జీవించుటకు ఆహారముగా ఇచ్చియున్నాడు కనుక మానవుడు సృజించబడక మునుపే చెట్లు సహజంగా పెరుగుట మరియు అవి ఫలములనిచ్చుట ఆరంభమైనదని మనకు సహజంగా అర్థమవుతుంది.

5వ వచనంలో రచయిత మూడవదినముకంటే ముందుకు అనగా, “భూమి

నిరాకారముగాను శూన్యముగాను"[9] (లేదా "వ్యర్థముగా మరియు ఖాళీగా"[10] 1:2) ఉన్న కాలమునకు పాఠకులను తీసుకువెళ్లడానికి ప్రయత్నించాడని కొందరి అభిప్రాయం. ఒకవేళ ఆ విధంగా కాకపోయినప్పటికీ, మూడవదినాన ఎండిన నేల కనిపించినప్పుడు తప్పనిసరిగా ఒక కాలమందు పొలమందలి యేపొదయు **భూమిమీద నుండలేదు**; **పొలమందలి యే చెట్టును మొలవలేదు**.

ఇచ్చట రెండు రకముల మొక్కలు ప్రస్తావించబడ్డాయి. వీటిలో మొదటిది అడవి "పొద" (שִׂיחַ, *śiach*); ఇది పాత నిబంధనలో–ఇక్కడ మరియు మరి రెండు చోట్ల కనిపిస్తుంది. ఆదికాండము 21:15లో *śiach*, దేవదూత దర్శించి వారి అవసరత తీర్చేవరకు హాగరు తన కుమారుడైన ఇష్మాయేలును ఆహారము, నీరు లేకుండా విడిచిపెట్టిన అడవిపొదను సూచిస్తుంది. చివరిసారిగా, యోబు తన పరిస్థితిని అడవి పొద (*śiach*)లో పడవేయబడి, ఎండిన నేలపై కరువుతో విలపిస్తూ సహాయంకొరకు అర్థిస్తున్న బుద్ధిహీనునితో పోల్చుకున్న సందర్భంలో కనిపిస్తుంది (యోబు 30:4, 7).

వేరొక "మొక్క" కొరకు వాడబడిన పదము עֵשֶׂב (*'eśeb*), మరియు దీని విశిష్టత ఆ మొక్కను తినవచ్చా లేదా అనేదానిపై ఆధారపడియుంటుంది. *'Eśeb* అను పదం, సాధారణంగా తినదగిన "మూలిక"(లకు) వాడబడింది (2:5; KJV; NRSV); అటువంటి మొక్కలలో ఆకుకూరలు, ఉల్లిపాయలు, కూరగాయలు, మరియు జంతువులు తినే గడ్డిమొక్కలు ఉంటాయి.[11] అనగా, మానవుని సృష్టికి పూర్వం వ్యసాయముతో పెంచవలసిన మొక్కలు లేవని అర్థం కావచ్చు. ఇటువంటి పరిస్థితికి రచయిత రెండు కారణాలు ఇచ్చాడు: దేవుడైన యెహోవా భూమిమీద వాన కురిపించలేదు, నేలను సేద్యపరచుటకు నరుడు లేడు. ఏదెను ఉండే స్థలమని చెప్పబడుచున్న మెసొపొతమియలోని దక్షిణ ప్రాంతము విషయంలో తప్ప, భూమిపై వర్షం కురవలేదని చెప్పబడిన మొదటి మాట అబ్బురపరచేదిగా ఉంటుంది. ఎందుకంటే ఈ ప్రాంతంలో వర్షాలు కురువవు.[12]

**వచనము 6.** వర్షానికి బదులుగా, నేలనుండి **ఆవిరి** (אֵד, *'ed*) లేచి **నేల అంతటిని తడిపినట్లు** 6వ వచనము చెబుతుంది. పాత నిబంధనలోని ఆదికాండము 2:6 మరియు యోబు 36:27లో మాత్రమే ఈ పదం వాడబడింది. NASBలోని రెండుచోట్ల "ఆవిరి" అని చెప్పబడింది. కొన్ని ప్రచురణల మార్జిన్ వ్యాఖ్యలలో "ప్రవాహం" మరియు "వరద" అని తెలియజేయబడింది. ప్రతి సంవత్సరం యూఫ్రటీసు నదిలో వచ్చి ప్రాచీన బబులోనును ముంచివేసిన 'వరద'ను సూచించే హెబ్రీ పదము *'ed* ఖచ్చితంగా *edû*, అను అక్కాదీయ పదము నుండి వచ్చినది;[13] కనుక NIVలో "ప్రవాహములు" అని వ్రాయబడింది (NRSV చూడండి). తోటలో తడిపిన "వరదలు" లేదా "ప్రవాహములు" భూమి ఉపరితలంపై ప్రవహించిన నీళ్లు టైగ్రిసు మరియు యూఫ్రటీసులు నదుల నుండి వచ్చినది మాత్రమే కాకుండా అవి నేలకు నీటిని అందించిన భూగర్భజల ఊటలై ఉండవచ్చు.

వివరణ ఏదైనా, భూమిపై పంటలు లేకపోవడానికి కారణం మానవుడు లేకపోవడమే అని మనకు తెలుస్తుంది; భూమిని సేద్యపరచువాడు లేకపోతే నీటి ఊటలకు విలువలేదు.

**వచనము 7.** ఆత్మావేశము కలిగిన రచయిత దేవుడు **మానవుని నేల మంటినుండి నిర్మించాడని** మానవుని యొక్క సృష్టి వృత్తాంతమును మరింత వివరంగా ఇక్కడ తెలియజేస్తున్నాడు. "నిర్మింపబడెను" (יָצַר, *yatsar*) అను మాట పాత నిబంధనలో మరికొన్ని చోట్ల మనకు కనిపిస్తుంది. ఇది తరువాత కాలంలో మంటి నుండి పాత్రను చేసే కుమ్మరి యొక్క పనికి వాడబడింది కనుక సృష్టికి ఒక రూపకాలంకారముగా వినియోగించబడిందని చెప్పవచ్చు (యిర్మీయా 18:1–6). కుమ్మరి, సృష్టికర్తయైన యెహోవాకు సూచనగా ఉన్నాడు; మరియు మంటినుండి పాత్రను చేయుట దేవుడు మానవుని సృజించుటను (లేదా తరువాత ఇశ్రాయేలును చేయుటను) పోలి ఉంది.[14] దైవకుమ్మరియైన దేవుడు మానవుని ఒక జీవిగా వ్యక్తిగతంగాను అత్యంత కళాత్మకంగా తన స్వరూపంలో సృజించిన విధానమును ఈ ప్రక్రియ చూపిస్తుంది.

దేవుడు "మానవుని" (אָדָם, *'adam*) "నేల" (אֲדָמָה, *$^{a}$damah*) మంటితో నిర్మించెను అని చెప్పబడిన హెబ్రీ పదములలో ఒక పద చమత్కారము కనిపిస్తుంది. ఈ పదము మానవుడు కేవలం దేవునికి మాత్రమే కాక, నేలతో కూడా అవినాభావ సంబంధమును కలిగియున్నాడని సూచిస్తుంది. 3వ అధ్యాయంలో వలె, ఈ సందర్భములో "మన్ను" (עָפָר, *'apar*) అను పదము "నేల" అను పదమునకు పర్యాయపదముగా ఉన్నది. 3:17లో మానవుని పాపము నిమిత్తం నేలపైకి శాపము వచ్చినప్పుడు, తాను కూడా తప్పించుకొనలేకపోయాడు; కనుక అతడు తిరిగి దేవుడు తనను నిర్మించిన "మంటిలోనికి వెళ్లవలసి వచ్చింది." చివరికి దేవుడు, "నీవు మన్నే కనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను" (3:19).

దేవుడు వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా అని 2:7లో చెప్పబడిన మాట, ఆయన సృజించిన ఆ మానవుడు కేవలం ఒక మంటి పదార్థం కాదని ఇది ఉద్ఘాటిస్తుంది. అతడు కేవలం రసాయనాలు, గ్రంథులు మరియు విద్యుత్ లాంటి నాడి ప్రేరణలు యాదృచ్ఛిక సమ్మేళనము కంటే గొప్పవాడు. దేవుడు మాత్రమే ఇవ్వగలిగిన జీవము అనే వరము అతనిలో ఉన్నది. మానవును "నాసికారంధ్రముల"లోనికి "ఊద"బడిన దేవుని జీవము "జీవ [נְשָׁמָה, *$n^{e}$shamah*] వాయువుగా" గుర్తించబడింది; బబులోను చెరలో యెహెజ్కేలు చేసిన బోధకు ఇది అతి సమీపంగా ఉంది (యెహెజ్కేలు 37:1–10). ప్రవక్త "వాయువు" అను పదమును ఆదికాండము 2:7లోని *$n^{e}$shamah* అను పదమును కాకుండ వేరొక పదమును వాడిన మాట వాస్తవమే కాని, అనేక వాక్యభాగాల్లో ఈ రెండు పదములు మార్చిమార్చి వాడబడినట్లు మనకు స్పష్టమవుతుంది: "అయినను

నరులలో ఆత్మ [*ruach*] **ఒకటి యున్నది. సర్వశక్తుడగు** దేవుని ఊపిరి [*n^e^shamah*] వారికి వివేచన కలుగజేయును" (యోబు 32:8; ఆదికాండము 7:22; యోబు 27:3; 33:4; 34:14; యెష. 57:16).

చెరలో నిరీక్షణ కోల్పోయిన ఇశ్రాయేలు ప్రజలతో మాట్లాడమని దేవుడు ప్రవక్తయైన యెహెజ్కేలుతో చెప్పియున్నాడు. "ఎండిపోయిన ఎముకలారా, యెహోవా మాట ఆలకించుడి" అని అతడు వారితో పలుకవలెను (యెహెజ్కేలు 37:4). మరలా దేవుడు తన నోటిమాట ద్వారా, "మీరు బ్రతుకునట్లు నేను మీలోనికి జీవాత్మను [*ruach*] రప్పించుచున్నాను" అని రూడిపరచుచున్నాడు (యెహెజ్కేలు 37:5). ప్రవక్తతో దేవుడు "జీవాత్మ [*ruach*] వచ్చునట్లు ప్రవచించి ఇట్లనుము, ప్రభువగు యెహోవా సెలవిచ్చునది ఏమనగా–జీవాత్మా [*ruach*], వీరు బ్రతుకునట్లు వారి మీద ఊపిరి [*ruach*] విడువుము" (యెహెజ్కేలు 37:9). దేవుడు చెప్పిన ప్రకారం యెహెజ్కేలు చేసాడు; మరియు అతడు ప్రవచించుచుండగా "జీవాత్మ [*ruach*] వారిలోనికి వచ్చెను; వారు సజీవులై లేచి ... నిలిచిరి" (యెహెజ్కేలు 37:10).

ఈ వృత్తాంతములో, బబులోను ఇశ్రాయేలీయుల సమాధితో పోల్చబడినది, మరియు చెరలో ఉన్నవారు ఎండిపోయి, నిరీక్షణ లేక నిర్జీవముగా ఉన్న ఎముకలతో కూడిన లోయలోని అస్థికలను పోలియున్నారు. యెహెజ్కేలు వారితో ఆత్మసంబంధమైన పునరుత్థానము మరియు వారు విడచి పెట్టిన దేశమునకు తిరిగి వెళ్లుట గురించిన నిరీక్షణ సహితమైన మాటలను పలికాడు. వారు ఈ సందేశమును పొందగానే, దేవుని జీవ వాయువు (*ruach*) వారిలో ప్రవేశించి వారిలోనికి జీవమును తెచ్చింది. యెహెజ్కేలు 37:1–10 మరియు ఆదికాండము 2:7 మధ్య సమాంతరత స్పష్టముగా ఉంది కాని, వాయువుగా అనువదించబడిన *ruach* అనేది, సందర్భమును బట్టి "ఆత్మ" లేదా "వాయువు"గా అర్థమివ్వవచ్చును. చెరలో ఉన్న ఇశ్రాయేలీయుల ఆత్మ సంబంధమైన పునరుత్థానమునకు సంబంధించిన ముగింపు వాక్యభాగములో దేవుని ఆత్మ (breath) మరియు ఆయన పలికిన మాట కలసి పనిచేసినట్లు మనకు కనిపిస్తుంది. దేవుడు, "మీరు బ్రతుకునట్లు నా ఆత్మను [*ruach*, breath] మీలో ఉంచి మీ దేశములో మిమ్మును నివసింపజేసెదను, యెహోవానకు నేను మాట యిచ్చి దానిని నెరవేర్తునని మీరు తెలిసికొందురు (యెహెజ్కేలు 37:14).

ఆదికాండము మొదటి రెండు అధ్యాయాలలో కూడా దేవుని ఆత్మ మరియు దేవుడు పలికిన మాట లేదా వాక్కు మధ్య ఉన్న అవినాభావ సంబంధం స్పష్టమవుతుంది. 1:1–3లో, దేవుని ఆత్మ (*ruach*, "ఊపిరి" లేదా "వాయువు") అగాధజలములపైన అల్లాడుచుండెను. దేవుడు పలుకగా, నిరాకారము మరియు నిర్జీవమైనది ఒక రూపమును దాల్చుటకు ఆరంభమైనది. ఆయన మాట్లాడుట కొనసాగించగా జీవము వృద్ధిలోనికి వచ్చుట ఆరంభమైనది. చివరిగా, సృష్టి యొక్క

శిఖరం వద్ద, దేవుడు మరలా మాట్లాడి, “మన స్వరూపమందు నరులను చేయుదము” (ఆది. 1:26) అని చెప్పారు. దీనిని 2:7తో ముడిపెడితే, పలుకబడిన దేవుని మాట (1:26) దేవుని జీవవాయువు (*n$^{e}$shamah*) కలదై, మానవుడు జీవించు ప్రాణి అగునట్లు అతనిలోనికి ఊదబడింది.

“జీవవాయువు ఊదు”టలో ఉన్న సాన్నిహిత్యం “హృదయపూర్వకం, వ్యక్తిగతం, ముద్దుపెట్టుటవంటి ముఖాముఖియైనది మరియు నిర్మించే మరియు అనుగ్రహించే ప్రక్రియగా ఉండుట దీని ప్రత్యేకత; అనగా తనకు తానుగా. అర్పించుకొనే ప్రక్రియ.”[15] యేసు పునరుత్థానము తరువాత తన అపొస్తలులకు కనిపించిన సందర్భంలో ఆయన చేసిన కార్యములో కూడా ఇది కనిపిస్తుంది. “ఆయన ఈ మాట చెప్పి వారిమీద ఊది, ‘పరిశుద్ధాత్మను పొందుడి’” అని పలికినట్లు యోహాను 20:22 చెప్పుచున్నది. క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరమైన నవసమాజమునకు ఆధారమైన శిష్యబృందమునకు నూతన జీవమును, నిరీక్షణను ప్రసాదించినది పునరుత్థానుడైన ప్రభువు యొక్క జీవవాయువు (ఆత్మ).

2:7లోని నరుడు జీవాత్మ ఆయెను (נֶפֶשׁ חַיָּה, *nepesh chayyah*) అను మాటను “నరుడు జీవించే ప్రాణియై” (KJV)నట్లు తర్జుమా చేయుట ద్వారా దానిని అపార్థము చేసికొనుట జరిగినది. కొందరు దీనిని మానవుని మరణాంతరం జీవించే ఒక అక్షయ భాగముగా మరియు అది అతనిని జంతువులనుండి వేరు చేసేదిగా భావిస్తున్నారు. సమస్యయేమిటంటే, పాత నిబంధనలో *nepesh chayyah* మానవునికి మాత్రమే ఆపాదించబడలేదు. 1:20, 21లో చేపలకు మరియు వివిధ రకముల జలరాశులకు; 1:24లో భూజంతువులకు; 1:30లో మృగములకు, పక్షులకు మరియు మిగతా జంతువులకు వినియోగించబడింది. ఈ లేఖన భాగము జంతువులకు భిన్నంగా మానవునికి అక్షయమైన ఆత్మ ఉన్నదని చెప్పుటలేదు.[16] “మరణమును నిరర్థకముచేసి జీవమును అక్షయతను సువార్తవలన వెలుగులోనికి”తెచ్చిన యేసుక్రీస్తులో సంపూర్ణ బయల్పాటు వచ్చువరకు ఇటువంటి బోధ మనకు రాలేదు (2 తిమోతి 1:10). ఆయన ప్రత్యేకంగా తన శిష్యులను “ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి” అని బుద్ధిచెప్పారు (మత్తయి 10:28). ఆదికాండము 2:7లోని విషయం ఆత్మయొక్క అక్షయత గురించి కాకపోయినప్పటికీ, మానవుడు మరియు జంతువులు “జీవించు ప్రాణులు” అయినప్పటికీ, మానవుడు దేవుని స్వరూపంలో చేయబడియున్నాడు కనుక తాను దేవునితో ముఖాముఖి సంబంధమును కలిగియున్నాడని మాత్రం ఈ పుస్తకం ఖచ్చితంగా బోధిస్తుంది (1:26,27).

## ఏదెను తోటలో మానవుని జీవితం (2:8–17)

2వ అధ్యాయం ఏదెను తోటను వివరిస్తుంది. భూమి మీద మానవుని మొదటి గృహములో దేవుడు తనకు కావలసినవన్నీ అనుగ్రహించాడని తెలుపుటకు, రచయిత ఆ తోటను చక్కటి నీటిపారుదల కలిగి అనేక రకముల మంచి వృక్షములతో నిండియున్నదని వర్ణించాడు.

### ఏదెను తోట (2:8, 9)

**[8]దేవుడైన యెహోవా తూర్పున ఏదెనులో ఒక తోటవేసి తాను నిర్మించిన నరుని దానిలో ఉంచెను. [9]మరియు దేవుడైన యెహోవా చూపునకు రమ్యమైనదియు ఆహారమునకు మంచిదియునైన ప్రతి వృక్షమును, ఆ తోట మధ్యను జీవవృక్షమును, మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షమును నేలనుండి మొలిపించెను.**

**వచనము 8.** వృక్షములు సృజించబడకమునుపే మానవుని సృష్టి గురించి 2:7లో చెప్పబడింది, ఇది 1వ అధ్యాయంలోని సృష్టి వృత్తాంతమునకు వ్యతిరేకంగా ఉన్నదని కొందరి వాదన. ముందున్న అధ్యాయములోని క్రమమునకు భిన్నంగా ఇక్కడ చెప్పబడిన మాట వాస్తవమే అయినప్పటికీ, 2:8, 9 మొదటి వృక్షముల సృష్టిని గురించి మాట్లాడుటలేదు. దీనికి బదులు, ఈ వచనాలు **దేవుడు** మానవుని కొరకు మొదటి గృహముగా ప్రత్యేకముగా సిద్ధపరచిన ఒక స్థలము గురించి మాట్లాడుచున్నవి. మానవుని మంటితో నిర్మించిన (2:7) దేవుడు కుమ్మరి అని ప్రతీకాత్మకంగా చిత్రీకరించబడిన విధముగానే, మానవుని కొరకు భూమిపై ఒక గృహమును నిర్మించుటలో గొప్ప జాగ్రత్త వహించిన (అక్కర చూపిన) దేవునిని ఒక ఉద్యాన కృషి చేయువాడుగా (తోటమాలిగా) యిక్కడ వర్ణించబడింది. చక్కటి తోటను నిర్మించినట్లు దేవునిని **ఒక ఉద్యానకృషిచేయువాడుగా** (తోటమాలిగా) చూపిస్తున్నాడు. తూర్పున ఏదెనులో ఒక తోటవేసి మానవుడు నివసించడానికి అనువైన పరిస్థితులను కల్పించాడు దేవుడు.

"తోట" అనే హెబ్రీ పదము (גַּן, *gan*) వ్యవసాయం కొరకు ప్రత్యేకింపబడి సరిహద్దులు లేదా కన్చేలతో కాపువేయబడిన ఒక స్థలమును సూచిస్తుంది. ఇక్కడ రకరకాల పువ్వులు, పండ్లు మరియు కూరగాయలు పండించబడతాయి.[17] దేవుడు "తూర్పున ['in'; NIV; NRSV]" ఈ తోట వేసెను అనగా, మొదటి పాఠకుల దృష్టిలో ఇది ఇశ్రాయేలు దేశమునకు తూర్పున ఉన్నదని స్పష్టముగా అర్థము. "ఏదెనులో" అను మాట, బహుశా మెసొపొతమియలోని "ఏదెను" అని పిలువబడిన ఒక లోయలో దేవుడు ఈ తోటను నాటియున్నాడని సూచిస్తుంది.

ప్రాచీన తూర్పుదేశాల గురించిన అధ్యయనం, "ఏదెను," עֵדֶן (*'eden*), అనే

హెబ్రీ పదం "పల్లపు ప్రాంతము" లేదా "పచ్చికబయలు" అనే అర్థమిచ్చు సుమేరియన్ (Sumerian) పదము నుండి పుట్టినదని తెలియజేస్తుంది. ఏదేమైనా, మరింత ఇటీవలి సమాచారం, "సౌఖ్యం, సమృద్ధి, ఆనందం, లేదా పచ్చదనం" అను భావమునిచ్చు పాశ్చాత్య సెమిటిక్ పదమూలమును సూచిస్తుంది.[18] LXXను అనువదించినవారు, ఈ పదమును "ఆనందము లేదా సంతోషము" అని అర్థమునిచ్చు హెబ్రీ మూలపదమైన עֵדֶן (*'adan*)నకు అనుబంధముగా చూశారు. వారు "ఏదెను"ను మొదటి మానవుడు నివసించిన "ఆనందమయమైన వనముగా" అర్థంచేసుకున్నారు. హెబ్రీలోని "తోట"కు గ్రీకు భాషలోని సమాన పదము *παράδεισος* (*paradeisos*), ఇది ఆదికాండములోని అక్షరార్థ ఏదెను తోటకు క్రొత్త నిబంధనలోని పరలోకపు పరదైసుతో ప్రతీకాత్మక సంబంధమునకు దోహదపడింది (లూకా 23:43; 2 కొరింథీ. 12:4; ప్రకటన 2:7).[19]

**వచనము 9**. తోటలో అన్ని రకముల చెట్లు పెరుగునట్లు దేవుడు చేసి మానవునికి సమృద్ధియైన పోషణను అనుగ్రహించెను. దానిలోని చెట్లన్నియు **చూపునకు రమ్యమైనదియు ఆహారమునకు మంచిదియునైనవి**; కాని, ఆయన **తోట మధ్యన** ఉన్న ["middle", NIV] రెండు చెట్ల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించుట జరిగింది: జీవవృక్షము, **మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షము**. రెండవ వృక్షము తోట "మధ్యన"ఉన్నట్లు 3:3లో కూడా చెప్పబడింది.

మొదటి చెట్టు "జీవవృక్షముగా" గుర్తించబడింది. ఇటువంటి అభివ్యక్తం ఆదికాండములో కేవలం 2:9 మరియు 3:22, 24లో మాత్రమే కనిపిస్తుంది. ఇది మానవుడు తీసుకొని తినగలిగిన ఫలముగలిగిన చెట్టు అయినప్పటికీ (3:22), దేవుడు మాత్రమే ఇవ్వగలిగిన అనంత జీవమునకు పాతినిధ్యము వహించేదిగా కనిపిస్తుంది. కనుక, స్త్రీ–పురుషులు పాపం చేసినప్పుడు, సృష్టికర్తకు తిరుగుబాటుదారులుగా జీవిస్తున్నందున, ఆయన ఇచ్చే నిత్యజీవము అనే వరమును పొందలేకుండా వారు ఏదెను తోటలోనుండి బయటకు పంపబడ్డారు (3:24).

"జీవవృక్షము" అనే మాట సామెతల గ్రంథములో పలుమార్లు వాడబడింది (సామెతలు 3:18; 11:30; 13:12; 15:4); కాని ఈ లేఖనాలన్నిటిలో, ఇది జ్ఞానము, నీతి కలిగిన జీవితం, నెరవేరిన నిరీక్షణ, మరియు ఒకడు తన నాలుకతో స్వస్థపరచే మాటలు మాట్లాడుట గురించి చెప్పడం జరిగింది. మరొక మాటలో, "జీవవృక్షము" యెహోవాయందు భయభక్తు"ల మూలముగా వచ్చు నిజమైన "జ్ఞానము"ను ప్రదర్శించే వ్యక్తి యొక్క దైవిక జీవితమునకు ప్రతీకాత్మకంగా ఉంటుంది (సామెతలు 3:18; 9:10). "జీవవృక్ష ఫలము" ఇతరులను ఆదరించి, బలపరచి వారి ఆశల నెరవేర్పు కొరకు నిరీక్షణనిచ్చే ఆశీర్వాదకరమైన జీవితం కలిగి వారు "నీతి"గలిగిన (సామెతలు 11:30) జీవితమును సూచిస్తుంది (సామెతలు 13:12; 15:4). క్రొత్త నిబంధనలో, "జీవవృక్షము" పరలోకములో

(పరదైసు)విమోచింపబడినవారికి నిత్యత్వము కొరకు దేవుడిచ్చు సమృద్ధియైన (ఏదెను అను భావము) జీవమును సూచిస్తుంది (ప్రకటన 2:7; 22:2, 14, 19).

రెండవ వృక్షము "మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షము"గ గుర్తించబడినది. ఈ చెట్టు యొక్క అర్థమేమిటి? ఇక్కడ వివిధమైన వ్యాఖ్యానాలు ఇవ్వబడ్డాయి.

1. తినవద్దని చెప్పిన పండును తినినందున వారు "దిగంబరులమని తెలుసుకున్నారు" (3:7)కనుక మొదటి జంట పొందుకున్న జ్ఞానము లైంగికమైనదని కొందరి దృక్పథం. స్త్రీ–పురుషులు పాపము చేయకమునుపు దిగంబరులుగా సిగ్గు యెరుగక ఉన్నారు; కాని వారు పాపము చేసిన అనంతరం సిగ్గు తెలుసుకున్నారు. కొందరి దృష్టిలో ఈ విషయం, మంచి చెడ్డల తెలివి అనగా వారి మధ్యన ఉన్న లింగబేధము గురించిన అవగాహనను కలిగియున్నారని సూచిస్తుంది.[20]

ఏదేమైనా, కొన్ని విషయాలు ఈ ధృక్పథమును అమోదించదగనిదిగా చేస్తున్నాయి. మొదటిగా, ఆదాము హవ్వల నూతన జ్ఞానము లైంగికమైనదని చెప్పాలంటే, దేవునికి కూడా లింగబేధము ఉందని చెప్పాలి. ఎందుకంటే, ఆదాము పాపము చేసిన తరువాత దేవుడు, "ఇదిగో, మంచిచెడ్డలను ఎరుగునట్లు, ఆదాము మనలో ఒకనివంటివాడాయెను" అని చెప్పారు (3:22). ప్రాచీన ప్రపంచములోని వారి అన్యదేవతలు లైంగిక క్రియలలో పాల్గొంటారని నమ్మేవారు, మరియు ఫలదీకరణ మతములవారు (fertility cults) తమ దేవతల ఆలయాలలో ఆలయ వేశ్యలతో లైంగిక క్రియలలో పాల్గొనుట వారి పూజలో భాగముగా ఉండేది. కాని, మానవునివలె భౌతికశారీరియై, లైంగిక వాంఛలు కలిగినవానిగా "దేవుడైన యెహోవా"ను సూచించడానికి ఈ వాక్యభాగమును ఉపయోగించుట విపరీత వ్యాఖ్యానము.[21] ఇటువంటి భావన బైబిలు సంబంధమైనది కాదు మరియు అది దేవునిని, మానవుని అవమానపరచేదిగా ఉంటుంది.

రెండవదిగా, "మంచిచెడ్డల తెలివి" అనే పదం లైంగికసంబంధమైనదైతే, లైంగిక వ్యక్తులుగా సృజించిన మానవులను దేవుడు దాని నుండి ఎందుకు అడ్డుకున్నాడు? ఆదాము–హవ్వలు పాపము చేయకముందు వారిని దేవుడు, "ఫలించి భూమిని నిండించు"మని ఆజ్ఞాపించారు (1:28). "తన తల్లిని తండ్రిని విడిచి తన భార్యను హత్తుకొనును" మరియు "వారు యేక శరీరమైయుందురు" అను హెచ్చరికతో చేసినట్లుగా కొంత లైంగిక పరిజ్ఞానమును పైమాట సూచిస్తుంది (2:24). దేవుడు ఆజ్ఞాపించారు కనుక, ఆదాము హవ్వలు దేవుడు వద్దని చెప్పిన పండును తినకమునుపే శారీరక సంబంధమును కలిగియున్నారని పై విషయాలు సూచిస్తున్నాయి.[22] ఇది ఎంతమాత్రము ఆయన చేయవద్దని చెప్పిన పని కాదు.

2. "మంచిచెడ్డల తెలివి" అను పదబంధమునకు మరొక దృక్పథం స్త్రీ–పురుషులు దేవునివలె అత్యంత జ్ఞానవంతులై, సర్వజ్ఞులైనారని (సర్వము ఎరిగినవారు) కొందరి ఆలోచన. "మీరు మంచి చెడ్డలను ఎరిగినవారై, దేవతలవలె

ఉందురని" (3:5) సర్పము శోధించిన విషయం అలాగే కనిపిస్తుంది. దీనికి సంబంధించిన ఉదాహరణ, దావీదు అబ్షాలోమును దూరపరచినప్పుడు, సహోదరుడైన అమ్నోనును చంపినా తన కుమారుని యెరూషలేములోనికి రానిమ్మని అడుగుటకు యోవాబు తెకోవనుండి ఒక స్త్రీని పంపిన ఉదంతములో మనకు కనిపిస్తుంది. ఈ తెలివైన స్త్రీ, "దేవుని దూతవంటివాడ"వని దావీదును "మంచిచెడ్డలన్నియూ విచారించు" సామర్థ్యము గురించి ప్రశంసించినది; కొన్ని వచనాల తరువాత, "ఈ లోకమందు సమస్తమును యెరుగుటయందు నా యేలినవాడవగు నీవు దేవదూతల జ్ఞానమువంటి జ్ఞానము గలవాడవు" అని ఆమె చెప్పింది (2 సమూ. 14:17, 20).

మరియు, ఈ వాదన కనీసం మరి రెండు కారణాలచేత ముందుకు కొనసాగలేదు. మొదటిగా, దావీదుకు భూమిపై సమస్త జ్ఞానము లేదు కనుక, తెకోవానుండి వచ్చిన స్త్రీ ఖచ్చితంగా అతని జ్ఞానమును అతిగా పొగడుతుంది. రెండవదిగా, బైబిల్ చరిత్ర ప్రకారం ఆదాము హవ్వల సార్వత్రిక జ్ఞానమును పొందలేదు; వాస్తవానికి వారికి దేవుని గురించి, సర్పము గురించి, కనీసం జీవితం గురించి కూడా ఎక్కువ తెలియనట్లు మనకు కనిపిస్తుంది. అపొస్తలుడైన పౌలు—వేల సంవత్సరాల అనంతరం—"కొంతమట్టుకు" యెరిగియున్నానని చెబితే, భూమిపై మానవజాతి యాత్ర ఆరంభములో ఉన్న ఆదాము హవ్వల విషయంలో ఇది మరి ఇంకెంత నిజాము కావాలి!

3. మూడవ దృక్పథం, "మంచిచెడ్డల తెలివి" అనగా, మంచికి చెడుకు మధ్య ఉన్న బేధమును గుర్తించగల సామర్థ్యత కలిగియుండుట; ఇది లేకుండా మానవులు తమ క్రియలకు బాధ్యులు కారు. అరణ్యంలో, దేవుడు ఇశ్రాయేలీయులతో, వారి తిరుగుబాటును బట్టి కనానులోనికి ప్రవేశించరని సెలవిచ్చారు; "మంచి చెడ్డలను ఎరుగని మీ కుమారులు (ద్వితీ. 1:39) ఒక దినమున ఆ మంచి దేశములో ప్రవేశించి దానిని లోపరచుకుంటారు. చాలా సంవత్సరాల తరువాత ఇశ్రాయేలు చరిత్రలో వృద్ధుడైన బర్జిల్లయి (Barzillai) కూడా ఇటువంటి మాటనే పలుకుతాడు. దావీదు తన రాజు ఆస్థానములో సలహాదారునిగా అతనికి స్థానం కల్పించినప్పుడు "లేదు" అనే సమాధానం ఆశించి ఒక ప్రశ్న అడిగాడు: "సుఖదుఖములకున్న [‘దుష్టత్వం’; KJV] బేధమును నేను గుర్తింపగలనా?" (2 సమూ. 19:35). ఎనభైసంవత్సరాల వయస్సులో రాజుకు సలహాలిచ్చు విషయంలో మంచిచెడుల బేధమును తెలుసుకొను సామర్థ్యత తనకు లేదని అనుకున్నాడు. తన శారీరక మరియు మానసిక సామర్థ్యత చాలామట్టుకు తగ్గిపోయిందని రాజు ఆహ్వానాన్ని తిరస్కరించాడు.[23]

ఏదేమైనా, పైనివ్వబడిన రెండు ఉదాహరణలలో ఏ ఒక్కటి కూడా ఏదెను తోటలో ఉన్న ఆదాము హవ్వలకు వర్తించదు. ఇశ్రాయేలీయులు అరణ్యంలో చేసిన తిరుగుబాటులో మంచిచెడుల జ్ఞానమెరుగని పిల్లలను, వారు పాలివారైనా

కాకపోయినా, దేవుడు వారిని బాధ్యులుగా చేయలేదు. బర్జిల్లయి విషయంలో, వత్తిడితో కూడిన విషయాలలో సమర్థవంతంగా ఆలోచించే సామర్థ్యత ఒక వృద్ధునిగా తక్కువగా ఉంటుంది కనుక రాజుకు తగిన సలహాలు ఇవ్వలేని స్థితిలో ఉన్నాడు. ఈ ఉదాహరణలకు భిన్నంగా, ఆదాము హవ్వలు, మంచిచెడుల తెలివినిచ్చు వృక్షమునుండి తినవద్దని దేవుడు చెప్పిన మాటఅర్థం కానంత చిన్నవారు లేదా వృద్ధులు కారు. వారు తినుదినమున నిశ్చయముగా చచ్చెదరను హెచ్చరిక వారికి అర్థమైనది; కనుక వారు అవిధేయతకు వారు పూర్తి బాధ్యులు.

మంచిచెడుల తెలివినిచ్చు చెట్టు యొక్క ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ఎటువంటి ప్రయత్నం చేయాలన్నా, సర్పము యొక్క మాటలు మనం గమనించాలి: "... మీరు వాటిని తినుదినమున మీ కన్నులు తెరవబడును, మీరు మంచి చెడ్డలను యెరిగినవారై దేవతలవలె ఉందురు" (3:5). సర్పము మాటలలో కొంత నిజము ఉంది. మానవుడు పాపం చేసిన తరువాత దేవుడు, "ఇదిగో, మంచి చెడ్డలను యెరుగునట్లు, ఆదాము మనలో ఒకని వంటివాడాయెను" అని పలికిరి (3:22). మానవుని మొదటి శోధన మరియు అతడు పాపము చేసిన సందర్భంలో అతడు దేవుని "వలె" మారినది పాపము మరియు దుష్టత్వములను గురించిన అవగాహన కలిగియుండు విషయం మాత్రమే. "యెహోవాయందలి భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము" (సామెతలు 1:7) అని మహాజ్ఞాని రాశాడు. నిజమైన జ్ఞానియై సంపూర్ణ జీవితమును అనుభవించాలంటే ఒక వ్యక్తి దేవునియందు విశ్వాసము గలవాడై ఉండాలి కాని తనకు తాను జ్ఞాని అని ఆనుకొనకూడదు.[24]

ఆదికాండములోని వృత్తాంతమునకు యెహెజ్కేలు 28:1–19 ఒక దగ్గరి పోలికను యిస్తుంది. అత్యంత సాదృశ్యరీతిగా తూరు దేశపు రాజు తన హృదయం గర్వముచే నిండియుండుటచేత దేవుని (ఏదెను) తోట నుండి ఏవిధంగా తోలివేయబడ్డాడో వివరించబడింది. తాను దానియేలుకంటే జ్ఞానిననుకొని తనను తాను ఒక దేవునిగా భావించుకున్నాడు (యెహెజ్కేలు 28:1–6, 12–17). తూరు దేశపు రాజు యొక్క గర్వము మరియు అహంభావము ఏదెను తోటలోని మానవుని ప్రవర్తన వంటివి; దేవుని యొద్దనుండి కాక, యితర మూలమునుండి తెలివిని (జ్ఞానమును) ఆశించుటలో అతడు నైతిక అధికారము కలిగి దేవునిచే బయల్పరచబడిన ఆయన చిత్తమునకు వేరుగా ఏది సరి లేద్దా తప్పు అని నిర్ణయించుటకు తనకు తానే దేవునిగా చేసుకుంటాడు. సమస్తమును సృజించి కాల, స్థలములచే పరిమితి కాకుండా ఉన్న దేవుడే మానవ జీవితము యొక్క మంచిచెడులను తెలుసుకొనుటకు సమర్థుడు. అయినప్పటికీ, దేవునికి మాత్రమే చెందిన ఈ గుణములను తీసుకోవాలనేది బలహీనమైన, పరిమితమైన మానవులకు ఒక శోధన.

## నాలుగు నదులు (2:10–14)

**[10]మరియు ఆ తోటను తడుపుటకు ఏదెనులోనుండి ఒక నది బయలుదేరి అక్కడ నుండి చీలిపోయి నాలుగు శాఖలాయెను. [11]మొదటి దాని పేరు పీషోను; అది హవీలా దేశమంతటిచుట్టూ పారుచున్నది; అక్కడ బంగారమున్నది. [12]ఆ దేశపు బంగారము శ్రేష్టమైనది; అక్కడ బోళమును గోమేధికములును దొరుకును. [13]రెండవ నదిపేరు గీహోను; అది కూషుదేశమంతటి చుట్టు పారుచున్నది. [14]మూడవ నది పేరు హిద్దెకెలు; అది అష్షూరు తూర్పువైపున పారుచున్నది. నాలుగవ నది యూఫ్రటీసు.**

**వచనము 10**. "ఏదెను" అని పులువబడిన గొప్ప భూభాగమైన ఏదెనులో నుండి పారిన **నదిచేత తోట** బాగుగా తడుపబడుచున్నది (2:8పైన వ్యాఖ్యానములను చూడండి). తరువాత, తోటను తడుపుటకు నది దానిలో నుండి పారెను; అక్కడ నుండి చీలిపోయి నాలుగు శాఖలాయెను. "నదులు" అను పదమునకు వాడబడిన హెబ్రీ పదము (רָאשִׁים, *ro'shim*) רֹאשׁ (*ro'sh*) అనే మూల పదమునుండి పుట్టినది; దీని ప్రాథమిక భావము "తల."[25] ఏదేమైనా, ఈ సందర్భములో ఈ పదము ఏవిధంగా అనువదించబడాలనేది అస్పష్టము. "ఏదెనులో నుండి ఒక నది బయలుదేరి అక్కడి నుండి చీలిపోయి నాలుగు నదులాయెను" అని NIV చెబుతుంటే, NRSV ఏదెనునుండి నది బయలుదేరి అది "చీలిపోయి నాలుగు శాఖలాయెను" అని చెబుతున్నాయి.

10వ వచనములోని[26] భాష యొక్క క్లిష్టతను గుర్తించి, రచయిత ఇక్కడ ఏదెనువంటి సుందరమైన ప్రాంతమును మానవుని మొదటి నివాసమని ఒక కట్టుకథగా వర్ణించాడని కొందరి వాదన. ఏదేమైనా, ఈ తోట Tigris మరియు "యూఫ్రటీసు" నదులు ప్రవహించే మెసొపొతమియ ప్రాంతములో ఉన్నదని రచయిత చెప్పుట వలన ఈ దృక్పథమును వెంటనే తోసిపుచ్చవచ్చు (2:14).

యితరులు ఈ భాషను సరిగానే అక్షరార్థ వర్ణనగా అర్థంచేసికొని ఏదెను తోటకు సాధ్యమైన రెండు ప్రాంతములను గుర్తించారు. ఒక ప్రక్కన, *ro'shim* అను మాట "నీటి జన్మస్థానాలు" అని అర్థమిస్తే, తోట టైగ్రిస్ (Tigris) మరియు యూఫ్రటీసు నదులు జన్మించిన తూర్పుటర్కీలోని పర్వతాలపై (చారిత్రక ఆర్మేనియా) యుండి ఉంటుంది.[27] మరొక ప్రక్క, ఈ పదముల అర్థము "శాఖలు" అయితే ఈ తోట పర్షియన్ గల్ఫ్కు ఉత్తరాన ఉన్న దక్షిణ ఇరాక్ లేదా కువైట్ లో (లేక దాని క్రింద, కాలానుగుణంగా నీటి మట్టం పెరిగినదని ప్రతిపాదించుట ద్వారా) ఉండి ఉంటుంది. ఏదెను తోట గల్ఫ్ కు దగ్గరలో (లేదా క్రింద) ఉన్నదనుటకు ఎక్కువ ఆధారాలు కలవు.

**వచనములు 11, 12**. ఆదికాండములోని తోట గురించిన వృత్తాంతములో

చెప్పబడిన మొదటి నదిని ఖచ్చితంగా గుర్తించలేము. ఇది "**పీషోను**" అని పిలువబడింది. అది **హవీలా దేశమంతటి చుట్టు పారుచున్నది; అక్కడ బంగారమున్నది** [భూతకాలము]. దీనిలోని క్లిష్టత ఏమిటంటే, పాతనిబంధనలో మరెక్కడ ఈ నది కనిపించదు మరియు దీని హెబ్రీ మూలమును పండితులు ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. కొందరు టైగ్రిస్ మరియు యూఫ్రటీసు నదులకు దూరంగా ఉన్నప్పటికే దీనిని భారత దేశములోని ఇండస్ (Indus) లేదా గంగా నదిగా గుర్తిస్తున్నారు. మరికొందరు ఇరాన్ లో యూఫ్రటీసు నదిలోనికి ప్రవహించే కరున్ (Karun) నదిగాను, హవీలా మరియు కొందరు దానిలో బంగారమును గురించి ప్రస్తావించినందుకు అరేబియాలోని ఒక నది అని వాదిస్తున్నారు. జాతుల పట్టికలో, చివరికి హవీలా అనే పేరు ఆఫ్రికా (10:6, 7) మరియు అరేబియా (10:29; 25:18 చూడండి) ప్రాంతములో నివసించిన ప్రజలకు సంబంధించినదిగా చూపించబడినది.

**హవీలాకు సంబంధించి బంగారమును, బోళమును, గోమేధికములును** ప్రస్తావించబడినాయి అమరియు ఇవన్నియూ సౌదీ అరేబియాలోని ఎర్ర సముద్రములో కనిపిస్తాయి కనుక ఇది అరేబియాలోని ఒక ప్రాంతముగా గుర్తించవచ్చును. నేడు సౌదీ అరేబియాలోని అత్యంత ధనికమైన గని, మెదీనా దగ్గరలో ఉన్న Mahd adh-Dhahab; దీని భావం, "బంగారము యొక్క ఊయల"; ఈ ప్రాంతములో ప్రాచీన దినాల్లో కూడా ఎక్కువగా గనులు త్రవ్వబడినవి. ఈ ప్రాంతములోనే పీషోను నదియొక్క జన్మస్థానము ఉండియుంటుంది. అరేబియా ఎడారిలోని ఇసుక ఏర్పడిన విధానము యొక్క ఉపగ్రహ ఛాయాచిత్రాలు, "మదీనాకు దగ్గరలోని హిజాజ్ పర్వత శ్రేణి నుండి సౌదీ అరేబియా గుండా ఈ శాన్యమునకు టైగ్రిస్ మరియు యూ ఫ్రటీసు నదుల ముఖ ద్వారము వద్ద కువైట్ లోని పర్షియన్ గల్ఫ్ ప్రాంతమునకు"[28] ఒక నది ప్రవహించినట్లు చూపిస్తున్నాయి. ఈ ఎండిపోయిన నది కొంతవరకు ఇసుక తెన్నెలచే కప్పబడి కొంతవరకు కనిపిస్తూ (the Wadi al-Batin)కువైట్ నదిగా మారింది.

**వచనము 13. రెండవ నది పేరు గీహోను**; అది **కూషు దేశమంతటిచుట్టు పారుచున్నది**. పాతనిబంధనలో గీహోనుకు సంబంధించిన వచనములన్నీ దావీదు పురము క్రిందన ఉబికి, కిద్రోను లోయలోనికి ప్రవహించిన ఊటను సూచిస్తున్నాయి కనుక ఈ నది యొక్క స్థానము కూడా వాదమునకు గురియైనది. పాతనిబంధన కాలములో యెరూషలేమునకు అందుబాటులో ఉన్న ఒకే ఒక మంచినీటి ఊట ఇది (1 రాజులు 1:33, 38, 45; 2 దిన. 32:30; 33:14). గీహోను నది కూషు దేశమంతటా ప్రవహించినది కనుక దీనిని యెరూషలేములోని నీటి ఊటగా గుర్తించుట తగదు.

కొందరు గీహోనును భారత దేశంలోని ఒక నదిగా లేదా ఆఫ్రికాలోని నైలునదిగా గుర్తిస్తున్నారు కాని, ఈ ఆలోచన ఖచ్చితమైనది కాదు. ఏదెను

తూర్పు టర్కీలో (చారిత్రాత్మక ఆర్మేనియా) ఉందని వాదించేవారు. దీనిని ఆ ప్రాంతములోని ఒక నదిగా గుర్తిస్తున్నారు. 2:13లోని "కూషు దేశము" అను మాట యొక్క భావమును బట్టి ఈ నది యొక్క స్థానమును గుర్తించుట కష్టమవుతుంది. సాధారణంగా, పాత నిబంధనలోని కూషు (כּוּשׁ, *Kush*), ప్రత్యేకించి ప్రవక్తల గ్రంథాలలో ఇతియోపియా లేదా ఆఫ్రికాలోని నైలునది పరివాహక ప్రాంతములోని నుబియా ప్రాంతమును సూచిస్తుంది.[29] ఏదేమైనా, హాము యొక్క కుమారులలో ఒకడు కూషు, అతడు నిమ్రోదుయొక్క తండ్రి, "షీనారు దేశములోని బాబెలు ఎరెకు అక్కదు కల్నే అను పట్టణములు అతని రాజ్యమునకు మొదలు." ఇక్కడనుండి అతడు "అష్షూరునకు బయలుదేరి వెళ్లి నీనెవె" మరియు మరి కొన్ని పట్టణములు నిర్మించెను (10:6–11).

ఆదికాండములోని వంశావళులు, ఐగుప్తుకు దక్షిణాన ఉన్న ఆఫ్రికా ప్రాంతములో కూషు సంతానము చెదరక పూర్వము ఉన్న పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయి–ఈ కాలములో "కూషు" (*Kush*) అను పదము మెసొపొతమియ లోయలోని గొప్ప పట్టణాలకు సంబంధించి ఉన్నది. అందుకేనేమో కొన్ని సార్లు "కూషు" అనే హెబ్రీ పదం *kashshu* అనే అక్కాదీయుల పదముతో సమానముగా ఉండి టైగ్రిస్ నది ప్రవహిస్తున్న ఉత్తర మెసొపొతమియాలోని కస్సీయుల పర్వత ప్రాంతమును సూచిస్తుంది. ఇంకా ముందుకు వెళితే, బబులోనును క్రీ.పూ. పన్నెండవ శతాబ్దము వరకు పాలించిన కూషును కస్సీయుల పితరునిగా బహుశా ఆ కారణముచేతనే పరిగణిస్తారు.[30] గీహోను నది కూషు దేశములో (కస్సీయుల) ప్రవహించినది కనుక ఆ నది తూర్పు నుండి మెసొపొతమియ లోయలోనికి వచ్చి టైగ్రిస్ (హిద్దెకెలు) నదిలోనికి ప్రవహించింది. సమరయుల పంచకాండములో 'గీహోను"ను కొయాస్పెస్ (Choaspes River)గా (ప్రస్తుతం Kerkhaగా పిలువబడుతున్నది) గుర్తింపబడిన *'Asqop*గా మార్చుట ద్వారా ఇటువంటి ఆలోచన కలుగుతుంది; ఈ నది టైగ్రిస్ నదికి తూర్పున ప్రవహించింది.[31]

**వచనము 14.** ఈ వివరణలోని మిగిలిన నదులు బాగా తెలిసినవే. **మూడవ నదిపేరు హిద్దెకెలు (టైగ్రిస్).** "టైగ్రిస్" LXXలో కనిపించే Τίγρις అనే గ్రీకు పేరుయొక్క ఆంగ్లరూపము; కాని, హిద్దెకెలు" (Hiddekel) Masoretic Text (MT) లోని חִדֶּקֶל (*Chiddeqel*) అనే హెబ్రీ పదము యొక్క రూపము. ఈ నది అష్షూరు దేశము మధ్యగుండా ప్రవహిస్తుంది కనుక ఇది అష్షూరుకు తూర్పున ప్రవహించినదను మాటను కొందరు ప్రశ్నిస్తున్నారు. దీనికి ఒక వివరణ యేమనగా, "అస్సీరియా" (אַשּׁוּר, *'Ashshur*) అని తర్జుమా చేయబడిన హెబ్రీ పదమునకు "అష్షూరును (NEB; REB; NIV; NJPSV; NLT) కూడా అన్వయించవచ్చు. అందునుబట్టి, ఆ పేరు దేశమును లేక ఏ పట్టణమును బట్టి ఆ దేశమునకు పేరు పెట్టబడినదో దానిని సూచించవచ్చు. "అష్షూరు" పట్టణం టైగ్రిస్

కు పశ్చిమాన ఉండి ఆ దేశమునకు ప్రాచీన రాజధానిగా ఉండేది. అందుకే "ఇది అష్షూరుకు తూర్పున ప్రవహించినది" (NIV) అను మాట సరియైనదే.

నాలుగవ నది యూఫ్రటీసు. యూఫ్రటీసు అనునది LXXలోని గ్రీకు నామము Εὐφράτης యొక్క ప్రతిలేఖనము. దీని హెబ్రీ పేరు פְּרָת (*P^e^rath*). యూఫ్రటీసు అని బైబిలులో అనేకమార్లు పేరు పెట్టి పిలువబడింది. పశ్చిమ–దక్షిణ ఆసియాలో ఇదే పెద్ద నది కనుక "గొప్పనది" అని కూడా పిలువబడింది (ఆది. 15:18; ద్వితీ. 1:7; యెహో. 1:4; ప్రకటన 9:14; 16:12). కొన్ని సార్లు ఇది "నది" అని పిలువాబడింది (యెహో. 24:2, 3, 14, 15). పశ్చిమాన యూఫ్రటీసు, దక్షిణాన టైగ్రిసు ఆవరించియున్న ప్రదేశము "రెండు నదుల మధ్యనున్న ప్రాంతము" లేదా "మెసొపొతమియ."

## తోటలో మానవుని పాత్ర (2:15–17)

**[15]మరియు దేవుడైన యెహోవా నరుని తీసుకొని ఏదెను తోటను సేద్యపరచుటకును దాని కాచుటకును దానిలో ఉంచెను. [16]మరియు దేవుడైన యెహోవా–ఈ తోటలో ఉన్న ప్రతీ వృక్షఫలములను నీవు నిరభ్యంతరముగా తినవచ్చు; [17]అయితే మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తినకూడదు; నీవు వాటిని తినుదినమున చచ్చెదవని నరునికాజ్ఞాపించెను.**

**వచనము 15. ఏదెను తోటలో** ఎటువంటి కట్టుకథల తంత్రములతో కూడినది కాదు. చెట్లు, మొక్కలు వాటంతట అవి పోషించుకొనలేవు లేదా మానవుడు అద్భుతాలు చేసి వాటిని పోషించలేదు. ఖాళీగా విశ్రాంతి తీసుకొనుటకు మరియు పనిలేని కాలముగా ఉండుటకు ఈ పరదైసును దేవుడు నిర్మించ; లేదు. దేవతలు కష్టమైన పని నుండి విశ్రాంతి తీసుకొనుటకు, వారి పనిని చేయుటకు దేవుడు మనిషిని సృష్టించాడని బబులోను సృష్టి కథలో చెప్పినట్లు కాదు.[32] దీనికి భిన్నంగా, దేవుడు మనిషిపై ఆధారపడలేదు–కాని ఏదెను తోట ఆధారపడింది. ఒక గృహనిర్వాహకుడు తన పనిని చేయునట్లు మానవుడు తోటలో పనిచేయాలి. ఇది కేవలం తోట మేలు కొరకు మాత్రమే కాదు గాని ఇది మానవుని మానసిక మరియు భౌతిక క్షేమము కొరకు. అందుకే, పాపము చేయుటకు మునుపే దేవుడైన యెహోవా నరుని తీసుకొని ఏదెను తోటను సేద్యపరచుటకును దాని కాచుటకును దానిలో ఉంచెను.

"సేద్యపరచుట" (עָבַד, *'abad*) అను మాట నేలను త్రవ్వుటకు సంబంధించిన "పని" లేదా "సేవ" అను భావమునిస్తుంది (2:5; 3:23; 4:2,12). దేవుని సేవించుట మరియు ఆరాధించుటలో కూడా మతపరమైన భావంతో ఈ పదం వాడబడుతుంది (నిర్గమ. 3:12; 4:23; 7:16; ద్వితీ. 6:13; 10:12; 11:13; 13:4). యాజకుల గురించిన లేఖన భాగాలలో, ఈ క్రియ మరియు దీనికి

సంబంధించిన ఒక నామవాచకం మొదట ప్రత్యక్ష గుడారములో, తరువాత దేవాలయములో లేవీయులు నిర్వర్తించిన మతపరమైన విధులను వర్ణిస్తుంది (నిర్గమ. 38:21; సంఖ్య. 3:7, 8; 4:23, 24, 26; 18:6; 1 దిన. 24:3, 19; 2 దిన. 8:14).

అదేవిధంగా, "కాచుట" అని అనువదించబడిన పదము, "కాపాడుట" (שָׁמַר, *shamar*) అను అర్థమును కూడా ఇస్తుంది. ఇది లౌకిక అర్థముతో, జీవవృక్షమునకు వెళ్లు మార్గము కాయుట (3:24), సహోదరుని ప్రమాదమునుండి కాపాడుట (రక్షించుట; 4:9), ఒక మందను శత్రుబారి నుండి కాపాడుట (30:31) అని కూడా వాడవచ్చు.[33] కాని, దీనిని మరింత సాధారణంగా, అబ్రాహాము మరియు అతని సంతానమునకు సున్నతి గురించి ఇవ్వబడిన దేవుని ఆజ్ఞను పాటించుటకు సంబంధించిన మతపరమైన పనిగా కూడా చూడవచ్చు (17:9, 10).

దేవుడు ఇశ్రాయేలునకు తన ఆజ్ఞలను, నిబంధనలను పాటించమని ఆజ్ఞాపించాడు; అనగా వారి జీవనశైలి నైతికంగా ఐగుప్తీయులు మరియు కనానీయులకంటే ఉన్నతమైనదిగా ఉండాలి (లేవీ. 18:3–5). అనధికృత వ్యక్తులు ప్రవేశించకుండా ప్రత్యక్ష గుడారమునకు కావలి కాయుటతో సహా దానిలోని వస్తువుల భద్రత (సంఖ్యా. 3:8) లేవీయుల ప్రాముఖ్యమైన మతపర బాధ్యత (సంఖ్యా. 1:51–53).

"ఉంచుట"[34] (נוּחַ, *nuach*) అనగా "విశ్రాంతి" అని భావము కనుక 15వ వచనములోని పరిభాష వైరుధ్యముగా ఉంటుంది, మరియు దాని యొక్క *nuach* అను క్రియాపదమునకు కారక రూపకము; "దేవుడు మానవుని తోటలో పనిచేయుటకు ఉంచినప్పుడు "[అతనిని] విశ్రాంతిలో పెట్టెను" అని దీనికి అక్షరార్థము. నిర్గమకాండము 20:10, 11లో ఇశ్రాయేలీయులు సబ్బాతు దినమందు ఎటువంటి పని చేయకూడదని దేవుడు ఆజ్ఞాపించిన చోట కూడా ఇటువంటి భిన్నమైన అర్థము కనిపిస్తుంది. దీనికి బదులు వారు ఆరు దినములు సృష్టిని చేసి ఏడవదినమున "విశ్రమించిన" దేవుని అనుకరించాలి. సబ్బాతు దినమందు ఆయన చేసిన దానికి మించి అస్సలు ఏమి చేయకూడదని దేవుడు ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించలేదు. యేసు విశ్రాంతి దినమందు కుంటివానిని బాగుచేసినందుకు ఖండించబడినప్పుడు, ఆయన "నా తండ్రి యిదివరకు పనిచేయుచున్నాడు, నేనును చేయుచున్నానని వారికి" జవాబిచ్చారు (యోహాను 5:17). యేసు చెప్పిన విషయం, దేవుడు తన సృష్టిని నడిపించడానికి, ఆయన ప్రజల జీవితాలను దీవించడానికి మరియు వారి ప్రార్థనలకు జవాబునివ్వడానికి ఎల్లప్పుడు–అనగా విశ్రాంతి దినమందు కూడా పనిచేస్తాడు. కనుక క్రీస్తు కూడా దేవుని మహిమపరచే స్వస్థతల ద్వారా ఏడవదినమున కూడా మంచిపనులు చేసారు.

మోషే ధర్మశాస్త్రంలో కూడా ఇదే సూత్రం అనువర్తించబడినది. దేవుని ప్రజలు కొనుగోలు అమ్మకాల ద్వారా మరింత సంపాదించుటకు, మరింత పెద్ద పంటలు పండించుట కొరకు సబ్బాతు దినమందు పనిచేయుట మానుకోవాలి (ప్రాముఖ్యంగా వారి సొంత విషయాలకొరకు; నిర్గమ. 31:13–17; నెహెమ్యా 13:15–18; యెష. 58:13, 14; ఆమోసు 8:4–6 చూడండి). కాని, ప్రజలకు మేలుకరమైన మరియు దేవుని మహిమపరచే జీవితాలు వారు జీవించాలని యేసు తరువాత వారికి చూపించారు. మానవునికి పని దేవునిచే ఇవ్వబడినది; అంతేకాదు, జంతువులవలె కాక మానవులకు మేలుకరమైనది చేయకుండా అతడు ఎన్నడు నిజమైన "విశ్రాంతి" (శాంతి, సంతృప్తి, మరియు జీవితంలో ఏదైనా అర్థవంతమైనది సాధించుటయందలి సంక్షేమము) పొందలేడు అని ఆదికాండము తెలియజేస్తుంది.

**వచనములు 16, 17**. రచయిత, ఏదెను తోటలోని జీవితమును దేవుడు మానవునికిచ్చిన సమృద్ధిని గురించి వర్ణించుట ద్వారా చూపిస్తాడు. దేవుని ఆజ్ఞలలో చేయవలసిన మరియు చేయకూడనవి రెండూ ఉన్నాయి. 2:9లో, తినుటకు రుచికరమైన మరియు చూపుకు రమ్యమైన అన్ని రకముల చెట్లు ఏదెను తోటలో ఉన్నవి, ప్రత్యేకంగా అక్కడ "జీవవృక్షము" ఉంది. దేవుడు తోటలోని **ప్రతి వృక్ష ఫలములను నిరభ్యంతరముగా తినవచ్చని ఉదారంగా చెప్పాడు**. కాని, అదే సమయంలో **మంచి చెడ్డల తెలివినిచ్చు చెట్టు ఫలమును** తినవద్దని చెప్పాడు. తోటలో నరునికి కావలసినంత స్వేచ్ఛ ఉన్నప్పటికీ, చేయకూడని పనిని చేయవద్దని చెప్పకపోతే ఆ స్వేచ్ఛకు అర్థం ఉండదు. నరుడు సృష్టికర్త కాదు కనుక ఒక స్పష్టముగాతనకు కొన్ని పరిమితులు ఉండాలని తాను అర్థంచేసుకోవాలి. వాస్తవానికి దేవుడు తినవద్దని చెప్పినది మంచి చెడ్డల తెలివినిచ్చు చెట్టు ఫలములు మాత్రమే కనుక ఆ పరిమితి అంత గొప్పదేమి కాదు.

ఇక్కడ మనం గమనించవలసిన మరొక ప్రాముఖ్యమైన విషయం ఏమిటంటే, దేవుడు మానవునిని వ్యక్తిగతముగా సంబోధించాడు. జంతువుల వలె కాక, మానవుడు మాత్రమే దేవుడు ఒక వ్యక్తిగా మాట్లాడుట విన్నాడు. అతడు ఒక్కడు మాత్రమే దేవుని స్వరూపంలో చేయబడి, తన సృష్టికర్తతో సంభాషించగలడు, కాని దేవుని ఆజ్ఞకు విధేయుడు కావాలా లేదా అనే నిర్ణయం తీసుకొనగలిగిన సామర్థ్యత కలిగినవాడు అతడు మాత్రమే. దేవుడు మాట్లాడిన విధానం ఆజ్ఞరూపంలో ఉంది; దేవుని ఆజ్ఞ మనిషికి అర్థమైనా కాకపోయినా దీనికి అతడు విధేయుడు అవుతాడా లేదా అనేది మనం గమనించాలి (3:6 చూడండి).

అనుమతినివ్వకపోవుట స్పష్టముగా ఉంది: "[నీవు] **తినకూడదు**." హెబ్రీ భాషలోని మాటకూడా పది ఆజ్ఞలలోవలె వద్దు అను לֹא (*lo'*)నే వినియోగిస్తుంది (నిర్గమ. 20:1–27). "నీవు తినకూడదు" అను మాటకు బదులు NIV అను మాటను వినియోగించినది.

כִּי (*ki*, "కొరకు")తో ప్రారంభమైన సాధారణ పదం అవిధేయతవలన కలిగే పరిణామాల గురించి వివరిస్తుంది: **"నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవు."** దేవుడు తిన వద్దని చెప్పిన చెట్టు ఫలమును తినిన దినమున మానవుడు చనిపోలేదు కనుక దేవుని యొక్క ఈ ఆజ్ఞ యొక్క భావము తెలుపుట కష్టము. దీనికి ప్రతిపాదిత వివరణ, బైబిలులో ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యి సంవత్సరములవలె ఉన్నదని (2 పేతురు 3:8; కీర్తనలు 90:4 చూడండి), కనుక మానవుడు వెయ్యి సంవత్సరాలు బ్రతుకక మునుపే చనిపోతాడని దేవుని ఉద్దేశం—వాస్తవానికి మానవునికి ఇదే జరిగింది. ఇది చక్కటి వివరణ అయినప్పటికీ, అంత ఆమోదయోగ్యమైనది కాదు.

రెండవ వివరణ, మొదటి దాని వలె, "దినము" అనే మాటను మనం 24 గంటలకంటే సాధారణ దృష్టితో చూడాలి. 2:4లో ఆరు దినముల సృష్టికే సంబంధించి కనిపించే మాటవంటిది ఇక్కడి "దినమున" (בְּיוֹם, *b^eyom*)ను పదము (2:4పై వ్యాఖ్యానము చూడండి). ఈ పదము వందల సంవత్సరాల కొరకు వాడబడుట సాధారణము కాదు.

మూడవ వివరణ, తిన వద్దని చెప్పిన పండును మానవుడు తినుదినమున క్షయమైనవానిగా దేవుడు హెచ్చరించాడు. ఇటువంటి ఆలోచన వలన దేవుడు మానవుని అమరత్వముతో సృజించాడను తలంపు వస్తుంది. కాని ఈ వాక్య భాగములో అలా చెప్పబడలేదు. మానవుడు తన జీవమును దేవునియొద్ద నుండి పొందుకున్నాడు కాని ఆ జీవము యొక్క కొనసాగింపు జీవవృక్ష ఫలమును తినుట ద్వారా జరుగుతుంది. ఇది మానవునికి అందుబాటులో లేనప్పుడు, దానికి తప్పని ప్రతిఫలం మరణమే. అంతే కాకుండా, 1 తిమోతి 6:16 ప్రకారం అమరత్వము దేవునికి మాత్రమే చెందిన ప్రత్యేకమైన గుణము.

నాల్గవ వివరణ, వారు ఆ పండు తినుదినమున "మరణమునకు నిశ్చయించబడ్డారు"[35] లేదా ఏదో ఒక రోజున "తప్పకుండా మరణిస్తారు" (NIV). మరొక మాటలో, అప్పటికప్పుడు చనిపోతారనే కాదుగాని దేవునికి అవిధేయులగుట "చివరికి మరణాన్ని కొనితెస్తుంది"[36] అనేది ఒక హెచ్చరిక. ఆదాము హవ్వలు ఈ విధంగా అర్థం చేసికొనలేదు. ఎందుకంటే సర్పము హవ్వ మాటలను ఉటంకిస్తూ, "మీరు చావనే చావరు; ఏలయనగా మీరు వాటిని తిను దినమున మీ కన్నులు తెరవబడుననియు, మీరు మంచిచెడ్డలను యెరిగినవారై దేవతలవలె ఉందురనియు దేవునికి తెలియును" (3:4, 5) అని పలికింది. వారు తిను "దినము"న చావకుండ మంచిచెడ్డలను తెలుసుకొనునట్లు వారి కన్నులు ఆ దినమున తెరువబడ్డాయి (3:22). ప్రమాదము మరియు వాగ్దానము రెండును భవిష్యత్తులో కొన్ని వందలు సంవత్సరాల తరువాత కాకుండా అదే "దినము"న జరుగవలసియున్నది.

ఐదవ వివరణ, ఆదాము హవ్వలు పండు తినిన దినమున దేవునినుండి

దూరమయ్యారు కనుక వారు ఆత్మీయంగా చనిపోయారు అనేది. దీనిలో కొంతమట్టుకు సత్యమున్నప్పటికీ, ఆదికాండములోని సందర్భము దీనిని చూపుటలేదు. వనములో నుండి బయటకు పంపివేయబడిన తరువాత వారు ఆత్మీయంగా మరణించిన స్థితిలో జీవించారని అక్కడ వాక్యభాగము చెప్పుటలేదు; జీవవృక్షము నుండి దూరము చేయబడుట వారికి భౌతిక మరణమై యుంది (3:22, 24). ఆదాము హవ్వలను జీవితాంతము వెంటాడిన పాపము యొక్క ప్రతిఫలములు భౌతికమైనవి: జన్మనిచ్చుటలో స్త్రీకి అధికమైన వేదన, పంటలను పండించుటలో పురుషునికి అధికమైన శ్రమ మరియు వారిద్దరూ భౌతికముగా మరణించుట. మొదటి పాపమును పౌలు కూడా ఈ విధంగానే వివరించాడు, "ఇట్లుండగా, ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రశ్నించెనో, ఆలాగునే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను" (రోమా. 5:12).

దేవుడు తినవద్దని చెప్పిన పండును తినిన దినమునే మానవునిపైకి భౌతిక మరణం వస్తుందని ఆయన హెచ్చరించాడనే చివరి వివరణ తక్కువ సమస్యలను ఎదుర్కొంటుంది. రెండు ప్రత్యేకమైన చెట్లు ఆ తోటలో పెరిగాయని మనం మరచిపోకూడదు: మొదటి చెట్టు, జీవవృక్షము, అది ఆత్మీయ జీవమునిచ్చేది కాదుగాని తినినప్పుడు మానవుని భౌతిక జీవమును కొనసాగించలేదు. అలాగే, రెండవ చెట్టు, మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షము, అది మానవుని, ఆత్మీయ జీవితమును పాడు చేయలేదు ఎందుకంటే పశ్చాత్తాపము మరియు దేవుని యొద్ద ఒప్పుకోలు నూతనత్వమును తేగలవు. కాని ఆదాము హవ్వలు జీవవృక్షమును తినలేకుండా చేసింది అది, దానికి ప్రతిఫలముగా శారీరక మరణం వారిపైకి మరియు మానవజాతి అంతటిపైకి వచ్చింది.

కాని ఆదాము హవ్వలు పండును తినిన దినమున శారీరక మరణం వారిపైకి రాలేదు కనుక సమస్య అలాగే ఉండిపోయింది. ఆదామును మరణం కబళించకముందు వందల సంవత్సరాలు జీవించాడు. దేవుడు తాను చెప్పిన మాట నిజంగా చెప్పలేదని లేదా ఆయన హెచ్చరికలోని శిక్షను విధించడానికి ఇష్టపడలేదని అనుకోకూడదు. దీని యొక్క భావం ఏమనగా, కేవలం తీర్పు మధ్యలో దేవుడు కృప చూపించిన మొదటి లేఖన భాగమిది. మానవుడు ఆ దినమున చనిపోవుటకు అర్హుడు, కాని దేవుడు తన కృపలో మానవుని బ్రతుకనిచ్చాడు–కనీసం మరణపు నీడలోనైనా సరే! దేవుడు శిక్షించడని మానవుడు స్వేచ్ఛగా పాపం చేయకూడదు. మరొక మాటలో, ఈ సంఘటన నిరీక్షణనివ్వదు. "పాపమువలన వచ్చు జీతము మరణం" అని మనకు తెలిసినప్పటికీ, మనమంతా మరణించుటకు అర్హులమైనప్పటికి, దేవుడు మనలను బ్రతకనిస్తున్నాడు. ఎందుకంటే, దేవుడు "యెవడును నశింపవలెనని ఇచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు ...

దీర్ఘశాంతముగలవాడై యున్నాడు" (2 పేతురు 3:9).

## జంతువులలో మానవునికి సాటియైన సహాయం లేదు (2:18–20)

**[18]మరియు దేవుడైన యెహోవా–నరుడు ఒంటరిగానుండుట మంచిది కాదు; వానికి సాటియైన సహాయమును వానికొరకు చేయుదుననుకొనెను. [19]దేవుడైన యెహోవా ప్రతి భూజంతువును, ప్రతి ఆకాశపక్షిని నేలనుండి నిర్మించి,ఆదాము వాటికి ఏ పేరు పెట్టనో చూచుటకు అతనియొద్దకు వాటిని రప్పించెను. జీవముగల ప్రతిదానికి ఆదాము ఏ పేరు పెట్టెనో ఆ పేరు దానికి కలిగెను. [20]అప్పుడు ఆదాము సమస్త పశువులకును సమస్త భూజంతువులకును పేరులు పెట్టెను. అయినను ఆదామునకు సాటియైన సహాయము అతనికి లేకపోయెను.**

**వచనము 18.** "మంచిది" లేదా "చాలామంచిది" అను సృష్టిని గురించిన అన్ని అనుకూల వ్యాఖ్యల వంటివియైన ఆయన మునుపటి ప్రకటనలకు భిన్నంగా– ఇక్కడ దేవుడు, "**నరుడు ఒంటరిగానుండుట మంచిది కాదు; వానికి సాటియైన సహాయమును వాణికొరకు చేయుదునుకొనెను**" అని గట్టిగా చెప్పెను. 1:27లో నరుని సృజించక మునుపు "నరులను చేయుదము" (1:26) అనే దైవిక ప్రతిపాదన చేసినట్లుగా, దేవుడు స్త్రీని చేయకముందే, నరుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదు అని గమనించాడు. కనుక, అతనికి సాటియైన సహాయమును చేయాలని దేవుడు ఆలోచించాడు. 1:27లో స్త్రీని చేసిన తరువాత మాత్రమే, దేవుడు సృష్టినంతటిని పరిశీలించి, 1:31లో "అహి చాలామంచిదిగా నుండెను" అనే దైవిక ప్రకటన చేసెను.

నరుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదు అను దేవుని మాట సాటియైన సహాయము యొక్క అవసరత గురించి పాఠకులకు చూపిస్తుంది. "మనవులెవ్వరు ద్వీపము వంటివారు కారు"[37] కనుక, అతనికి సాటియైన సహాయమును సృజించాలని దేవుడు తలంచాడు. "సహాయము" అను మాటను అపార్థంచేసుకొని కొందరు స్త్రీని పురుషునికంటే తక్కువగా చిత్రిస్తున్నారు. అటువంటివారి దృష్టిలో, ఈ మాట, ఒక యజమానురాలి యింటిలో అల్పమైన పనులు చేస్తూ, తనకు సహాయకురాలైన బాలిక వంటిది. ఒక నిపుణుడైన విద్యుత్తు పనివాడు, వడ్రంగి లేదా నీటి పారుదల పని చేయువానికి సహాయపడుటకు అతనితో కలసి వెళ్లు తక్కువ అనుభవం కలిగిన వ్యక్తి దీనికి మరొక సాదృశ్యము. నేర్చుకునేవానికి చిన్నచిన్నపనులు మాత్రమే అప్పగింపబడతాయి కాని పనిలోని సాంకేతికపరమైన విషయాలు అప్పగింపబడేటంత సామర్థ్యత అతనికి ఉండదు.

"సహాయం" (עֵזֶר, *'ezer*) అను మాట బైబిలులో ఇటువంటి ఆలోచనలకు భిన్నంగా వాడబడింది. ఒక వ్యక్తి, గుంపు లేదా దేశము ఒక పనిని తనంతట తాను

చేయలేనప్పుడు వారికి సహాయపడుట దీని ప్రాథమిక భావము. “ఏ ఒక్కరి శక్తి సరిపడనప్పుడు కలసి పనిచేయడం [సహాయపడేవారు], మరియు [సహాయము పొందేవారు] పరస్పరం సహకరించుకోవడం”[38] అను భావమును ఇది కలిగియుంది. యూదా వంటి బలహీనమైన దేశం బబులోనుతో యుద్ధము చేసినప్పుడు సహాయం కొరకు ఐగుప్తును ఆశ్రయించినట్లు (యెష. 31:1–3)తరచుగా, సహాయము పొందుకొనే వానికంటే సహాయం చేసేవాడే ఉన్నతుడు. సహాయము పొందుకొనే వారికంటే సహాయకుని ఔన్నత్యం పాతనిబంధనలో నలబై సార్లు కనిపించినప్పుడు దేవునిని తన ప్రజల “సహాయకుడుగా” (*‘ezer*) చిత్రించాయి (నిర్గమ. 18:4; ద్వితీ. 33:26; 1 దిన. 12:18; 2 దిన. 26:7; కీర్తనలు 10:14; 46:5; 54:4; 79:9; 119:173; యెష. 41:10, 13, 14; 44:2; 49:8 చూడండి).[39] అవసరతలో దేవుని యందు విశ్వసించిన వారికి మరియు ప్రార్థించిన వారికి సహాయం చేయడానికి, విడుదల నివ్వడానికి మరియు రక్షించడానికి దేవుడు దిగివచ్చినందుకు ఆయన మనకంటే తక్కువవాడు అని మనం ఎటువంటి పరిస్థితులలోను అనుకోకూడదు.

పురుషుని సహాయమైన స్త్రీ, అతని కంటే గొప్పది కాదు, తక్కువా కాదు; కాని ఆమె అతని సహచారిణిగా ఉండి, జీవితమును కట్టుటలో సమాన భాగస్వామ్యమును కలిగియుండాలి. స్త్రీ–పురుషులు భిన్నమైన గుణములు కలిగి, వైవిధ్యమైన సామర్థ్యతలు మరియు నిపుణతలు వైవాహిక జీవితంలోనికి తీసుకువస్తారు. జీవితాన్ని వారిద్దరూ కలసి కట్టుకొనుచుండగా, తాము పోషించవలసిన భిన్నమైన పాత్రలు వారు కలిగియుంటారు; కాని వారి తలాంతులు పరస్పరం అభినందనియంగా (ఒకదానికి మరొకటి పరిపూర్ణతనిచ్చేవిగా) ఉంటాయి. ఒక వ్యక్తిలో లేని గుణమును మరొకరు అందిస్తూ, బలహీనతలో బలమిస్తూ ఉంటారు. వైవాహిక జీవితంలోనికి వారిద్దరు అందించే గుణములు మరియు సామర్థ్యతల ద్వారా వారిద్దరు మరింత అభివృద్ధిలోనికి వస్తారు. నిజమే, ఆదికాండము యొక్క రచయిత కేవలం నరునికి సహాయముగా ఉండవలసిన స్త్రీ సృజించబడిన పద్ధతిని మాత్రమే వివరిస్తున్నాడు కాని ఈ సూత్రము భార్యభర్తలందరికీ సంబంధించినది (మత్తయి 19:3–6; ఎఫెసీ. 5:25–33; 1 పేతురు 3:1–7).

నరునికి సహాయముగా ఉండుట మాత్రమే కాదుగాని, స్త్రీకి ఇవ్వబడిన స్థానం అతని కొరకు లేక అక్షరార్థముగా అతని “ఎదుట” “సాటియైన” (נֶגֶד, *neged*) వ్యక్తి, అని నిర్వచించబడినది. ఈ పదం “ప్రాముఖ్యత” లేదా “ప్రాముఖ్యమైన” అనే అర్థాన్నిస్తుంది; కాని, 2:18, 20లో ఆమె నరునికి తగినదిగా ఉంటుందని భావమునిస్తుంది.[40] హెబ్రీ భాషలో “అతని వలె భిన్నమైన” అని అక్షరార్థమిచ్చే మిశ్రమ విభక్తి (compound prepositional phrase)యైన పదం వాడబడింది.[41] మరొక మాటలో అతనికి కేవలం అతనివలె ఉండే వ్యక్తి అవసరత లేదు; కొన్ని

విషయాలలో తనవలె మరికొన్ని విషయాలలో తనవలె ఉండకుండా కనిపించాలి. మానవునికి కేవలం తన అనుదిన పనిలో సహాయపడుచూ, తనకొరకు పిల్లలకు జన్మనిచ్చే వ్యక్తి మాత్రమే కావాలని కాదు. ఇందులో తమతమ పాత్రలు యిమిడియున్నప్పటికీ, భిన్నలింగ వ్యక్తియైన భార్య యొక్క సాన్నిహిత్య సాహచర్యంలో మాత్రమే దొరికే పరస్పర ఆధ్యాత్మిక, మానసిక, మరియు శారీరక సహాయం నరునికి అవసరం.[42] మానవుడు నివసించడానికి తగిన చక్కటి పరిస్థితులను సృజించుట మరియు దేవునితో సహవాసం చేయుట మానవునికి సరిపోలేదు కాని దేవుడు అతనిని ఒక సామాజిక వ్యక్తిగా సృజించి ఇతరులతో మరి ముఖ్యంగా తన భార్యతో సంబంధమును కలిగియుండు వానిగా తయారు చేసాడు. నరుని ఒంటరితనము సరియైనది కాదని దేవుడు గమనించినప్పుడు, మానవుడు ఎన్నడు "తాను ప్రేమించునంత వరకు జీవించడని, తన్ను తాను ... తన సొంత స్థాయిలో ఇతరులను ప్రేమించుటకు సమర్పించుకొనలేడని"[43] ఆయన చెబుతున్నాడు.

**వచనము 19**. తరువాత **ప్రతి భూజంతువును ప్రతి ఆకాశ పక్షిని సృష్టించుటకు** సంబంధించినది. దేవుడు మనిషి కంటే ముందుగా ఈ జీవులను ఉనికిలోనికి రప్పించాడని తెలిపే1:20–25నకు విరుద్ధమైనదిగా కొందరు ఈ వాక్యభాగ స్థానమును చూస్తారు. ఏదేమైనా, మనము ముందు చూచినట్లుగా, 1వ అధ్యాయము ఒక కాలక్రమానుసారమైన వృత్తాంతము, అయితే 2వ అధ్యాయము మరింత అంశానుసారమైనది మరియు వేదాంతపరమైనదై సృష్టిలో దేవుడు ఏమి చేసెనో అదియే గాక, ఆయన ఎందుకు మరియు ఎలా వీటిని చేశాడో బయల్పరుస్తుంది. దేవుడు వాటి స్వభావ రీత్యా జంతు రాజ్యము కంటే ఆయనకు మరియు మానవులకు మధ్య మరింత వ్యక్తిగత మరియు సన్నిహిత సంబంధాన్ని స్థాపించుకున్నాడని ఇక్కడ తెలుపబడినది (2:7–9, 15–17). తరువాత రచయిత పురుషుడు మరియు స్త్రీ మధ్య గల సంబంధం అలాంటిదే అని తెలిపాడు, దీనిని దేవుడు మానవాళి మరియు జంతువుల మధ్య ఎన్నటికినీ సాధ్యమైన దానికంటే మరింత సన్నిహితమైనదిగా భావించాడు (2:18–25).

మానవుని మరియు క్రింది స్థాయి జంతువుల యొక్క సృష్టికి మధ్య గల పోలికను మొదటి వృత్తాంతము తెలుపుతుంది. నరుని మరియు జీవరాసులను నేలమంటితో లేదా నేలనుండి **దేవుడు నిర్మించెను**; మరియు రెండు కూడా "జీవరాసులు" లేదా **జీవాత్మ** అని పిలువబడ్డాయి (2:7, 19). దేవుడు నరుని యొక్క అవసరత తనకు సంబంధించిన ఒక నిజమైన సాటియైన సహాయము అనే వాస్తవాన్ని గుర్తించినప్పటికీ, ఆయన దానిని తన కొరకు నిర్మించుటలో ఆలస్యము చేసాడు. దానికి బదులుగా, పేర్లు పెట్టుటకు జంతువులను మరియు పక్షులను నరుని యొద్దకు దేవుడు రప్పించెను. ప్రతిదానికి ఆదాము **ఏ పేరు పెట్టెనో ఆ పేరు** దానికి కలిగెను. ఈ స్థానంలో 1:26, 28లో జంతు రాజ్యమును ఏలుదురు అనిన

దైవ నిర్దేశాన్ని నరుడు నెరవేర్చడం ప్రారంభించాడు. ఆ అధికార స్థానము నుండి మాట్లాడుతూ అతడు వాటి పేర్లను ప్రకటించెను.

**వచనము 20.** ఆ కథ కొనసాగుతూ ఉండగా దేవుడు నేలనుండి **నరుని** మరియు జంతువులను సృష్టించినప్పటికీ వాటి మధ్య గుణాత్మకమైన బేధం ఉందని నరుడు తనంతట తానే గుర్తించవలిసి వచ్చిందనే విషయం స్పష్టమౌతుంది. అతడు ప్రతి జంతువును చూసి వాటికి పేరు పెట్టినప్పుడు వాటిలో తనకు స్పష్టంగా సరిపోయే తోడును గుర్తించగలనేమో అని అతడు ఆశ్చర్యానికి లోనయ్యాడు. తన చుట్టూ జంతువులు ఉన్నప్పటికి అతడు ఒంటరితనాన్ని అనుభవించడం మొదలుపెట్టాడు. సమస్య ఏమిటంటే, తాను ఒంటరిగా ఉండుటకు గల కారణం అక్కడ సాటియైన సహాయము అతనికి లేకపోయెను. అతని జీవితమునకు లోతైన స్థాయిలో భాగస్వామిగా ఉండేందుకు తనను పోలిన వ్యక్తి లేదు.

## పురుషుని కొరకు స్త్రీని సృజించుట (2:21–25)

**21అప్పుడు దేవుడైన యెహోవా ఆదామునకు గాఢ నిద్ర కలుగజేసి అతడు**
**నిద్రించినప్పుడు అతని ప్రక్కటెముకలలో ఒక దానిని తీసి ఆ చోటును మాంసముతో**
**పూడ్చి వేసెను. 22తరువాత దేవుడైన యెహోవా తాను ఆదాము నుండి తీసిన**
**ప్రక్కటెముకను స్త్రీనిగా నిర్మించి ఆమెను ఆదాము నొద్దకు తీసుకొని వచ్చెను.**
**23అప్పుడు ఆదాము ఇట్లనెను–**

**నా ఎముకలలో ఒక ఎముక**
**నా మాంసములో మాంసము**
**ఇది నరునిలోనుండి తీయబడెను గనుక నారి అనబడును.**

**24కాబట్టి పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడచి తన భార్యను**
**హత్తుకొనును; వారు ఏక శరీరమైయుందురు. 25అప్పుడు ఆదామును అతని**
**భార్యయు వారిద్దరు దిగంబరులుగా నుండిరి; అయితే వారు సిగ్గు ఎరుగక యుండిరి.**

**వచనము 21.** ప్రాచీన సమీప ప్రాచ్యములోని ఏ సాంప్రదాయంలో స్త్రీ యొక్క సృష్టిని గూర్చి ప్రత్యేకమైన వివరణ ఉండదు. కేవలము బైబిల్ సంబంధమైన చరిత్రలో మాత్రమే ఆమె పురుషుని కంటే తక్కువగా వర్గీకరించబడలేదు. 1:27లో, తన స్వరూపములో దేవుడు పురుషుని మరియు స్త్రీని సృష్టించెను అని చెప్పడినది, కాని ఇప్పుడు ఆయన ఉపయోగించిన విధానాలు మరియు సంఘటనల యొక్క క్రమాన్ని గూర్చి లేఖనము మనకు తెలియజేస్తుంది. దేవుడు నేలమంటి నుండి నరుని మొదట నిర్మించెను అని రచయిత చెబుతున్నాడు, మరియు ఆ తరువాత **ఆయన నరునికి గాఢ నిద్ర కలుగజేసెను.** תַּרְדֵּמָה

(*thardemah*) అనునది "గాఢ నిద్ర"కు ఉపయోగించబడిన పదము.[44] కొన్నిసార్లు అలాంటి నిద్ర దేవునిచే కలుగజేయబడినది (1 సమూ. 26:12; యెష. 29:10); కొన్ని సందర్భాలలో దైవ బయల్పాటు (ఆది. 15:12) కొరకు లేదా రాత్రి వేళ దర్శనము (యోబు 4:13, 33:15) కొరకు. ఇక్కడైతే, అతని ప్రక్కటెముకలలో ఒక దానిని తీసి దానిని స్త్రీనిగా "నిర్మించు"టకు దేవుడు అతడు నిద్రించినప్పుడు నరుని శరీరమునకు శస్త్రచికిత్స చేసెను (2:22).

"ఎముక" అను పదము צֵלָע (*tsela'*) అను హెబ్రీ పదము నుండి అనువదింపబడినది, అది నిజముగా "ప్రక్క" అను పదము నుండి వచ్చినది, ఇది అనేకమైనవాటి యొక్క ప్రక్కను సూచించవచ్చు. అది, కొండ, కట్టడము, గది, దేవాలయము, లేదా సామానుల యొక్క ముక్క.[45] నిజముగా, పాత నిబంధనలోని ఆదికాండం 2:21, 22లో మాత్రమే ఈ పదము "ఎముక" అని అనువదించబడినది. ఈ తర్జుమా, ఆ సందర్భమునకు సరిపోతుంది, ఎక్కువ ఆంగ్ల తర్జుమాలలో ఉపయోగించబడినది.

ఆయన "అతని ప్రక్కటెముకలలో ఒక దానిని తీసి" అను దానికి బదులుగా NIVలోని సూచనలలో *tsela'* కు ప్రత్యామ్నాయ పఠనముగా ఇవ్వబడినది; "[దేవుడు] నరుని యొక్క ప్రక్కలో భాగమును తీసుకొనెను" (ఉద్ఘాటన చేర్చబడినది). శస్త్రచికిత్స ప్రక్రియలో నుండి తాను లేచిన తరువాత చేసిన నరుని యొక్క ప్రకటనకు ఈ అనువాదము పూర్తిగా అనుగుణిస్తుంది. దేవుడు స్త్రీని ఆయన యొద్దకు తీసుకొని వచ్చినప్పుడు, ఆ ఎముక మరియు మాంసము రెండునూ తన శరీరములోనుండి తీయబడి స్త్రీగా రూపింపబడెను అని తేటపరుస్తూ అతను వెంటనే ఇది ఇప్పుడు "నా ఎముకలలో ఒక ఎముక, నా మాంసములో మాంసము" (2:23) అని చెప్పెను.

తొలి బోధకులలో కొందరు మొదటి నరుడు (ఆదాము) మొదట వాస్తవముగా ద్విలింగుడని బోధించెడివారు, అనగా, స్త్రీ మరియు పురుషుని యొక్క శారీరక లక్షణాలు కలిగి యుండుట లేదా స్వభావం కలిగి యుండుట. "దేవుడు ఆదామును సృజించిన దినమున దేవుని పోలికగా అతని చేసెను; మగవానిగాను ఆడుదానిగాను వారిని సృజించి వారు సృజించబడిన దినమున వారిని ఆశీర్వదించి వారికి నరులని אָדָם, పేరు పెట్టెను" అని ఆదికాండం 5:1, 2 నుండి ఈ అభిప్రాయానికి వచ్చారు. ఇటీవలి దశాబ్దాలలో, మొదట స్త్రీ మరియు పురుషుని యొక్క పేర్లు "ఆదామే" ("మనుష్యుడు") అని చెప్తూ ఈ బోధకుల భావనను స్త్రీ వాదులు 2:21, 22తో అనుబంధించారు.

ఏదేమైనా, 5:2లోని వంశావళి పట్టికకు ఆధారమైన 1:27, 28 నుండి ద్విలైంగిక వ్యక్తికన్నా ఆ వచనము ఇద్దరు వ్యక్తులను చూపుతుంది అని నిరూపించబడుతుంది. అంతేకాక, 1:27లో ఆ ఇద్దరు వ్యక్తులకు బహువచనమైన "వారు" ఉపయోగించబడినది మరియు ఏకవచనమైన "అతడు"కి

(పురుషలింగము) విరుద్ధంగా వారిని స్త్రీ మరియు పురుషునిగా గుర్తిస్తుంది. వివరణలోనిది ఏది కూడా మొదట మానవుడు శారీరకముగా ద్విలింగుడని సూచించదు.[46] వాస్తవముగా, 1:26, 27 మరియు 5:2లోని హెబ్రీ పదమైన ఆదాము "మానవాళి" అనే అర్థాన్నిచ్చే సాధారణ వాడుక పదము మరియు దీనిలో స్త్రీ మరియు పురుషుని కలుపుకుంటుంది. 3:17లోని "హవ్వ" గా పిలువబడిన స్త్రీకి విరుద్ధముగా 3:20లోని పురుషునికి వ్యక్తిగత పేరు "ఆదాము" అని మొదట ఉపయోగింపబడినది.

**వచనము 22**. చరిత్ర కొనసాగుతూ, **దేవుడు ఆదాము నుండి తీసిన ప్రక్కటెముకను స్త్రీనిగా నిర్మించినట్లు తెలుపుతుంది**. హెబ్రీ పదమైన (בָּנָה, *banah*) యొక్క అక్షరార్థం "నిర్మించుట" మరియు అది దేవుడిని కర్తగా తీసుకున్నది ఎందుకంటే స్త్రీని సృజించిన నేర్పరియైన శిల్పి ఆయనే. కొన్ని స్థలములలో, అనేకమైనవాటిని నిర్మించినది దేవుడే అని చెప్పబడినది, అది ఏమిటంటే, పడిపోయిన "దావీదు గుడారము" (ఆమోసు 9:11), "ఇల్లు" (కుటుంబము మరియు పిల్లలు) (కీర్తనలు 127:1, 3–5), "పరిశుద్ధ మందిరమును" (కీర్తనలు 78:69).[47] 1:26, 27 లో మానవుని యొక్క సృష్టిని (స్త్రీ మరియు పురుషుడు) రచయిత వివరించినప్పుడు ఆయన בָּרָא, (*bara'*, "సృష్టించుట") మరియు (עָשָׂה, *aśah*, నిర్మించెను") వంటి క్రియాపదములను ఉపయోగించెను ఇక్కడ, స్త్రీని సూచించినప్పుడు మాత్రమే దేవునిని నైపుణ్యము గల "నిర్మాత" గా చిత్రీకరించే పదమును ఆయన ఎన్నుకున్నాడు. క్రియాపదమైన *banah* యొక్క నిర్వచనము ప్రకారము, దేవుని క్రియ యొక్క ఉత్పాదితమును సూచిస్తుంది– స్త్రీ– "అందము, స్థిరత్వము మరియు మన్నిక" కలిగిన జీవి.[48]

దేవుడు (స్త్రీని) ఆదాము నొద్దకు తీసుకొని వచ్చినప్పుడు, "వివాహాలు చేయు వానివలె" లేదా తనకు కాబోయే భర్తనొద్దకు తీసుకు వెళ్ళే పెండ్లికుమార్తె తండ్రిగా పరిగణించబడెను. ఇది సహజంగా ఎక్కువ వివాహాలు పెద్దలచే నిశ్చయించబడే పురాతన పిత్రుస్వామ్య సమాజానికి సరిపోతుంది, దేవుడు స్త్రీని మరియు పురుషుని సృష్టించెను కాబట్టి పురుషునికి ఏవిధమైన సాటియైన సహాయము అవసరమో ఆయనకు కచ్చితముగా తెలుసు; కాని దేవుడు ఆమెను అతని యొద్దకు తీసుకొని వచ్చినప్పుడు ఈ దైవ బహుమానము ఎంత ఆశ్చర్యకరమైనదో తనకు తానే కనుగొనుటకు ఆయన పురుషుని అనుమతించెను.

**వచనము 23**. సంపూర్ణమైన చెలికత్తెను మరియు సాటియైన సహాయమును **నరుడు** కలిసినప్పుడు, ఆకస్మికమైన మరియు చెప్పుకోలేనంత సంతోషమును అతడు అనుభవించెను. అతడి ఉత్సాహం కవితా ద్విపదిలో లిఖించబడినది,[49] **"ఇది నా ఎముకలలో ఒక ఎముక నా మాంసములో మాంసము"** అని అత్యద్భుతముగా చెప్పెను. "ఇప్పుడు" కు బదులుగా NRSVలో "చివరకు" అని

ఉన్నది. నరునికి ఏది కచ్చితముగా అవసరమో చివరకు దేవుడు వానికి అనుగ్రహించెను. వాస్తవముగా, ఆయన యొక్క అతిశయోక్తిలో, "ఇది" అను పదమును మూడు సార్లు స్త్రీ లింగ రూపంలో ఉపయోగించెను (זֹאת, *zo'th*): "ఇది ['ఇది'] ఇప్పుడు నా ఎముకలలో ఎముక ..."; "**ఈమె ['ఇది'] నారి అనబడును ... ఈమె ['ఇది'] నరునిలోనుండి తీయబడెను**." నరుడు, చివరకు, తన నిజమైన "ప్రాణ సహచారిణిని" కనుగొనెను.

స్త్రీని గురించి ఉన్న నరుని ప్రతిపాదనయైన తన ఎముకలలో ఎముక మరియు తన మాంసములో మాంసము అనునది సాధారణ హెబ్రీ భావన అయిన దగ్గర సంబంధము లేదా రక్త సంబంధముతో సమానము (29:14; న్యాయాధి. 9:1, 2; 2 సమూ. 19:12, 13). కొన్ని సందర్భాలలో, దృఢ విశ్వాసమును అది తెలియజేస్తుండవచ్చు (2 సమూ. 5:1-3; 1 దిన. 11:1).

ఆనందాన్ని గూర్చి మనిషి యొక్క ఆశ్చర్యార్థకములోని చివరి భాగము మాటల గారడిని కలిగి వుంటుంది: ఆమె "నరునిలోనుండి [אִישׁ, *'ish*) తీయబడెను గనుక నారి [אִשָּׁה, *'ishshah*] అనబడును." ఆ రెండు హెబ్రీ పదములు అనిశ్చిత శబ్దలక్షణములు గలవి, కాని ఇక్కడ అవి శ్లేషగా వ్యవహరిస్తాయి ఎందుకంటే, అవి ఒకే విధముగా ధ్వనిస్తాయి. జంతువులను చూచి వాటికి పేర్లు పెట్టిన తరువాత, మిగిలిన జీవరాసులన్నిటికన్నా తాను ఎంత వ్యత్యాసముగా (మానవుని వలె) ఉన్నాడో అతను తెలుసుకొన్నాడు. అప్పుడు, దేవుడు స్త్రీని అతని యొద్దకు తీసుకొని వచ్చినప్పుడు మొట్టమొదటిసారి, అతడు గుర్తించినది ఏమిటంటే, తనవలె (ఒక మానవునివలె) అదే స్వభావం కలిగి ఉన్న జీవి యొక్క సముఖములో అతడు ఉన్నాడని – కాని ఆమె లైంగికముగా వ్యతాసము కలిగి యున్నదని.[50] అందుచేత, అతడు ఆమెను "నారి [*'ishshah*] అని పిలిచెను, ఎందుకనగా ఆమె నరు [*'ish*] నిలోనుండి తీయబడెను." ఇతర పదాలలో, తనకు మరియు స్త్రీకి మధ్య ఉన్న పోలికనే కాకుండా వ్యత్యాసమును కూడ చూచాడు. కావున దీనిని తెలియజేయుటకు అతడు రెండు పేర్లను ఉపయోగించాడు: మరియు.

స్త్రీ పురుషునిలోనుండి తీయబడెను కాబట్టి, ఆమె యొక్క జీవితములో అతని మీద ఆధార పడుతుందని ఆ వివరము సూచిస్తుంది; మరియు వాస్తవానికి అతడు ఆమెకు పేరు పెట్టుట అనేది ఆయనకు ఆమెపై ఉన్న అధికారమును సూచిస్తుంది. అదే విధముగా పక్షులకు మరియు జంతువులకు పేర్లు పెట్టుట అనేది వాటిపై తనకున్న అధికారమును చూపుతుంది (2:19, 20). అయితే, భార్యపైన భర్త యొక్క నాయకత్వము మరియు అతని ముందు ఆమె యొక్క విధేయత ఆమెను అగౌరవపరచే మరియు అప్రతిష్టపాలు చేసే సహించలేని అధికారమని అర్థము చేసుకొనకూడదు. దీనికి విరుద్ధముగా, పౌలు క్రొత్తనిబంధనలో వ్యాఖ్యానించిన ప్రకారము (1 కొరింథీ 11:3, 8–12; ఎఫెస్సీ 5:22–

33), భార్యపై భర్త యొక్క అధికారము, నాయకత్వం అనేవి యేసు సంఘము కోసం ప్రదర్శించిన విధముగా: ప్రేమ కలిగి, జాగ్రత్త కలిగి, పరిచారము కలిగి, మరియు త్యాగపురితముగా ఉండాలి. వేరొక విధముగా, ఆమె కొరకు ఏదైనా చేయగల మనస్సు కలిగి ఉండాలి–సంఘము కొరకు క్రీస్తు ప్రాణము పెట్టిన విధముగా, ఆమె కొరకు తన ప్రాణమును సహితము పెట్టు వానివలె ఉండవలెను.

**వచనము 24**. ఈ వచనం నరుని మాటల కొనసాగింపు కాదు కాని యేసు చివరికి దేవునికి అపాదించిన రచయిత యొక్క వ్యాఖ్యానము (మత్తయి 19:4, 5). దైవావేశము వలన వివరించువాడు మొదటి వివాహములో చూసిన సూత్రమును ప్రతి వివాహమునకు వర్తింపజేస్తున్నాడు: **కాబట్టి పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారు ఏకశరీరమై యుందురు.** పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడచుట అను వాక్యము వ్యాఖ్యాతలను కలవరమునకు గురిచేస్తుంది. ఎందుకనగా పురాతన పిత్రుస్వామ్య సమాజములోని ఆచార ప్రకారము స్త్రీ తన ఇంటిని విడచి అతని తల్లిదండ్రుల ఇంటిలో లేదా ఇంటి సమీపములో తన భర్తతో కలిసి క్రొత్త జీవితమును ఆరంభించుట అనునది ఆమె కొరకు నియమించబడినది. తప్పనిసరిగా, ఈ నియమమునకు మినహాయింపులు ఉన్నాయి: యాకోబు తన మామయైన లాబానుతో మెసొపొతమియలోని హారానులో ఉండెను (29:1–31:38); మరియు మోషే సినాయి అరణ్యములో 40 సంవత్సరములు తన భార్య సిప్పోరా యొక్క తండ్రియైన యిత్రో యొక్క గొర్రెలను కాచెను (నిర్గమ. 2:15–3:1; అపొ. 7:29, 30).

ఏదేమైనా, ఇవి సూత్రప్రాయంగా ఉండే పద్ధతులు కావు. పురుషుడు తన తల్లిదండ్రులను శారీరకంగా విడుచుట కంటె భావోద్వేగముగా మరియు మానసికముగా విడుచుట అను దానిని ఈ వచనము సూచించవచ్చు. ఇక్కడ పాత సామెత అనువర్తింపవచ్చు: "తన కొరకు తన భార్యను తెచ్చుకొను వరకు పుత్రుడు పుత్రుడే; తన జీవితాంతము పుత్రిక పుత్రికే." క్రొత్త భర్త కన్నా క్రొత్త భార్య తన తల్లిదండ్రులకు భావోద్వేగ అనుబంధం కలిగి ఉంటుంది; అందుచేత, వివాహములో, పురుషుడు తన తల్లిదండ్రులను విడుచు పద్ధతిలో స్త్రీ తన వారిని ఎప్పటికినీ విడువదు.[51] పితృస్వామ్య సమాజములో, ఒక స్త్రీ తన భర్తను వెంబడిస్తూ మరియు అతని కుటుంబములోని భాగమైనప్పుడు, తన తల్లిదండ్రులమీద ఆధారపడు సంబంధాలు తెంచుకోవడం భర్తకు కీలకమైనదని రచయిత భావిస్తున్నాడు. తన తల్లిదండ్రుల గృహములోనుండి తీసివేయబడుట ద్వారా, కొంతవరకు, భార్య అలా చేసియుండవచ్చు; మరియు వారిరువురు ఒకరి మీద ఒకరు ఆధారపడి కలిసి క్రొత్త జీవితమును కొనసాగించవలెను.

24వ వచనములో "విడిచి"కి ఉపయోగించిన క్రియాపదం (עָזַב, *'azab*) తరచుగా ఏదైనా విడుచుటకు అదనపు శబ్దార్థము కలిగియుంటుంది.

సాధారణముగా విగ్రహముల కొరకు దేవుని విడుచుటకు సంబంధించి పాత నిబంధనలో రెండువందల సార్లకు పైగా ఈ విధానములో ఉపయోగించబడినది. తన తల్లిదండ్రులను విడుచుటకు వివాహము చేసుకొనే పురుషులను రచయిత స్పష్టంగా ఉపదేశించుట లేదు కాబట్టి, ఆదికాండము 2:24 యొక్క సందర్భానికి అది సరిపోదు.

బహుశా హెబ్రీ పదమునకు మెరుగైన అనువాదము “విడనాడుట”; మరియు విగ్రహారాధన కొరకు దేవుని మరియు ఆయన యొక్క ఒడంబడికను విడనాడుటను సూచించుటకు అనేక భాగాలలో NASB అనువదిస్తుంది (ద్వితీ. 28:20; 29:25; న్యాయాధి. 10:10; 1 రాజులు 19:10, 14; యిర్మీయా 1:16; 2:13, 17, 19; 5:7; 16:11; 17:13; 19:4; 22:9). ఏదేమైనా, “వదులుకొను” అను అనువాదము వలె, సంపూర్ణముగా “విడనాడుట”కు ఖచ్చిత అర్థము ఇక్కడ రచయిత మనస్సులో ఉన్నది కాదు. దీనికి విరుద్ధముగా, పురుషుని తల్లిదండ్రులను విడుచుటకు (విడనాడుట) సంబంధించి *azab* అను పదోపయోగము సంబంధిత భావముతో అర్థము చేసుకొనవలెను. పురుషుడు వివాహము చేసుకొన్నప్పుడు, తన ప్రాధాన్యతలు మారాలి అనే ఆలోచన కనబడుచున్నది. భార్యను తీసుకొనక ముందు, తన మొదటి బాధ్యత తన తల్లిదండ్రులు, కానీ తరువాత, ముందు తన భార్య రావాలి.[52]

పాశ్చాత్య సమాజాలలో, తల్లిదండ్రుల పట్ల బాధ్యతలు కొన్నిసార్లు తక్కువగా వుంటాయి, ఇక్కడ రచయిత చెప్పే విషయం ముఖ్యమైనదిగా కనబడదు. అయితే, తల్లిదండ్రులను గౌరవించుటకంటే దేవుని గౌరవించుట మాత్రమే ప్రాముఖ్యమైన పురాతన, సాంప్రదాయక సమాజాలలో, వారిని విడనాడుటను గూర్చిన ఈ వ్యాఖ్య ఆశ్చర్యమును కలిగించవచ్చు.[53] తల్లిని మరియు తండ్రిని ద్వేషించుట, అనునది వాస్తవమునకు మన తల్లిదండ్రుల కన్నా ఎక్కువగా దేవుని ప్రేమింపవలెను (లూకా 14:26; మత్తయి 10:37 చూడండి) అను యేసు మాటలకు సమానమైన ఆశ్చర్యాన్ని కలుగజేస్తుంది. ఈ భాగములో నిస్సందేహముగా అదే వాస్తవము ఎందుకనగా, వివాహముతో బాధ్యతలలో మార్పు చోటు చేసుకుంటుంది. భర్త ఇప్పటికి తన తల్లిదండ్రులను గౌరవించాలి అయితే (నిర్గమ. 20:12; ద్వితీ. 5:16), ఇప్పుడు తన భార్యను వారికన్నా పైగా ఉంచాలి.

పురుషుడు తన తల్లిదండ్రులను విడువవలెను అను మాట తరువాత, అతడు “తన భార్యను “హత్తుకొనును [דָּבַק, *dabaq*] అని రచయిత చెప్పెను. ఈ హెబ్రీ పదము యొక్క అర్థము “హత్తుకొనుట” లేదా “అంటుకొని” అనునవి దేవుని (ద్వితీ. 10:20; 11:22; 13:4; 30:20; న్యాయాధి. 23:8), వస్తువులను (ద్వితీ. 13:17), మరియు జనములను (యెహోషువా 23:12) అంతేకాకుండా మరియు భాగస్వామిని హత్తుకొని లేదా పట్టుకొని యుండుట అను అర్థములో తరచుగా ఉపయోగించబడును. దీనిని వ్యక్తిగత సంబంధాల కొరకు కూడా ఉపయోగిస్తారు,

ఆదికాండము 34:3లో NASB తెలుపుతున్న ప్రకారము షెకెము "దీనాకు గాఢముగా ఆకర్షితుడయ్యెను." "అతని మనస్సు [ఆమె] మీదనే ఉండెను" అని హెబ్రీ పదము అక్షరాలా తెలుపుచున్నది. హృదయాన్ని తాకే మరియొక ఉదాహరణయైన *dabaq* యొక్క ప్రయోగము రూతు కథలో ఉన్నది: నయోమి బెత్లేహేమునకు తిరిగి ప్రయాణమైనప్పుడు, మోయాబుకు చెందిన తన యిద్దరు కోడండ్రు ఏడ్చారు, మరియు ఓర్పా తన జనుల యొద్దకు తిరిగివెళ్ళెను. అయితే, "రూతు ఆమెను హత్తుకొని [*dabaq*]" మరియు "నన్ను విడిచిపెట్టమని [*azab*] నన్ను బతిమాలుకొనవద్దు" (రూతు 1:14, 16) అని చెప్పెను.

"హత్తుకొను" అను భావన "ఏక శరీరము" వలె భార్యభర్తలు ఒక ఒడంబడిక సంబంధం పంచుకొనెదరు అని సూచిస్తుంది.[54] అది విశ్వసనీయత అను ప్రతిజ్ఞ మరియు శాస్వతత కలిగి అన్ని ఇతర కుటుంబ కట్టుబాట్లను అధిగమిస్తుంది. వివాహము అనునది ఒకని యొక్క వ్యక్తిగత వ్యవహారము కాదు. కాని, ఇద్దరు వ్యక్తుల (ఒక పురుషుడు మరియు ఒక స్త్రీ) తమ కుటుంబాలకు, వారి స్నేహితులకు, మరియు సమాజానికి వారు ఒక క్రొత్త కుటుంబ వ్యవస్థగా తయారగుటకు అత్యంత సన్నిహితముగా ఏకమగుతున్నారని తెలిపెదరు. పురుషుడు మరియు స్త్రీ ఏకమైనప్పుడు, వారు సృష్టికర్త యొక్క మొదటి ఆజ్ఞను నెరవేర్చే శక్తి కలిగి ఉన్నారు: "మీరు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండించుడి" (1:28). "ఏక శరీరమగుట" అను పదము యొక్క ప్రథమ ఉద్దేశం లైంగిక సంబంధము లేదా కలిసి పిల్లలను కనుట అనుదానిపై కాకపోవచ్చును, అయినా దీనిలో వారి కలయిక యొక్క భావాలకు మినహాయింపులేదు. దీనికి బదులుగా, "క్రొత్తజంట యొక్క ఆత్మీయ మరియు సాంఘిక ఏకత్వము"[55] మీదనే ఆ ముఖ్య ఉద్దేశము ఉంటుంది. భాగస్వామితో ఏక శరీరమగుట అనునది రక్త సంబంధం కన్నా దగ్గర బంధాన్ని సృష్టిస్తుంది, మరియు వారు ఎటువంటి మానవ సంబంధాలు అందించలేని విధములో వారి జీవితములో నేరవేర్పును మరియు పరిపూర్ణతను వారిరువురు కనుగొందురు.

**వచనము 25. అప్పుడు ఆదామును అతని భార్యయు వారిద్దరు దిగంబరులుగా నుండిరి; అయితే వారు సిగ్గు ఎరుగక యుండిరి** అను పరిశీలనతో ఈ అధ్యాయము ముగిసినది. ఇది 3వ అధ్యాయములోని సంఘటనలకు వేదికగా ఏర్పాటు చేయబడినది, దీనిలో నిషేధించబడిన చెట్టు ఫలము తినిన తరువాత ఆదాము మరియు హవ్వ తమ దిగంబరత్వాన్ని గూర్చి తెలుసుకొనిరి. వారు కనుగొనిన దానితో, సిగ్గును మొట్టమొదటి సారిగా అనుభవించారు. మొదటిగా, స్త్రీ మరియు పురుషుడు "సిగ్గుపడలేదు." ఇక్కడ గమనించవలసినది ఆంగ్ల పదమైన "shame" (సిగ్గు) సూచించు లాగున בּוֹשׁ (*bosh*) అను హెబ్రీ పదము పాపము వలన కలుగు వ్యక్తిగత దోషమును సూచించదు. పాతనిబంధనలో పాపము లేక దోషము లేని సందర్భ కథనములలో *bosh* అను పదము కొన్నిసార్లు సిగ్గునకు

(shame) ఉపయోగింపబడెను; దానికి బదులుగా, “చింత” లేదా “సిగ్గువింతలు పడుట” అనే భావనను అది సూచిస్తుంది. (న్యాయాధి. 3:25లో NASB *bosh*ను “చింత”గా అనువదిస్తుంది.) వాస్తవముగా, ఒక వ్యక్తి భరించే లేదా అనుభవించే ప్రాథమిక “లైంగిక ఆధారిత అవమానము” కాని దానిపై *bosh* అను పదము అనేక సార్లు నిష్క్రియాత్మక శబ్దార్థము కలిగి ఉంటుంది.[56] చూచేవారి సమక్షంలో వ్యక్తుల లేక సమూహాల క్రియలు “అవమానకరమైనవి,” “అగౌరవమైనవి,” “కించపరచదగినవి,” లేక “మూర్ఖత్వముగా చూడబడినవి” అని ఈ పదము యొక్క ఎక్కువ సాధారణ అర్థములు సూచిస్తాయి (యెష. 1:29; 20:5; యిర్మీయా 2:36; 48:13).[57]

వారు పాపము చేసిన క్షణము వరకు, ఆదాము మరియు హవ్వ ఆదర్శవంతమైన స్థితిలో సంపూర్ణతతో మరియు అమాయకత్వముతో (చిన్నపిల్లల వలె) తమ లైంగికతను చూచారు. ఎందుకంటే, వారి దిగంబరత్వము అనునది నిష్కాపట్యము మరియు నమ్మకమునకు భావనగా ఉన్నదని లేఖన భాగము చెబుతుంది. వారు పాపము ద్వారా వారి అమాయకత్వమును కోల్పోయినప్పుడు, సిగ్గును అనుభవించి మరియు వస్త్రములను కప్పుకొనుట ద్వారా తమ దిగంబరత్వమునుండి రక్షించుకొనే అవసరం ఉందని వారు గ్రహించిరి (3:7).[58] దేవుడు వారిని సమీపించుట విని వారు అంజూరపు ఆకులతో కప్పుకొని మరియు కచ్చడములు చేసుకొని చెట్లమధ్య దాగుకొనుటకు ప్రయత్నించిరి.

దిగంబరత్వమును ఆరోగ్యకరమైనదిగా మరియు సాధారణమైన స్థితిగా స్త్రీలు మరియు పురుషులు ఇప్పుడు ఈ సమాజములో అనుభవించాలని ఆదికాండము 2:25 ప్రశంసించుచున్నదని అని దాని అర్థం కాదు. దీనికి విరుద్ధముగా నిరసనలు ఉన్నప్పటికిని, చిన్నపిల్లల వలె అగుటకు గడియారమును వెనుకకు త్రిప్పుట, వారి దిగంబరత్వమును గూర్చి తాము సిగ్గుపడనప్పుడు ఆదాము మరియు హవ్వ వలె ఏదెను యొక్క నిష్కపటతను ఆనందించుట అనునది అసాధ్యము. దీనికి బదులుగా, మనిషి పతనము తరువాత, లేఖనముల ప్రాథమిక ముందస్తు ఆలోచన ఏమిటంటే బహిరంగముగా ఒకని లైంగిక అవయవాలను నగ్నముగా కనపరచుట అనునది అసభ్యకరము (నిర్గమ. 20:26; 28:42, 43). అదే విధముగా, తాను అదే లింగము కలిగినవాడైనప్పటికిని, కుటుంబములోని మరొక వ్యక్తి నగ్నతను తదేకముగా చూచుట క్షమార్హము కాదు (9:20–27). వావి–వరుసలలో కలుగు శోధన వలన, వ్యతిరేక లింగులైన సభ్యుల మానచ్ఛాదనమును బయలుపరచుట ఖచ్చితముగా నిషేదింపబడిన. “నగ్నత్వమును బయలుపరచుట” అనునది కొన్నిసార్లు లైంగిక సంబంధమునకు హెబ్రీ పదబంధముగా ఉపయోగించవచ్చు. ఇది లేవీయకాండము 18:6–17లో తరచుగా కనిపిస్తూ, పురుషుడు తన స్త్రీ సంబంధులతో వావి చేయుట అనునది అది నిషేదిస్తుంది.[59]

# అన్వయము

## విశ్రాంతి దినము (2:1–3)

విశ్రాంతి దినము (వారములో ఏడవ రోజు) సృష్టికర్త యొక్క విశ్రాంతిదినము. ఆయన అలయడు (యెష. 40:28) లేదా బలమును తిరిగి పొందే అవసరము ఆయనకు లేదు; "ఆకాశమును భూమియు" మరియు "వాటిలోనున్న సమస్త సమూహముల"ను సృష్టించే కార్యకలాపాన్ని ఆయన నిలిపివేసెను (2:1–3). ఎందుకనగా, సృష్టి యొక్క పనిని ఆయన సంపూర్తి చేసెను. మరో అర్థములో, వర్షమును పంపుట ద్వారా ఈ లోకాన్ని ఆదుకోవడములో, విత్తనాన్ని ఎదిగింపజేయుటలో, మరియు తన యొక్క జీవరాశులన్నిటికి జీవమును మరియు శ్వాసను ఇచ్చుటలోని పనిని దేవుడు ఎన్నడూ నిలిపివేయలేదు (కీర్తనలు 104:1–35; 139:13–16). తన ప్రజల ప్రార్థనలకు జవాబులు ఇచ్చుటకు, వారి శరీరములను స్వస్థపరచుటకు, మరియు వారి జీవితములను ఆశీర్వదించుటకు ఆయన విశ్రాంతి దినమున కూడా పనిచేసేవాడు. విశ్రాంతి దినమున ఒక మనుష్యుని స్వస్థపరచుట వలన యేసు గద్దింపబడినప్పుడు, "నా తండ్రి యిదివరకు పనిచేయుచున్నాడు, మరియు నేనును చేయుచున్నాను" అని ఉత్తరమిచ్చెను (యోహాను 5:17; 7:21–24; 9:4, 14; 17:4 చూడండి).

సినాయి పర్వతము యొద్ద పది ఆజ్ఞలు ఇయ్యబడినప్పుడు, విశ్రాంతిదినమును ఆచరింపవలసిన హేతువు ఏమనగా దేవుని యొక్క "విశ్రాంతిని" అనుకరింపవలెను. ఆయన సృష్టి యొక్క ముగింపులో చేసిన విధముగా ఇశ్రాయేలీయులు తమ పనిని నిలిపివేయవలసి యున్నది (నిర్గమ. 20:8–11).

విశ్రాంతిదినము ఇశ్రాయేలీయులకు పూర్తిగా కార్యకలాపాలను విరమించుకున్న దినము కాదు. వారములోని ప్రతీ రోజు యొక్క దినచర్యల నుండి విడిపింపబడే దినము: మట్టిని త్రవ్వుట, వారి పంటలను నాటుట; విత్తనములను, పండ్లను మరియు కూరగాయలను సాగుచేయుట; వారి జీవితములు కొనసాగుటకు అత్యవసరమైన వాణిజ్యపనియైన కొనుగోలు మరియు అమ్మకాలు జరిపించుట. వారియొక్క దాసులను మరియు జంతువులను విశ్రాంతి దినములో పాలుపంచుకొనుటకు అనుమతించుట ద్వారా వారితో మానవత్వముతో వ్యవహరించాలి (నిర్గమ. 20:8–11; 23:12; 34:21 చూడండి). విశ్రాంతి దిన సూత్రములను దుర్వినియోగం చెయ్యడం అనునది దైవజనులచే కఠినముగా గద్దింపబడినది (నిర్గమ. 31:15; నెహెమ్యా 13:15–22; ఆమోసు 8:5).

అనుదిన కార్యకలాపాల నుండి విరమణ యొక్క ప్రతికూల పద్ధతికి విరుద్ధముగా (చేయకూడని కార్యకలాపాలు), విశ్రాంతిదినము అనునది

ఉత్సవము, ఆరాధన, మరియు ఇశ్రాయేలీయులకు విమోచకుడును అన్నిటికిని సృష్టికర్తయైన దేవుని స్తుతి స్తోత్రము చెల్లించు దినము. క్రొత్త తరమైన ఇశ్రాయేలీయులకు మోషే చెప్పినది, అరణ్య ప్రయాణము యొక్క చివరి కాల సమీపములో, "నీవు ఐగుప్తు దేశమందు దాసుడవైయున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహుబలము చేతను చాచిన చేతిచేతను నిన్ను అక్కడనుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతిదినము ఆచరింపవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను" (ద్వితీ. 5:15).

వారముల విశ్రాంతి దినముతో పాటు, ఇశ్రాయేలులోని గొప్ప పండుగ రోజులన్నీ ఒక్క సాధారణమైన పని కూడా జరుగని ప్రత్యేక విశ్రాంతిదినములు (లేవీ. 23:5–8, 15–21, 34–39; సంఖ్యా. 28:25, 26; 29:1, 12, 35). దీనికి బదులుగా, పర్ణశాలల పండుగలప్పుడు, ఇశ్రాయేలీయులు ఉత్సవము, స్తుతి మరియు గుడారము (తరువాత దేవాలయము) వద్ద కుటుంబముగా భోజనమును పంచుకొనుట అను సహవాసముతో కూడుకొనియున్న ఆరాధన (ఆరాధనా కార్యక్రమము) "పనిలో" నిమగ్నమవ్వాలి[60]. ఈ పండుగ ఇశ్రాయేలీయులకు తనవారైన "దాసుడు మరియు దాసిని," లేవీయులు మరియు పరదేశులను (גֵּר, *ger* నుండి, అన్యజనులైన పరదేశులను సూచిస్తుంది) మరియు తల్లిదండ్రులు లేనివారు మరియు విధవరాండ్రును దేవుని బహిరంగ ఆరాధనలో పాలుపంచుకొనుటకు ఒక సందర్భాన్ని అందించింది (ద్వితీ. 16:13–15). ఆహారము తక్కువ కలిగియున్న వారితో తమ విందు భోజనమును పంచుకొనుట ద్వారా, క్లిష్ట పరిస్థితిలో ఉన్నవారిపై దేవుని ప్రజలు తమ సానుభూతిని కనుపరచగలరు. ఇశ్రాయేలీయులు కనాను దేశములో ప్రవేశించినప్పుడు అనుభవించిన అవే సూచనలు ప్రథమ ఫలముల పండుగను ("వారాలు" లేదా "పెంతెకొస్తు" పండుగ) గూర్చి ఇయ్యబడినది.

క్రైస్తవులకు, విశ్రాంతిదినము అనునది వారములోని ఏడవ రోజు (శనివారము) కాదు వారములోని మొదటి రొజు (ఆదివారం) కాదు, అయితే ఆదివారము క్రైస్తవ ఆరాధనలో క్రీస్తు పునరుత్థాన దినముగా ప్రత్యేక ప్రాముఖ్యత గాంచినది. దేవుని ప్రజలు నిత్యత్వము కొరకు ప్రభువునందు విశ్వాసమును అంతమువరకు చేపట్టుకొనుట ద్వారా మరియు క్రైస్తవ యుగములో విశ్రాంతిని అనుభవించవచ్చు (హెబ్రీ. 3:14). "విశ్రాంతి" అను అంశమును గూర్చిన ఈ భావాన్ని హెబ్రీయులకు రాసిన పత్రిక యొక్క రచయిత వక్కాణించెను (మనశ్శాంతి, ఆధ్యాత్మిక శ్రేయస్సు సంబంధిత ఆలోచన, రక్షణ యందలి విశ్వాసము). యేసుక్రీస్తు ఈ శాంతిని అనుగ్రహించెను, కానీ "జీవముగల దేవుని విడిచిపోవునట్టి విశ్వాసములేని దుష్ట హృదయమును" అభివృద్ధి పరచుట ద్వారా ఆయన ప్రజలలో కొంతమంది దీనిని వదులుకొనే ప్రమాదములో ఉన్నారు (హెబ్రీ. 3:12). పాఠకులైన హెబ్రీ క్రైస్తవులకు మరియు అవిధేయత మరియు అవిశ్వాసము

ద్వారా అరణ్యములో దేవుని "విశ్రాంతి"ని అనుభవించుటలో విఫలీకృతులైన పురాతన ఇశ్రాయేలియుల మధ్య ఒక పోలికను రచయిత చిత్రీకరిస్తున్నాడు (హెబ్రీ. 3:18, 19). తరువాత అతడు తన చదువరులను "విశ్వాసముంచిన వారు విశ్రాంతి" లోనికి ప్రవేశిస్తారు ['ప్రవేశిస్తున్నారు'] (హెబ్రీ. 4:3) అని చెప్పి పురికొల్పెను. చివరిగా, "కాబట్టి దేవుని ప్రజలకు విశ్రాంతి నిలిచియున్నది" అని చెప్పుట ద్వారా ఆయన వారికి భరోసా ఇచ్చెను (హెబ్రీ. 4:9).

హెబ్రీ లేఖనము "ఇప్పటికే" మరియు "ఇంకా ఆరంభము కాని" క్రైస్తవ జీవితమును చూపిస్తుంది. దేవుని ప్రజలుగా, మనము రాబోవు కాలపు (సబ్బాతు విశ్రాంతి) ఆశీర్వాదములను ఈ జీవితములో అనుభవించుట మొదలుపెడతాము (హెబ్రీ. 6:4, 5) –కాని మనము పరలోకము చేరే వరకు వాటిని పూర్తిగా అనుభవించలేము. అదేవిధముగా, క్రైస్తవులు ఇప్పుడు నిత్యజీవము పొందుకోగలరు (యోహాను 3:36; 5:24; 6:47, 54) కాని కేవలము అంతిమ తీర్పు తరువాత మాత్రమే దానిని పూర్తిగా అనుభవించగలరు (మత్తయి 25:46). ఇప్పుడు మనము నిత్యరాజ్య పౌరులము ( కొలస్సీ 1:12, 13), కాని క్రీస్తు రెండవ రాకడ సమయములో మాత్రమే సమస్తమైన ఐశ్వర్యము మరియు ఆనందకరమైన ఆ నిత్య రాజ్యములోనికి ప్రవేశించెదము (మత్తయి 25:31, 34).

యేసు యొక్క గొప్ప ఆహ్వానాన్ని ఎప్పుడైతే ఒకడు అంగీకరిస్తాడో అప్పుడు ఈ విశ్రాంతి ప్రారంభమవుతుంది. యేసు యిలా చెప్పెను,

> ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నాయొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను దీనమనస్సు గలవాడను గనుక మీమీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును. ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగానూ ఉన్నవి (మత్తయి 11:28–30).

నియమాలతో, నిబంధనలతో భార ప్రయాసములతో మరియు శతాబ్దాలుగా బోధకులు, గురువుల ద్వారా విధించబడిన సాంప్రదాయాలతో అలసియున్నయూదులతోప్రభువుమాటలాడుచుండెను (మత్తయి 9:9–13; 12:1–8; 15:1–20; 23:1–12, 23, 24; యోహాను 7:49).

క్రైస్తవుల విశ్రాంతి దినము ఇశ్రాయేలీయుల కంటే వ్యత్యాసమైనది. అది వారములో పాటించే ఒక సెలవురోజు లేదా ప్రతీ సంవత్సరము ఒక ప్రత్యేక సమయము కాదు. "విశ్రాంతిదినము ఆచరించుట"కు ప్రతిరోజు ప్రభువును కీర్తిస్తూ మన శరీరములను "పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా" సమర్పించుట, ఇది మనకు "ఆత్మీయ ఆరాధన" (రోమా 12:1).

## జీవ వృక్షము మరియు జీవజలము (2:9, 10)

జీవ వృక్షము మరియు జీవజలము బైబిలులో ఎలా చిత్రించబడ్డాయి? ఈ ప్రశ్నకు జవాబిచ్చుటకు, మొదట పాతనిబంధనలో వాడబడిన రూప చిత్రాలను చూద్దాం.

ఏదెను వనములో (2:9, 10). సజీవుడును సృష్టికర్తయైన దేవుడు, ఏదెను తోటలో ఆదాము యొక్క శ్రేయస్సు కొరకు అన్నిటిని సమకూర్చెను:

> మరియు దేవుడైన యెహోవా చూపునకు రమ్యమైనదియు ఆహారమునకు మంచిదియునైన ప్రతి వృక్షమును, ఆ తోటమధ్యను జీవవృక్షమును, మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షమును నేలనుండి మొలిపించెను. మరియు ఆ తోటను తడుపుటకు ఏదెనులోనుండి ఒక నది బయలుదేరి అక్కడనుండి చీలిపోయి నాలుగు శాఖలాయెను (2:9, 10).

మొదటి స్త్రీపురుషులు వారి పోషణ కొరకు వారి ఆశ్రయ వాతావరణములోని మొక్కలు మరియు చెట్ల పండ్లుపై ఆధారపడేవారు. క్రమముగా, మొక్కలు మరియు చెట్లన్నీ సంరక్షించబడి మరియు ఫలవంతముగా ఉండేవి ఎందుకనగా జీవమునిచ్చే నది భూతల పరదైసు నుండి ప్రవహిస్తుంది. తోటలోని యితర చెట్లవలె జీవవృక్షము వాస్తవమైన చెట్టు, మరియు నీరు నాలుగు నదులుగా విభజించబడిన వాస్తవమైన నదిలోనివి అయినప్పటికిని, ఇవన్నీ తనయొక్క జీవరాశుల భౌతిక జీవితం కొనసాగడానికి అన్ని జీవముల యొక్క నిజ మూలమైన దేవుడు బహుమానముగా అనుగ్రహించెను.

ఆదాము మరియు హవ్వ పాపముచేసి తోటలోనుండి బయటకు వెళ్ళగొట్టబడినప్పుడు, మానవజాతి జీవవృక్షముతో సహా ఆ భూతల పరదైసును కోల్పోయినది. స్త్రీ సంతానము ఒకరోజు సర్పము యొక్క తలను కొట్టును అను అస్పష్ట ప్రవచనము తప్ప ఏదెను తోటలో ఏమియు మిగులలేదు (3:15). కాలము గడుస్తూ ఉండగా, దేవుడు ఎవనికైతే కనాను దేశమును శాశ్వత స్వాస్థ్యముగా ఇచ్చెదనని వాగ్దానము చేసెనో ఆ అబ్రహామునకు మరియు తన సంతానమునకు శారా (12:1–3; 17:15–19) ద్వారా ఆ వాగ్దానము పరిమితిచేయబడినది.

*అబ్రహాము నుండి దావీదు వరకు–వాగ్దాన భూమిలో.* అబ్రహాము మరియు లోతు కనాను దేశమునకు వచ్చినప్పటి చారిత్రక కథనములో అసలైన ఏదెను పరదైసు యొక్క తొలి సూచన కనిపిస్తుంది. వారు సంపన్నులు, ఎందుకనగా వారు అనేక గొర్రెలను మరియు పశువులను కలిగియున్నారు; కాని వారి పశువుల కాపరుల మధ్య జంతువులకు తగినంత నీరు మరియు పచ్చిక కొరకు కలహములు తలెత్తినవి. వారిరువురు మంచిగా కొనసాగాలంటే వారు ఆ వాగ్దాన భూమిలో వేరు వేరు మార్గాలలో వెళ్ళవలసి ఉంటుందని స్పష్టమైనది. అబ్రహాము

తన సహోదరుని కుమారుడైన లోతుతో తాను మరియు తన పరివారము నివసించుటకు భూభాగాన్ని ఎంచుకొనుటకు అనుమతించుటలో అబ్రహాము ఉదారమైన అవకాశము ఇచ్చెను. వ్రాసిపెట్టిన సమాచారము ప్రకారము, దేశము యొక్క పర్వత ప్రాంతము నుండి, "లోతు తన కన్నులెత్తి యొర్దాను ప్రాంతమంతటినీ చూచెను ... అదంతయు యెహోవా తోటవలెను ఐగుప్తు దేశమువలెను నీళ్లు పారు దేశమైయుండెను. కాబట్టి లోతు తనకు యొర్దాను ప్రాంతమంతటిని ఏర్పరచుకొని తూర్పుగా ప్రయాణముచేసెను" (13:10, 11).

జీవవృక్షము లేదా జీవనది దానినుండి ప్రవహిస్తుందని లేఖనము ప్రత్యేకముగా పేర్కొనలేదు, కాని యొర్దాను లోయ అసలైన ఏదెను పరదైసు "వలె" ఉన్నదని లోతు యొక్క అలంకారము సూచిస్తుంది. ఇది, క్రమంగా, యొర్దాను నది నుండి లేదా దానికి ఆనుకుని ఉన్న ఊటలనుండి కావలసిన నీటిని తీసుకొంటూ సమృద్ధిగా ఫలమునిచ్చు వృక్షములు (మరియు ఇతర వృక్షములు) అక్కడ పెరుగునని ఇది సూచిస్తుంది. ఏదేమైనా, ఇటువంటి ఒక అంచనా లోతునకు మరియు అతని కుటుంబమునకు మోసపూరితమైన విషాదముగా నిరూపించబడినది; ఆ ప్రాంతములో పాటించే దుష్టత్వము చాలా నీచమైనది అది చివరకు నాశనకరమైన దేవుని తీర్పును అక్కడ నివసించుచున్నవారిపైకి తీసుకొని వచ్చినది (13:13; 19:1–29).

అబ్రహాము మరియు లోతునకు అనేక తరములు తరువాత, మోషే వాగ్దాన భూమిని లోయలలో సమృద్ధిగా ప్రవహించే నీటిని కలిగి అనేకరకములైన ఫల వృక్షములతో ఉన్న "మంచి భూమి" గా వర్ణించెను. ప్రజలు "కొరత లేకుండా" మరియు "లేమి లేకుండా" తినేందుకు అనేక ఇతర పంటలను మరియు తినగలిగే ఆహారమును అచ్చట కనబడునని ఆయన తెలియజేసెను (ద్వితీ. 8:7–9; సంఖ్యా. 13:25–27 చూడండి). మోషే కనానును నీరు మరియు జీవవృక్షములతో ఉన్న, వాస్తవికమైన ఏదెను తోటవలె సూచించెను.

అయితే, ఆ సమయము నుండి అబ్రహాము యొక్క వాగ్దత్త సంతానము మరియు భూమి యొక్క చరిత్ర విషాదముతో నిండియున్నది. పితరులు నివసించిన వందల సంవత్సరముల తరువాత, తన సంతానమైన – ఇశ్రాయేలీయులు – చివరిగా యెహోషువా ఆధ్వర్యములో కనాను దేశములోనికి ప్రవేశించిరి. అయితే, వారికి తమ శత్రువులపై అనేక విజయములు కలిగినప్పటికీ, తమ అలవాటు ప్రకారము విగ్రహారాధనలో పడి యెహోషువా మరణము తరువాత వారు దేవునికి అవిధేయులైరి; కాబట్టి వారి యొక్క శాంతి మరియు అభివృద్ధి చాలా అరుదుగా ఉండేది (న్యాయాధి. 2:1–23). న్యాయాధిపతుల కాలములో, ఆ దేశము తరచుగా సైన్యాలు దండెత్తడం ద్వారా ఆక్రమించబడినది; మరియు వారి గోత్రముల మధ్య అసూయల వలన కొన్ని సార్లు ఇశ్రాయేలీయులలో ఒకరినొకరు చంపుకొనుట ద్వారా అక్కడ అంతర్యుద్ధానికి దారితీసింది.

సౌలు యొక్క పాలన మరియు దావీదు పాలన అంతటిలో తమ శత్రువులందరినీ అణచివేసే వరకూ సాధారణ అశాంతి మరియు యుద్ధములు ఆ భూమిని పాడు చేయుట కొనసాగుతూనే ఉంది. తరువాత, దావీదు యొక్క పతన సంవత్సరములలో ఒక విషాద అంతర్యుద్ధమును పురిగొలుపుట ద్వారా తన సింహాసనమును తండ్రియొద్ద నుండి తీసుకొనుటకు తన కుమారుడైన అబ్షాలోము కోరిక ఫలించలేదు (2 సమూ. 15:13; 18:6, 7 చూడండి). అయితే మిగిలిన దావీదు సైన్యము ఆరువందలమంది నమ్మకమైన ఫిలిష్తీయులైన దేహసంరక్షకుల సహాయముతో ఈ తిరుగుబాటును అణచివేసి తన సామ్రాజ్యమును రక్షించుకొనెను, భయంకరమైన మూల్యము వలన విజయము వచ్చినది: తన కుమారుడైన అబ్షాలోము మరియు అనేకమంది ఇశ్రాయేలియుల ప్రాణ నష్టం జరిగింది.

*సొలొమోను మరియు "జీవవృక్షము."* సొలొమోను సింహాసనము అధిరోహించే సమయానికి, ఇశ్రాయేలీయులు యుద్ధాలతో అలసిపోయి యుద్ధములను ఆశించే మనిషి కాని రాజు ద్వారా శాంతిని మరియు సమృద్ధిని వారికియ్యమని దేవుని కొరకు కనిపెట్టుకొనియుండిరి.[61] ఐశ్వర్యము మరియు దీర్ఘాయువును కాక "బుద్ధి మరియు వివేకము గల హృదయమును" గూర్చి మంచిగా ప్రారంభించెను. ఈ మనవిని అంగీకరించి, దేవుడు సొలొమోనును బుద్ధి మరియు వివేకము గల హృదయమును వాటితోపాటు ఐశ్వర్యము మరియు దీర్ఘాయువుతో ఆశీర్వదించెను (1 రాజులు 3:11–14).

స్పష్టముగా, సొలొమోను జీవిత ప్రారంభ కాలములో, సామెతలలో ఆయనకు ఆపాదించబడిన అనేక జ్ఞానోక్తులను ఆయన రచించెను(సామెతలు 1:1; 10:1; 25:1). ఏదెను ఉహాచిత్రముపై గీసిన శాంతి, ఆనందము, భద్రత మరియు ప్రజలకు కావాల్సిన దీర్ఘాయువు వలె వివరణ ఇచ్చే జీవవృక్షము మరియు జీవజలము యొక్క భాషను ఆయన ఉపయోగించెను.

దీనికి ఒక ఉదాహరణ "జ్ఞానమును సంపాదించువాడు" మరియు "వివేకము కలిగిన నరుని" పైనుండు ఆశీర్వాదము (సామెతలు 3:13). సొలొమోను వివేకమును స్త్రీగా వ్యక్తీకరిస్తున్నాడు,"దాని నవలంబించువారికి అది జీవవృక్షము, దాని పట్టుకొనువారందరు ధన్యులు" అని చెప్పెను (సామెతలు 3:18). స్పష్టముగా, సొలొమోను వలె జ్ఞానమును సంపాదించుకొన్న ప్రతీయొక్కరు దీర్ఘాయువును లేదా ఐశ్వర్యమును మరియు గౌరవమును పొందుకొందురు అని కాదు. ఇలాంటి మాటలు సంపూర్ణమైన వాగ్దానాలు కావు ఎందుకనగా కొన్నిసార్లు మంచి ప్రజలకు చెడు కార్యాలు సంభవించవచ్చు (యోబు 1:1–2:10 చూడుడి), దీనికి విరుద్ధముగా, దేవుని నమ్మేవారికీ మరియు ఆయన ఇష్టాన్ని సాధారణముగా అనుభవించాలి అని అనుకొనేవారికే ఈ దీవెనలు.

ఇతర వాక్యభాగాలు ఈ రూపకమును ఉపయోగించెను. "కోరిక సఫలము

కాకుండుటచేత హృదయము నొచ్చును, సిద్ధించిన మనోవాంఛ జీవ వృక్షము జ్ఞానుల ఉపదేశము జీవపు ఊట, అది మరణపాశముల నుండి విడిపించును" (సామెతలు 13:12, 14) సామెతలు 15:4లో ఇదే విధమైన వ్యక్తీకరణ కనబడుతుంది, "సాత్వికమైన నాలుక జీవ వృక్షము, దానిలో కుటిలత యుండినయెడల ఆత్మకు భంగము కలుగును." "జ్ఞానుల" బోధన ఫలించు "జీవ వృక్షము" వంటిది మరియు ఒక తాజాదనము కలిగించే "జీవపు ఊట" పొంగి పొరలును, ఆ దప్పిగొన్న భూమిలో పాపము మరియు దుష్టత్వముతో ఎండిపోయిన ఆత్మలకు జీవము, ఆరోగ్యము, మరియు తజాదనమునిచ్చును. జ్ఞానుల యొక్క వాగ్దాన దీవెనలు చట్టపరమైన కోరికలు. వారి ఆత్మలకు తాజాదనము కలిగించుటకు మరియు దేవున్ని నిజముగా గౌరవించే న్యాయ జీవితాలు జీవించుటకు వాటిని పునరుజ్జీవింపజేయుటకు దేవుడు నీతిమంతుల మీద కుమ్మరించే "జీవవృక్షము" మరియు "జీవపు ఊటను" అవి పోలియున్నవి (యెష. 40:31 చూడండి).

సొలొమోను జీవితములో గొప్ప విషాదమేమిటంటే ప్రపంచములోనే తెలివైనవాడు గొప్ప అవివేకిగా మారెను. అతను స్వీయ ఘనత కొరకు కోటలు, అన్య దేవాలయములు, తన కొరకు, మరియు తన వందలమంది భార్యలు, ఉపపత్నుల కొరకు పుణ్యక్షేత్రాలు నిర్మించుట ద్వారా దేవుడిచ్చిన సంపదను పాడు చేసెను. ఒక నీతివంతమైన దైవ భక్తి గల జీవితము జీవించుటకు బదులుగా అతని జ్ఞానమును దుర్వినియోగపరిచి మరియు ఇతర దేవతలను పూజించెను (1 రాజులు 11:1–8). "వెర్రితనము మరియు మతిహీనత తెలుసుకొనుటకు" ఆయన తనకుతానే ప్రయత్నించెను (ప్రసంగి 1:17). "నా కన్నులు ఆశించిన వాటిలో దేనిని అవి చూడకుండా నేను అభ్యంతరము చేయలేదు. ఏ విధమైన సంతోషమును అనుభవించకుండా నా హృదయమును నిర్బంధింపలేదు" అని ఆయన ఒప్పుకొనెను (ప్రసంగి 2:10). ఈ జీవన శైలి అతను ఎదురుచూచిన శ్రేయస్సు మరియు సంతృప్తికి వ్యతిరేకముగా శోకమును, విసుగుదలను, మరియు అశాంతిని మాత్రమే ఆయనకు తెచ్చిపెట్టినది. "అప్పుడు నేను చేసిన పనులన్నియు "వాటికొరకై నేను పడిన ప్రయాసమంతయు నేను నిదానించి విచేచింపగా అవన్నియు వ్యర్థమైనవిగాను. ఒకడు లికి, ప్రయాస, పడినట్టుగాను, అగుపడెను "సూర్యుని క్రింద లాభకరమైనదేదియు లేనట్టు నాకు కనబడెను" అని చెప్తూ సంపద, శక్తి మరియు ఆనందముల కొరకైన తన ప్రయాసను సంగ్రహముగా చెప్పెను (ప్రసంగి 2:11).[62]

*హిజ్కియా–శత్రువును ప్రశాంతమైన హామీతో ఎదుర్కొనుట.* అనేక తరములు గడచి పోయిన తరువాత, రాజైన హిజ్కియా కాలములో (701 క్రీ.పూ.) ఒక విదేశీ సైన్యము యెరూషలేమును నాశనముతో భయపెట్టి, యూదాను ముట్టడించెను. అష్షూరు రాజైన సన్హేరిబు, యూదా యొక్క నలభై ఆరు పట్టణములను

నశింపజేస్తూ మరియు యూదా రాజును "పంజరములోని పక్షి వలె" రాజధానిలో నిర్బంధించి తన భారీ సైన్యమును ఆ ప్రాంతములోనికి తీసుకొనివచ్చెను.[63] సన్హెరీబు అప్పుడు యెరూషలేములోని హిజ్కియాకు ఉత్తరమును పంపెను, దానిలో దేవున్ని హేళనచేసి రాజధాని యొక్క తక్షణ లొంగుబాటును కోరెను.

యూదా రాజు, నిరాశలో, ఆ ఉత్తరమును దేవుని ముందు పరచి దావీదు సింహాసనము కొరకు మరియు రాజధాని యొక్క దైవిక విమోచన కొరకు ప్రార్థించెను. దేవుని జవాబు త్వరితమైనది: "నా నిమిత్తము నా సేవకుడైన దావీదు నిమిత్తమును ఈ పట్టణమును కాపాడి రక్షించుదును." ఆ రాత్రి, "అంతట యెహోవా దూత బయలుదేరి అష్షూరువారి దండు పేటలో లక్ష యెనుబదియైదువేలమందిని మొత్తెను, ఉదయమున జనులు లేవగా వారందరును మృతకళేబర ములుగా ఉండిరి." సన్హెరీబు, తన రాజధానియైన నీనెవెకు, అవమానముతో తిరిగి వచ్చెను (యెష. 37:35–37). ఆయన మరియొక ఇరువది సంవత్సరములు జీవించినప్పటికిని, మనకు తెలిసినంతవరకు, మరలా యూదాకు వ్యతిరేకముగా తన సైన్యమును తీసుకొనిరాలేదు.

కీర్తనలు 46కు ఒకవేళ ఇది చారిత్రక నేపథ్యము అయియుండవచ్చు. అలాగైతే, దేవుడు తన ప్రజలకు నిజమైన "ఆశ్రయము" మరియు "బలమైన దుర్గము [కోట]" అని శక్తివంతమైన అలంకారిక భాషలో రచయిత ఎందుకు చెప్పెనో మనము అర్థముచేసికొనవచ్చు(కీర్తనలు 46:1, 7, 11). ఆయనే "భూదిగంతముల వరకు యుద్ధములు మాన్పువాడు," శత్రువుల విల్లు విరుచువాడు మరియు బల్లెము తెగనరుకువాడు, మరియు యుద్ధ రథములను అగ్నిలో కాల్చివేయువాడు (కీర్తనలు 46:9). కీర్తన మధ్యభాగంలో, సమస్తం నిరీక్షణలేని స్థితిలో కనిపించినప్పుడు, అకస్మాత్తుగా మలుపు తిరిగే సన్నివేశాలు వివరించుటకు రచయిత తోట యొక్క ఊహాచిత్రమును ఉపయోగించెను. "ఒక నది కలదు, దాని కాలువలు దేవుని పట్టణమును సర్వోన్నతుని మందిరపు పరిశుద్ధ స్థలమును సంతోషపరచుచున్నవి, దేవుడు ఆ పట్టణములో నున్నాడు, దానికి చలనము లేదు" (కీర్తనలు 46:4, 5).

వాస్తవానికి, ఏ నదీ యెరూషలేములో ప్రవహించలేదు. ఎందుకంటే, పట్టణము ఇశ్రాయేలు దేశప్రాంతపు పర్వతముల కేంద్రభాగమైన కొండమీద నిర్మించబడెను. నిజముగా, పాత నిబంధన దినములలో, పట్టణములో మంచి నీటికి ఒకే ఒక మూలము ఉన్నది: గీహోను నది, ఇది పట్టణము వెలుపల కిద్రోను లోయలోని ఓపెలు పర్వతమును ఆనుకొని యున్నది. అష్షూరీయులు యూదాను ముట్టడివేస్తారని ఎదురుచూసిన హిజ్కియా, ఈ చిన్న నదిలోనుండి పట్టణములోని పడమట వైపున ఉన్న సిలోయము అను కోనేటిలోనికి నీరు ప్రవహించునట్లు ఓపెలు నది క్రింద సొరంగమును తన నిపుణులచేత తవ్వించెను (2 రాజులు

20:20; 2 దిన. 32:30).

ఈ ఊట, యెరూషలేములోనికి జీవజలమును తెచ్చినది, దేవుడు మరలా అంతటిని ఫలవంతము చేసే "నది"ని అనుగ్రహించెను అని చెప్పుటలో కీర్తనాకారుని యొక్క ఆవేశము ఇదియైయుండవచ్చు. మానవులందరి ఆశ పోయినప్పుడు, సన్హెరీబు సైన్యమును నశింపజేసిన, అతడొక్కడే, స్వస్థతను మరియు రక్షణ యొక్క జీవమునిచ్చు జలమును మరియు యెరూషలేములో అష్షూరుల ముట్టడికి గురైన వారికి నిరీక్షణను తెచ్చెను.[64]

*యిర్మీయా–దేవుని నుండి "జీవ జలములు".* సుమారు వంద సంవత్సరముల తరువాత, జీవజలముల గుర్తులను ఉపయోగిస్తూ దుష్టత్వము మరియు విగ్రహారాధనకు వ్యతిరేకముగా ప్రవక్తలు ఏడ్చిరి. ఉదాహరణకు, యిర్మీయా, యెహోవా కొరకు ఈ మాటలను మాట్లాడుతూ దేశమును సూచించెను: "నా జనులు రెండు నేరములు చేసియున్నారు: జీవజలముల ఊటనైన, నన్ను విడిచియున్నారు, తమకొరకు తొట్లను, అనగా బద్దలై నీళ్ళు నిలువని తొట్లను తొలిపించుకొనియున్నారు" (యిర్మీయా 2:13). ఈ ఊహాచిత్రము పదునైనది: ఒక అస్థిర భూగర్భ ప్రాంతములో, తమ కొరకు తోట్లను తొలిపించుటకు ఎలాంటి తార్కిక వ్యక్తి ప్రయత్నించడు, ఎందుకనగా నీటి నిల్వకు ఆ తొట్టెలు త్వరగా పగిలి మరియు ఉపయోగపడకుండా పోతాయి. ఆ ప్రాంతములోని నివాసులందరి కొరకు నీటిని ప్రవహింపజేయుచున్న దగ్గరలో ఉన్న నీటిబుగ్గను అతను ఉపయోగించినట్లయితే ఇది ముఖ్యముగా వర్తిస్తుంది అందరి భౌతిక మరియు ఆత్మీయ జీవితమునకు ఊట లేదా మూలము వలె యిర్మీయా దేవుని వైపు చూసెను. అబద్ధ దేవుళ్ళను ఆరాధించుటకు సత్య దేవుని నుండి వెనుదిరుగుట అర్థరహితమైనది, అది జీవమునకు బదులుగా మరణమును ఎన్నుకోవడం.

*యెహెజ్కేలు–పునరుద్ధరణ యొక్క నిరీక్షణ.* దాని ప్రతీకాత్మకతను ఏదెను తోటనుండి తీసుకొనే చివరి పాతనిబంధన లేఖనభాగం యెహెజ్కేలు 47:1–12లో కనబడుతుంది. యూదా బహిష్కృతులతో పాటు ప్రవక్త బబులోనులో ఉండెను, వారిలో చాలామంది ఎప్పటికైనా వాగ్దానభూమిలో చేరుకొంటాము అను నిరీక్షణను కోల్పోయిరి. వారు "ఎండిన ఎముకలు": ప్రాణములేని మరియు తెల్లబారిన లోయవలె ఉన్నారు (యెహెజ్కేలు 37:1–9). ఈ ఎముకలకు బోధించుమని యెహెజ్కేలుకు చెప్పబడెను (చెరపట్టబడ్డ ఇశ్రాయేలీయులు); మరియు తన బోధ మరియు దేవుని ఆత్మ ద్వారా ప్రజలు ఆత్మీయ పునరుత్థానము అనుభవించుదురు. వారు క్రొత్త నిరీక్షణ మరియు ఉద్దేశము కలిగియున్నారు. దేవుని సందేశము అనునది శేషించిన తన ప్రజలకు శుభ వర్తమానము ఎందుకనగా బబులోనులోనుండి వారిని బయటకు రప్పించి మరియు ఇశ్రాయేలు దేశమునకు తోడుకొని వచ్చెదనని ఆయన వాగ్దానము చేసెను (యెహెజ్కేలు

37:10–14).

అయితే, క్రొత్త సమస్య వచ్చినది. మాతృభూమి చాలావరకు నాశనమైనది. యెరూషలేము మరియు బలముగా నున్న పట్టణములు శిథిలావస్థలో ఉన్నాయి. తిరిగి వచ్చువారు మరలా అన్నిటినీ మొదలుపెట్టాలి, భూమిని చదును చేయాలి, దాన్ని దున్ని మొక్కలు నాటాలి, మరియు వారి భవనములు నిర్మించుకోవాలి. వారు తిరిగి వచ్చుటను వ్యతిరేకించిన అన్యజనుల మధ్య ప్రతికూల వాతావరణములో వారు ఎలా జీవిస్తారు? వారికొరకు మరలా ముందువలె పంటలు పండించుకొనుటకు మరియు వారి జంతువులకు గడ్డిని మొలిపించుటకు ఎంతకాలము పట్టును? ఇవి మరియు ఇతర ప్రశ్నలు ప్రజల మనస్సులో వచ్చియుండవచ్చు. అయితే, దేవుడు ప్రవక్తకు మరొక దర్శనమును ఇచ్చెను: యెరూషలేము నగరము యొక్క ఆదర్శపూర్వకమైన దృశ్యం, దేవాలయము, మరియు భూమి సింబాలిక్ భాషలో వర్ణించబడినది.

యెహెజ్కేలు 47 లోని ప్రతీకాత్మకత దేవుని మందిరములో నుండి నీరు బయటకు ప్రవహించుటతో సంబంధము కలిగియుంటుంది. మొదట, ఇది కేవలం ఒక చిన్న ధార, అప్పుడు కాలువ, మరియు ఆపై ఎవ్వరూ దాటలేని గొప్ప నది. అరాబా (మృత సముద్రమునకు నైరుతిలోనున్న అరణ్య ప్రాంతము) వైపునకు నీరు ప్రవహించుట ప్రవక్త చూచెను. అది సముద్రములోనికి ప్రవహించినప్పుడు నీరు మంచిగా మారి చేపలతో నింపబడినది. ఆ నది ప్రవహించిన చోట్లలో చెట్లు పెరిగాయి. దాని ఒడ్డున, ఆహారము కొరకు అన్నిరకముల చెట్లు పెరిగాయి. దీని గూర్చి, యెహెజ్కేలు, "వాటి ఆకులు వాడిపోవు వాటి కాయలు ఎప్పటికిని రాలవు. ఈ నదినీరు పరిశుద్ధ స్థలములోనుండి పారుచున్నది గనుక ఆ చెట్లు నెల నెలకు కాయలు కాయును, వాటి పండ్లు ఆహారమునకును, వాటి ఆకులు ఔషధమునకును వినియోగించును" అని చెప్పెను (యెహెజ్కేలు 47:12; ప్రకటన 22:1, 2 చూడండి).

ఇక్కడ ప్రతీకాత్మకత ఏదెను తోటనుండి తీసుకొనబడినది, మరియు జీవమునిచ్చు నది వాస్తవముగా కెరూబుల మీద ఆసీనుడైయున్న దేవుని ఆలయము,[65] నుండి ప్రవహించేదిగా వర్ణింపబడినది (2 సమూ. 6:2). ఎప్పుడూ ఆహారమునకు కొదువ లేకుండా అనుగ్రహించుటకు మరియు ప్రజలకు ఔషధమును ఇచ్చుటకు ఫలవంతమైన వృక్షములు[66] అక్కడ పెరుగుతున్నవి.

వాస్తవముగా, బబులోను చెరనుండి శేషించి తిరిగివచ్చినవారు, ఈ ఆదర్శపూర్వకమైన వాగ్దానము యొక్క పాక్షిక నేరవేర్పును మాత్రమే వారు అనుభవించారు. ఒప్పుకోలు మరియు ఆరాధన యొక్క కీర్తనలో, తిరిగివచ్చినవారు తమ బాధాకరమైన పరిస్థితిని "దాసులు" అని వర్ణించారు; మరియు అన్యమత రాజులు వారియొక్క పంటలను మరియు పశువులను దోచుకున్నారని వారు చెప్తున్నారు (నెహెమ్యా 9:36, 37). తమ విచారకరమైన

పరిస్థితికి జవాబు కనుగొనుట కొరకు వారు పోరాడిరి.

వారియొక్క పరిస్థితికి ముఖ్య కారణము దేవుని వాగ్దానము షరతులతో కూడుకొనియున్నదని యూదులు అర్థముచేసుకొని యుండవచ్చు. వారి పశ్చాత్తాపము, పాపపు ఒప్పుకోలు, మరియు మోషే ఒడంబడికకు విధేయత మీద దాని నెరవేర్పు ఆధారపడియుంటుంది.

ఈ అధ్యయనము యొక్క శేషములో, జీవ వృక్షమును మరియు జీవ జలములను గూర్చి క్రొత్త నిబంధనలో చిత్రీకరించబడియున్నట్టు గానే మనము చూద్దాము.

*జీవజలమునిచ్చే, యేసు క్రీస్తు.* యేసు బెత్లెహేములో జన్మించినప్పుడు, యూదా ప్రజలు ఇంకా తమ శత్రువులను ఓడించే, యూదాలో దుష్ట హేరోదును సింహాసనమునుండి తొలగించే, మరియు వారియొక్క భూమిలోనుండి అన్యమత రోమియులను వెళ్ళగొట్టె దావీదు వంశపువాడైన మెస్సీయ కొరకు ఎదురుచూస్తున్నారు. మెస్సీయను గూర్చిన ఇశ్రాయేలీయుల నిరీక్షణను జీవవృక్షము మరియు జీవజలములతో కూడిన పాలస్తీనలోని క్రొత్త ఏదెనువంటి పరదైసుకు సంబంధించి చెప్పబడిన కొన్ని ప్రవచనాలకు అన్వయించినట్లు కనిపిస్తుంది.[67] వారు ఆశించిన నిరీక్షణకు మరియు దేవుని రాజ్యమును గూర్చిన యేసు యొక్క దర్శనము మధ్య వ్యత్యాసమును బట్టి చాలామంది కలవరమునకు గురయ్యారు.

యేసు తన వ్యక్తిగత పరిచర్యను ఆరంభించినప్పుడు, "కాలము సంపూర్ణమైయున్నది, దేవుని రాజ్యము సమీపించియున్నది; మారుమనస్సు పొంది సువార్త నమ్ముడి," అని ఆయన ప్రకటించెను (మార్కు 1:15). అయితే, రాజ్య ప్రవేశమును గూర్చిన ఆయన వాక్కులు యూదా మత నాయకులకు భయానకముగా అనిపించినవి. బాప్తిస్మమిచ్చు యోహాను వలె (మత్తయి 3:1–12; మార్కు 1:1–5; లూకా 3:2–9; 7:29, 30), క్రొత్త ఆత్మీయ జననమును, అనగా మార్పును యేసు వారి యొద్దనుండి కోరెను. "ఒకడు నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపడు" అని ఆయన నీకొదేముతో ఉద్ఘాటించెను (యోహాను 3:5).

సెప్టెంబరులో లేదా అక్టోబర్లో యెరూషలేములో జరిగే పర్ణశాలల పండుగలో ("పర్ణశాలల పండుగ"; KJV) ఉన్నలాగున, యేసు తన వ్యక్తిగత గుర్తింపును గూర్చి చెప్పుకున్నవి మరింత ఆశ్చర్యకరమైనవి. ఆ సందర్భములో, ప్రధాన యాజకుడు సిలోయమను కోనేటి దగ్గర వరకు ఊరేగింపు జరిపించి, దానిలోని నీటిని తోడి దేవాలయమునకు తీసుకొని వెళ్ళుట అనునది యూదుల యొక్క ఆచారము. పట్టణము గుండా వారియొక్క మార్గమును చుట్టినప్పుడు, ఊరేగింపులో ఉన్నవారు "రక్షణాధారములైన బావులలోనుండి" (యెష. 12:3) ఆనందముతో నీళ్ళను చేదుకొనుటను గూర్చి మరియు "ఆనంద

ప్రవాహములోనిది" త్రాగుటను గూర్చి (కీర్తనలు 36:8) కీర్తనలు పాడిరి. "జీవపు ఊట"గా వారు దేవుని స్తుతించిరి (కీర్తనలు 36:9).

ప్రజలు వర్షముకొరకు ప్రార్థించిన మూలమున, శీతాకాల ధాన్యము నాటుటకు సాధ్యమైనది, ఐగుప్తు స్తుతిని కూడా వారు ఉచ్చరించారు (కీర్తనలు 113–118), దానిలో దేవుడు "బండను నీటి ఊటలుగా చేసిన" (కీర్తనలు 114:8) అరణ్య యాత్రను వారు జ్ఞప్తికి తెచ్చుకొనిరి. వారు చివరి దినములకు (ముగింపు సమయము) సంబంధించిన మెస్సీయ నీటి నదుల కొరకు కనిపెట్టిరి (యెహెజ్కేలు 47:1–9; జెకర్యా 13:1; 14:8, 16, 17) మరియు "యెహోవా, దయచేసి నన్ను రక్షించుము; యెహోవా, దయచేసి అభివృద్ధి కలిగించుము," అని వేడుకొనిరి (కీర్తనలు 118:25). వేడుక యొక్క మహా సమయములో, ఏడు సార్లు బలిపీఠం చుట్టూ తిరిగిన తరువాత, ప్రధాన యాజకుడు బలిపీఠం అడుగున నీటిని పోసెను.[68] ఈ సమయంలో యేసు లేచి నిలువబడి ఒక ఆశ్చర్యమైన ప్రకటన చేసినట్లు మనకు కనబడుతుంది:

> "ఆ పండుగలో మహాదినమైన అంత్యదినమున యేసు నిలిచి – ఎవడైనను దప్పిగొనిన యెడల నా యొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను. నా యందు విశ్వాసముంచు వాడెవడో లేఖనము చెప్పినట్టు 'వాని కడుపులోనుండి జీవజల నదులు పారునని బిగ్గరగా చెప్పెను.'" తనయందు విశ్వాసముంచువారు పొందబోవు ఆత్మనుగూర్చి ఆయన ఈ మాట చెప్పెను; యేసు ఇంకను మహిమపరచబడలేదు గనుక, ఆత్మ ఇంకను అనుగ్రహింపబడియుండలేదు (యోహాను 7:37–39).

యోహాను సువార్తలో యేసు గొప్పగా చెప్పుకున్నవాటిలో ఇది ఒకటి. "జీవజలములు" అనుగ్రహించుటకు "అభివృద్ధి" పంపుటకు, మరియు వారిని "రక్షించు" లాగున ప్రజలు దేవునికి పాడుతూ ప్రార్థిస్తూ ఉండిరి. అలాంటి జలములకు, ఆశీర్వాదములకు, మరియు రక్షణకు తానే మూలమని రూఢిగా చెప్తూ, యేసు దేవుని కుమారుడని, దేవుడని పేర్కొనెను. పాత నిబంధనలో దేవుడు మాత్రమే "జీవజలముల ఊట"గా (యిర్మీయా 2:13), సృష్టించగలవానిగా, ఆత్మను యివ్వగలవానిగా, జీవమిచ్చేవానిగా, ఆశీర్వదించేవానిగా, మరియు తన ప్రజలను రక్షించేవానిగా వర్ణించబడెను. తాను కూడా ఈ దైవికమైన విశేషాధికారము కలిగియున్నాడని యేసు చెప్పెను. యేసుని విశ్వసించుట (నమ్ముట) విధేయత చూపుట అనునది నిత్యజీవమును అనుభవించుట అనునదియే (యోహాను 3:36; 5:39, 40; 11:25–27; 14:6; 17:3).

*క్రైస్తవులు మరియు వారి జీవమునిచ్చు సందేశము.* రాబోయే సత్యాలు – యేసు ప్రాయశ్చిత్తార్థమైన మరణము, ఆయన పునరుత్థానము, మరియు దేవుని యొక్క కుడిపార్శ్వమునకు ఆరోహణముతో సహా – అపొస్తలులు ముందుకు వెళ్లి

ప్రకటించిన సువార్త (శుభవార్త) కలిగియున్నది. క్రొత్త ఆత్మీయ సందేశమును, క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరమైన సంఘమును, ఉనికిలోనికి తెచ్చిన ఈ సందేశము చాల శక్తికలిగినది. మారుమనస్సు మరియు బాప్తిస్మము ద్వారా యేసును ప్రభువుగా మరియు రక్షకునిగా అంగీకరించిన వారిని కలిగియున్నది. క్రొత్తగా సంఘమునకు చేర్చబడినవారు పాప క్షమాపణ మరియు పరిశుద్ధాత్మను పొందిరి (అపొ. 2:16–42).

క్రొత్తగా జన్మించి మరియు బాల్యదశలోని సంఘమునకు చేర్చబడుతున్న వేలమంది యూదులతో క్రైస్తవ మతము పుట్టిన వెంటనే యెరూషలేములో వ్యతిరేకతలు మరియు హింసలు ప్రారంభమైయ్యాయి (అపొ. 4:1–8:3). యేసే క్రీస్తు (మెస్సీయ) అని క్రైస్తవులు చెప్పుకున్నందులకు ఎదురైన ఈ హింసాత్మక చర్య వారు సువార్తను ప్రకటించుచు ప్రతీచోటకు వెళ్ళుచుండగా ఈ ఆరంభ క్రైస్తవులను ప్లేగువ్యాధిలా పట్టి పీడించినది (అపొ. 8:4). క్రీ.శ. 64లో రోము కాలిపోవుట (నీరో క్రైస్తవుల మీద మోపిన నింద) వరకు రోమీయుల హింస అధికారకముగా ఆరంభమవ్వలేదు; కానీ మొదటి శతాబ్దములోని చివరి భాగములో డొమిషియన్ క్రింద అది మరింత విస్తృతము మరియు తీవ్రమైనదిగా మారినది. కనుక, సంఘము మనుగడ కొరకు పోరాటములో పాలుపంచుకొంది, ఇది తరచుగా విశ్వాసము విడిచిపెట్టని మరియు చక్రవర్తిని దేవునిగా ఆరాధించుటకు ధూపము అర్పించని క్రైస్తవుల ప్రాణత్యాగమునకు దారి తీసినది.

*నది దృశ్యము మరియు ప్రకటనలోని జీవవృక్షము.* వృద్ధుడైన యోహాను, బహుశా, చివరిగా జీవించిన అపొస్తలుడు. పత్మాసు ద్వీపములో బందీగా ఉన్నాడు; ఆయన దైవ దర్శనములు పొందాడు. ఆ దర్శనములు బాధింపబడుతున్న దేవుని ప్రజలైనవారిని ప్రోత్సహించి, స్థిరపరచుటకు ఉద్దేశించబడినవి. క్రొత్త నిబంధనలో చివరి పుస్తకమైన, ప్రకటనలో ఈ దర్శనములు నమోదు చేయబడినవి. ప్రవచన వాక్కులు చదువువాడు మరియు "వాటిని విని ఇందులో వ్రాయబడిన సంగతులను గైకొను" వారిపైకి ప్రత్యేక దీవెనలు పలుకబడినవి (ప్రకటన 1:3).

ఈ దర్శనములలో, యోహాను పాత నిబంధన కాలములో యూదులకు సంభవించిన దాని మధ్య మరియు మొదటి శతాబ్దములో సంఘమునకు సంభవిస్తున్న దాని మధ్య ఉన్న సంబంధమును గుర్తించెను. బబులోను సైన్యాలు యూదాను నశింపజేసి, దావీదు యొక్క ఆఖరి పాలనా వారసుని బంధించి ప్రాచీన సామిప్య తూర్పునంతటిని తుడిచివేసిన విధముగా, రోమా ఆ ప్రపంచమును జయించెను. సంఘమును నశింపజేయాలన్న కోరికతో మరియు దావీదు నుండి వచ్చిన రాజుయైన, యేసు క్రీస్తు చెప్పుకున్నవాటిని రద్దు చేయాలనే కోరికతో (ప్రకటన 12:5, 17) వారు ఇప్పుడు హతసాక్షుల రక్తపు మత్తులైయున్నారు (ప్రకటన 17: 5,6).

తీవ్రమైన సంక్షోభ సమయములో, క్రైస్తవుల వాగ్దానములైన దీర్ఘాయువు లేదా భౌతిక ఆశీర్వాదములను దేవుడు కలిగియుండలేదు. హింస మరియు మరణము నుండి కాపాడెదనని ఆయన వాగ్దానము చేయలేదు. భూలోకములో మరియు బాగా నీరు ప్రవహించిన ఏదెనువంటి పరదైసులో అక్షరాల జీవవృక్షమును గూర్చిన ఊహ లేదు. రెండూ రోమీయులచే క్రీ.శ. 70లో నాశనము చేయబడిన తరువాత, మహిమాన్విత నిర్మాణమైన యెరూషలేము మరియు దాని యొక్క దేవాలయము అక్కడ లేవు. ఇంకా, అక్షరాల, పునఃస్థాపించబడిన సింహాసనము మరియు పాలస్తీనా దేశములో దావీదు రాజ్యమును గూర్చిన వాడిపోయిన కలలకు చైతన్యము లేదు. దేవుని యొక్క నిత్య దీవెనల గూర్చి విస్తృత మరియు అధిక దృశ్యము కలిగియుండులాగున క్రైస్తవులు పురికొల్పబడిరి. భౌతిక సంపద మరియు ఈ లోక భోగములకు పైగా ఉన్నఎదుగుదల వారికి అవసరమైయున్నది మరియు దేవుడు ఎప్పటికీ పాలించే శాశ్వత సింహాసనముపై దృష్టియుంచాలి. మన పాపముల కొరకు చనిపోయి తిరిగి మరణము నుండి లేపబడి, పరలోకమునకు ఆరోహణమై, ఇప్పుడు ప్రభువుల ప్రభువు మరియు రాజుల రాజుగా పాలిస్తున్న వధింపబడిన గొర్రెపిల్లయైన, యేసుక్రీస్తు మీద వారు తమ దృష్టి ఉంచాలి.

క్రొత్త నిబంధనలోని వాగ్దాన భూమి ఎప్పటికిని భూమిమీద తాత్కాలిక ప్రదేశము కాదు; భౌతిక ఆకాశము మరియు భూమి గతించుపోవువరకు (ప్రకటన 21) అది పరలోకంలో నిలువచేయబడిన ఒక నూతన యెరూషలేము (హెబ్రీ. 11:10, 16; 1 పేతురు 1:3–5; 2 పేతురు 3:9–13). నమ్మకస్తుల కొరకైన ఈ విశ్రాంతి భూమి క్రొత్త, శాశ్వత ఏదెను తోటవలె ప్రదర్శింపబడినది. అసలు పరదైసు యొక్క భాషా చిహ్నాములలో, “జీవవృక్షమునకు హక్కు” జయించిన వారికి వాగ్దానము చేయబడినది; “పన్నెండు రకముల పండ్లను” అది ఇస్తుంది, మరియు దాని ఆకులు “జనములను స్వస్థపరచుటకు” వినియోగించును (ప్రకటన 2:7; 22:2, 14). “జీవజలముల నది” జీవమునకు మూలమైన “దేవుని సింహాసనము మరియు గొర్రెపిల్ల నుండి” వచ్చును (ప్రకటన 22:1). ఇచ్ఛయించిన, ఆత్మ మరియు పెండ్లి కుమార్తె యొక్క స్వాగత పిలుపుకు స్పందించిన, దప్పిగొనిన ఆత్మలకు “జీవజలములు” ఇవ్వబడును (ప్రకటన 22:17).

> ఇకమీదట శాపగ్రస్తమైనదేదియు దానిలో ఉండదు, దేవుని యొక్కయు గొర్రెపిల్లయొక్కయు సింహాసనము దానిలో ఉండును ... రాత్రి యికనెన్నడు ఉండదు; దీపకాంతియైనను సూర్యకాంతియైనను వారికక్కరలేదు; దేవుడైన ప్రభువే వారిమీద ప్రకాశించును. వారు యుగయుగములు రాజ్యము చేయుదురు (ప్రకటన 22:3–5).

ఈ చిహ్నాములు, మరియు ఇతరమైనవి, “మరణము వరకు నమ్మకముగా”

క్రీస్తులోనున్న వారికి దేవుడు సిద్ధము చేసిన నిత్యజీవము యొక్క శోధింపజాలని సంపదలను వర్ణిస్తుంది (ప్రకటన 2:10).

---

సూచనలు

[1]Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 1–17*, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1990), 142. [2]Gordon J. Wenham, *Genesis 1–15*, Word Biblical Commentary, vol. 1 (Waco, Tex.: Word Books, 1987), 35. [3]Victor P. Hamilton, "שָׁבַת," in *TWOT*, 2:902–3. [4]Thomas E. McComiskey, "קָדַשׁ," in *TWOT*, 2:786. [5]John T. Willis, *Genesis*, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1979), 98. [6]Wenham, 57. [7]Ludwig Koehler and Walter Baumgartner, *The Hebrew and Aramaic Lexicon of the Old Testament*, study ed., trans. and ed. M. E. J. Richardson (Boston: Brill, 2001), 1:399–401. ఈ పుస్తకములో *yom* అనే పదము క్రింద సుమారుగా పది వివిధ వ్యుత్పత్తర్థాలు కలవు. [8]పగటిని మరియు రాత్రిని ఏలేటువంటి సూర్య చంద్రులు సృజింపబడక ముందటి మూడు దినాలు సుదీర్ఘమైనవని వాదించవచ్చు (1:16, 18). అయినను, సృష్టి దినముల యొక్క నిడివిని గురించి మన వాక్యభాగము ఎట్టి బేధాలను సూచించుటలేదు. [9]Derek Kidner, *Genesis: An Introduction and Commentary*, The Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: InterVarsity Press, 1967), 59. [10]NASB యొక్క కొన్ని అచ్చులలో క్రింది సూచనలలో ఈ పద సమూహము కనబడుతుంది.

[11]Ronald B. Allen, "עֵשֶׂב," in *TWOT*, 2:700. [12]Robert L. Alden, "אֵד," in *TWOT*, 1:17. [13]Ibid. [14]B. Otzen, "יָצַר," in *Theological Dictionary of the Old Testament*, trans. David E. Green, ed. G. Johannes Botterweck and Helmer Ringgren (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1990), 6:259, 262. [15]Kidner, 60. [16]జీవము మరియు మరణము, అలానే మానవుని ప్రాణము మరియు/లేదా ఆత్మను గూర్చి పాత నిబంధన చాలా మర్మములను కలిగియుంది. ఈ విషయాలపై పరిపూర్ణ జ్ఞానము యేసు క్రీస్తు ద్వారానే వచ్చింది. కాబట్టి, ఆయన ద్వారా మరణము అంతము కాదనియు, ఈ శరీరము యొక్క మరణము తరువాత కూడా మానవునిలో ఒక భాగము జీవిస్తూనే ఉంటుందనియు మనము తెలుసుకొనగలము. ఈ విషయముపై ఈ క్రింది వాక్యాలు కావాల్సిన జ్ఞానాన్ని కలిగిస్తాయి: మత్తయి 10:28; లూకా 16:19–31; 20:37, 38; 23:43; యోహాను 11:25, 26; అపొ. 2:30, 31; 2 కొరింథీ 4:16–5:8; ఫిలిప్పీ1:21–23; 1 పేతురు 1:3; ప్రకటన 6:9–11. [17]James E. Smith, "גַּן," in *TWOT*, 1:168–69. [18]Howard N. Wallace, "Eden, Garden of," in *The Anchor Bible Dictionary,* ed. David Noel Freedman (New York: Doubleday, 1992), 2:281. [19]Carl Schultz, "עֵדֶן," in *TWOT*, 2:646. [20]E. A. Speiser, *Genesis*, The Anchor Bible, vol. 1 (Garden City, N.Y.: Doubleday & Co., 1964), 26.

[21]Hamilton, *The Book of Genesis: Chapters 1–17*, 163–64. [22]Willis, 106. [23]Ibid., 107. [24]Bruce Vawter, *On Genesis: A New Reading* (Garden City, N.Y.:

Doubleday & Co., 1977), 73. [25]William White, "שׁאר," in *TWOT*, 2:825. [26]ఈ సందర్భంలో *ro'shim* యొక్క సరైన అర్థాన్ని కనుగొనే విధంలో, ఈ నాలుగు నదులు ప్రవహించిన దిక్కులను గూర్చియు మరియు ఈ వివరణ ఇస్తున్నప్పుడు సదరు రచయిత యొక్క భౌగోళిక దృక్పథమును గూర్చియు కొన్ని ప్రశ్నలు తలెత్తుతాయి. [27]నోవహు విశ్రాంతి తీసుకొనుటకు వచ్చిన "అరారాతు పర్వతములు" యొక్క సాధారణ స్థానము ఇదే (8:4). [28]John H. Walton, Victor H. Matthews, and Mark W. Chavalas, *The IVP Bible Background Commentary: Old Testament* (Downers Grove, Ill.: InterVarsity Press, 2000), 31; see James A. Sauer, "The River Runs Dry," *Biblical Archaeology Review* 22, no. 4 (July–August 1996): 52–57, 64. [29]KJV లో కూషు "ఇతియోపియ"గా 2:13లో ఉంది. [30]Speiser, 66, 72.

[31]Hamilton, *The Book of Genesis: Chapters 1–17*, 170. [32]*The Creation Epic* 6.8, 34–37. [33]John E. Hartley, "שָׁמַר," in *TWOT*, 2:939. [34]Leonard J. Coppes, "נוּחַ," in *TWOT*, 2:562. [35]Speiser, 17. [36]Ronald Youngblood, Notes on Genesis, in *The NIV Study Bible*, ed. Kenneth Barker (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985), 9. [37]John Donne, "Meditation XVII," in *The Complete Poetry and Selected Prose of John Donne & the Complete Poetry of William Blake*, ed. Robert Silliman Hillyer, John Hayward, and Geoffrey Langdon Keynes (New York: Modern Library, Random House, 1941), 332. [38]U. Bergmann, "עזר," in *Theological Lexicon of the Old Testament*, trans. Mark E. Biddle, ed. Ernst Jenni and Claus Westermann (Peabody, Mass.: Hendrickson Publishers, 1997), 2:872. [39]దీనికి అనుగుణ్యమైన క్రియారూపము "సహాయము" (עָזַר, *'azar*) కనిపించే వాక్యభాగాలు కూడా ఈ లెక్కలో భాగం. "help" (עָזַר, *'azar*) appears. [40]Leonard J. Coppes, "נֶגֶד," in *TWOT*, 2:550.

[41]Wenham, 68. [42]Ibid. [43]Kidner, 65. [44]William White, "תַּרְדֵּמָה," in *TWOT*, 2:833–34. [45]John E. Hartley, "צֵלָע," in *TWOT*, 2:768. [46]Kenneth A. Mathews, *Genesis 1–11:26*, The New American Commentary, vol. 1A (Nashville: Broadman & Holman Publishers, 1996), 216–17. [47]Siegfried Wagner, "בָּנָה," in *Theological Dictionary of the Old Testament*, trans. John T. Willis, ed. G. Johannes Botterweck and Helmer Ringgren (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1975), 2:166–68, 173. [48]Hamilton, *The Book of Genesis: Chapters 1–17*, 179. [49]ఇదే మానవుని మొట్టమొదటి నమోదిత ఉపన్యాసం. 2:19, 20 లో జీవము కలిగిన ప్రతి జీవికి ఆయన నామకరణం చేసాడు, కాని అతడు వాటికిచ్చిన పేర్లు ఈ వాక్యంలో ఇవ్వబడలేదు. [50]N. P. Bratsiotis, "אִישׁ," in *Theological Dictionary of the Old Testament*, trans. John T. Willis, ed. G. Johannes Botterweck and Helmer Ringgren (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1974), 1:223–26.

[51]Hamilton, *The Book of Genesis: Chapters 1–17*, 180. [52]Wenham, 70–71. [53]John E. Hartley, *Genesis*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 2000), 63. [54]ఆదికాండము 2:22–24 లో "నిబంధన" בְּרִית (*b^e^rith*) అనే పదము వాడబడనప్పటికీ, ఇక్కడ అదే

భావమునిస్తుంది. తరువాత $b^{e}rith$ అనే పదం స్త్రీపురుషుల మధ్య వివాహ నిబంధనను సూచించడానికి ప్రయోగించబడింది (సామెత 2:17; మలాకీ 2:14). ఈ వివాహ నిబంధనను, దేవుడు (భర్తగా) మరియు ఇశ్రాయేలు (భార్యగా) మధ్య నిర్గమములో జరిగిన "వివాహ" బంధానికి పోల్చారు (యిర్మీయా 31:32; యెహెజ్కేలు 16:8). [55]Hartley, *Genesis*, 64. [56]Horst Seebass, "בּוֹשׁ," "in *Theological Dictionary of the Old Testament*, 2:52. [57]Ibid., 2:52–60. [58]Bruce K. Waltke, *Genesis: A Commentary* (Grand Rapids, Mich.: Zondervan Publishers, 2001), 90. [59]లేవీయకాండము 18:6–17 లో, NASB లో అక్షర అర్థమైన "దిగంబరత్వాన్ని బయలు పరచడం" అని ఉంది. ఈ జాతీయము యొక్క అర్థము "లైంగిక సంబంధము కలిగి యుండుట" లేదా ఇట్టి ఒక అర్థాన్ని ఇస్తుంది (NIV; NLT; NCV; TEV; CEV; NJB; NEB; REB). [60]ద్వితీయోపదేశకాండము 16:13–15 లో ఇది లేనప్పటికీ, ఆరాధనకు వర్తించే క్రమంలో (నిర్గమ. 3:12; 4:23; 7:16; 10:26 చూడండి) ఇదే పదము కనబడుతుంది.

[61]ఈ ఆశ అనుగ్రహింపబడియుంటుంది, ఎందుకంటే సొలొమోను అనే పదమునకు మూల అర్థము "సమాధానము" (David F. Payne, "Solomon," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988], 4:566). [62]ఇటువంటి వ్యాఖ్యానాలు చాలా ప్రసంగి పుస్తకములో పునరావృతమైనవి. ప్రసంగి 12:13, 14 సూచించునట్లుగా, సొలొమోను తన వ్యర్థమైన, అనైతికమైన మరియు విగ్రహారాధన సంబంధమైన జీవితములో పశ్చాత్తాపపడినట్లుగా మనం ఆశించవచ్చు. అయినను, తన కుమారుడైన రెహబాము మరియు తన వెనుక వచ్చిన ఇతరులకు చాలా విషాదకరమైన వారసత్వాన్ని వదిలాడు. [63]A. Leo Oppenheim, trans., "The Annals of Sennacherib," in *Ancient Near Eastern Texts: Relating to the Old Testament*, 3d ed., ed. James B. Pritchard (Princeton, N.J.: Princeton University Press, 1969), 288. 2 రాజులు 18; 19 మరియు యెషయా 36; 37 లోని పరిశుద్ధ గ్రంథమును చూడండి. [64]యోవేలు 3:18 ఇటువంటి ఒక వివరణే ఇస్తుంది: "నీటి ఊట యెహోవా మందిరములోనుండి ఉబికి పారి షిత్తీము లోయను తడుపును." [65]యోవేలు 3:18 మరియు జెకర్యా 14:8 ఇదే ముఖ్యమైన ఆలోచనను కలిగియున్నవి: దేవుని ప్రజల వినాశనము మరియు చెర తరువాత దేవునిచే యెరూషలేము మరలా ఆశీర్వదింపబడుతుంది, దేవుని మందిరములో నుండి (లేదా పట్టణములో నుండి) జీవజలములు ప్రవహించి, భూమిని ఫలభరితము చేయును. [66]ఏదెను తోటలోవలే ఇది ఏకైక "జీవ వృక్షము" కాదు, కాని అసలైన వృక్షంతో పోలిస్తే ఈ వృక్షాలు అంతగా వ్యత్యాసం కావు ఎందుకంటే దేవుని జీవము మరియు ఆరోగ్యమునకు ఒక మూలముగా ఇవి చూపుతున్నాయి. ఆయనే తమ జీవితకాలములను పొడిగించి భౌతిక మరియు ఆత్మీయ స్వస్థతల ద్వారా వాగ్దాన దేశములో అత్యున్నతంగా నాణ్యమైన జీవితాన్ని ఇస్తాడు. [67]*The Testament of the Twelve Patriarchs* అనబడే మిథ్యయైన శిలాశాసనాలను గూర్చిన (pseudepigraphal) రచనలో ఇటువంటి సాదృశ్యాలు చూడగలం. ఒక భాగము "సముద్రములను జలములు కప్పునట్లుగా లోకము దేవుని జ్ఞానముతో కప్పబడును" మరియు ఒక రాజు మరియు యాజకుడు "పరదైసు యొక్క ద్వారాలు తెరుస్తాడు" అనేటువంటి సమయము కొరకు ఎదురు చూస్తుంది. ఆయన "ఆదాము కాలము నుండి భయపెట్టిన ఖడ్గమును తొలగిస్తాడు" మరియు "పరుశుద్ధులు జీవ వృక్ష ఫలములు

తినునట్లు" చేస్తాడు (*The Testament of Levi* 18.5, 10). [68]ఈ పండుగ సమయములో యూదులు చేసే వేడుకలను బబులోను తాల్ముడ్ 48a–48b మరియు మిష్నా *Sukkah* 3.8–4.9 లో వివరించబడ్డాయి. ఈ వేడుకను గూర్చిన దేవుని ఆజ్ఞ లేవీయకాండము 23:34–43 లో ఇవ్వబడ్డాయి. ఈ పండుగ దేవుడు "ఐగుప్తులోనుండి వారిని రప్పించిన" (లేవీ. 23:43) తరువాత "ఇశ్రాయేలీ కుమారులు పర్ణశాలలలో జీవించిన" కాలమును జ్ఞాపకము చేసుకుంటుంటుంది.